www.vijayakranthinews.com

# విజయక్రాంతి

VOICE OF TELANGANA

Published from Hyderabad, Khammam, Nizamabad

హైదరాబాద్,
శుక్రవారం, 19 ఏప్రిల్ 2024

పేజీలు 16, సంపుటి 7, సంచిక 2

వెల: రూ. 6.50/–



భద్రాద్రిలో గురువారం జరిగిన రామయ్య పట్టాభిషేక మహోత్సవానికి పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న రాష్ట్ర గవర్నర్ రాధాక్రిష్ణన్

# ఓట్ల పండుగ

- మొదటి రోజు 48 నామినేషన్లు
- ఆన్‌లైన్‌లో దాఖలు చేసే అవకాశం
- ఎన్నికల ఖర్చులకు ప్రత్యేక బ్యాంకు ఖాతా
- నామినేషన్ పత్రాలు జాగ్రత్తగా నింపాలి
- తప్పులుంటే తిరస్కరణ ప్రమాదం
- కేసుల పూర్తి వివరాలు బహిర్గతపర్చాలి
- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకే నామినేషన్లు



మీడియాతో మాట్లాడుతున్న సీఈవో వికాస్‌రాజ్

హైదరాబాద్, ఏప్రిల్ 15 (విజయక్రాంతి ): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలకు గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. మొదటి రోజు బీజేపీ, కాంగ్రెస్‌తో పాటు స్వతంత్ర అభ్యర్థులు కలిపి మొత్తం 42 మంది 48 నామినేషన్లు వేశారు. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలు, కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలకు ఎన్నికల సంఘం గురువారమే నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ వెంటనే నామినేషన్ల దాఖలు మొదలైంది. ఈ సందర్భంగా సీఈవో వికాస్‌రాజు గురువారం మీడియాతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో 3.31 కోట్ల మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నట్టు తెలిపారు. ఓటర్లలో 18 –19 ఏళ్ల వయసు వారు దాదాపు 10 లక్షల మంది ఉన్నారని వెల్లడించారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో కూడా నామినేషన్లు దాఖలు చేయవచ్చని చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా నామినేషన్ వేస్తే.. వాటికి సంబంధించిన నకలును ఈ నెల 24 లోపు సంబంధిత రిటర్నింగ్ అధికారికి అందజేయాలని సూచించారు. అభ్యర్థులు నామినేషన్ పత్రాలు, అఫిడవిట్లను జాగ్రత్తగా నింపాలని కోరారు. ఎన్నికల ఖర్చుపై అభ్యర్థి కొత్తగా బ్యాంక్ ఖాతాను ఓపెన్ చేయాలని, ఎన్నికల ఖర్చులన్నీ ఆ అకౌంట్ ద్వారానే జరపాలని సూచించారు. బ్యాంకు ఖాతా ఎక్కడైనా ఓపెన్ చేయవచ్చని తెలిపారు. ఒక్కో అభ్యర్థి మూడు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చని చెప్పారు. వాటితో పాటు కొత్తగా తీయించుకొన్న 5 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు కూడా సమర్పించాలని తెలిపారు. ఫొటోలు స్పష్టంగా ఉండాలని, టోపీలు, కళ్లద్దాలు పెట్టుకుని ఉన్న ఫొటోలు ఇవ్వకూడదని సూచించారు. అఫిడవిట్‌లోని ప్రతి పేజీలో అభ్యర్థులు సంతకం చేయాలని, ప్రతి కాలమ్ నింపాలని కోరారు. నామినేషన్ కార్యక్రమం ఈ నెల 25 వరకు, నామినేషన్ల పరిశీలన 26న ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకే నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు.

**9,500 సమస్యాత్మక కేంద్రాలు**

నామినేషన్ వేసే అభ్యర్థి రూ.25 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని

–తరువాయి 4లో..

## పార్టీ మారిన నేతలే దిక్కా!

- జంపింగ్ జపాంగ్‌లకే గుర్తింపు
- లోక్‌సభ ఎన్నికల్లో వారికే టికెట్లు
- పార్టీ సిద్ధాంతాలకు తిలోదకాలు

హైదరాబాద్, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): ఒక పార్టీ.. ఒక సిద్ధాంతం.. అంటూ ఉండట్లేదు. ప్రజలకు మేలు కలిగేలా పరిపాలనను పక్కనపెట్టి, తమకు లాభదాయకంగా ఉండే పదవులే లక్ష్యంగా నేతలు పార్టీలు మారుతున్నారు. దుంకుడు కప్పలను తలదన్నేలా వీరు పార్టీలు మారుతున్నారు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో మూడు ప్రధాన పార్టీలు ప్రకటించిన అభ్యర్థులను పరిశీలిస్తే ఇదే మనకు అవగతం అవుతుంది.

ప్రధాన పార్టీలు బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నుంచి 17 స్థానాలకు ప్రకటించిన అభ్యర్థుల రాజకీయ ప్రస్థానం పరిశీలిస్తే.. ఒకింత వెగటు కలుగకమానదు. ఈ పార్టీ ఆ పార్టీ

–తరువాయి 12లో..

## తొలి విడత పోలింగ్ నేడే

- 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎన్నికలు
- 102 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ నిర్వహణ

8

### వారం వర్జ్యం:

కామద్దై ఏకాదశి

శుక్రవారం, సూర్యోదయం: 5.57, సూర్యాస్తమయం: 6.33, శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, చైత్రమాసం, శుక్లపక్షం, ఏకాదశి: రా.8.26, మఘ:ఉ.11.42, తదుపరి పూర్వఫల్గుణి, వర్జ్యం: రా.8.32ల 10.18, రాహుకాలం: ఉ.10.30ల 12.00, యమగండ కాలం: ఉ.3.00ల 4.30, దుర్ముహూర్తం: ఉ.8.29ల 9.19, పున: ప.12.41ల 1.31.

### ఉష్ణోగ్రతలు

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| కరీంనగర్ | 42.0°c | 42.0°c |
| నల్లగొండ | 42.0°c | 38.0°c |
| ఆదిలాబాద్ | 42.0°c | 34.0°c |
| ఖమ్మం | 42.0°c | 27.0°c |
| వరంగల్ | 41.0°c | 41.0°c |
| నిజామాబాద్ | 41.0°c | 36.0°c |
| మహబూబ్‌నగర్ | 39.0°c | 39.0°c |
| మెదక్ | 39.0°c | 39.0°c |
| రంగారెడ్డి | 39.0°c | 39.0°c |
| హైదరాబాద్ | 38.0°c | 26.0°c |

### బులియన్ ధరలు

(10 గ్రాములు)

| | | |
|---|---|---|
| హైదరాబాద్ (24క్యారెట్లు) | 73,800 | ▼ 300 |
| (22క్యారెట్లు) | 67,650 | ▼ 300 |

వెండి (కేజీ)

హైదరాబాద్ 90,000



నభా నటేష్ వర్సెస్ ప్రియదర్శి

సైన్మాలో..

### కోడిగుడ్ల ధరలు ₹

హోల్‌సేల్ - నెక్ / రిటైల్ - 4.70

| | |
|---|---|
| హైదరాబాద్ | 410-00 |
| వరంగల్ | 412-00 |
| డజను గుడ్లు | రూ.60-00 |

### కొంటె కోణం



మీకు టికెట్ రాకపోవడమే మంచిదైంది! ఈ ఎండలో ప్రచారం మీవల్ల అయ్యేదా..!



విజయక్రాంతి పత్రికను ఆవిష్కరిస్తున్న చైర్మన్ సీఎల్ రాజం

## తెలంగాణ ఆకాంక్షల వారధి విజయక్రాంతి

### పత్రిక ప్రారంభోత్సవంలో చైర్మన్ సీఎల్ రాజం

హైదరాబాద్, సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఏప్రిల్ 18 (విజయక్రాంతి) : తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షల వారధి 'విజయక్రాంతి' తెలుగు దిన పత్రిక అని పత్రిక చైర్మన్ సీఎల్ రాజం అన్నారు. గురువారం జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు సమీపంలోని ఇంటర్ కాంటినెంటల్ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రధాన కార్యాలయంలో పత్రికా మేనేజింగ్ డైరెక్టర్, డైరెక్టర్లతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటర్ కాంటినెంటల్ పబ్లికేషన్స్ సంస్థ ఉద్యోగులు, జర్నలిస్టులతో కలిసి ఆయన 'విజయక్రాంతి' పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలు ప్రతిబింబించేలా విజయక్రాంతి ఉంటుందన్నారు. సుదీర్ఘ పోరాటాల ద్వారా తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. విజయక్రాంతి తెలంగాణ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే పరమావధిగా బాధ్యతాయుతమైన కర్తవ్యదీక్షను నిర్వర్తించాలని సూచించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలు పూర్తిస్థాయిలో నెరవేరలేదన్నారు. అయితే ప్రభుత్వం చేస్తున్న మంచి చెడులతో పాటు ప్రజల కష్ట సుఖాలకు కూడా విజయక్రాంతిలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. విజయక్రాంతి జర్నలిస్టులు, ఉద్యోగులు ఒక కుటుంబంగా సమిష్టిగా పనిచేసి విజయక్రాంతి పత్రికను తెలంగాణ రాష్ట్రంలో నెంబర్ వన్ పత్రికగా నిలబెట్టాలన్నారు. ఈ సందర్భంగా

–తరువాయి 2లో..

# అంకిత భావంతో పనిచేశా

- తెలంగాణకు 10 లక్షల కోట్లు తెచ్చిన
- భూదందాలు, సెటిల్మెంట్లు నా డిక్షనరీలోనే లేవు
- నాపై ఇప్పటివరకు ఒక్క పోలీస్ కేసు కూడా లేదు
- ప్రజలకు నివేదన కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- పదేండ్లలో కేంద్రంనుంచి తెచ్చిన నిధులపై పత్రం విడుదల

బాగా పనిచేశానని భావిస్తేనే నాకు మళ్లీ ఓటెయ్యండి





సికింద్రాబాద్ నియోజకవర్గంలో, రాష్ట్రంలో తాను చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ గురువారం హైదరాబాద్‌లో ఓ పుస్తకాన్ని విడుదల చేస్తున్న కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): ఎమ్మెల్యేగా ఉన్నా, ఎంపీ, కేంద్ర మంత్రి అయినా అవినీతి ఆరోపణలు, భూదందాలు, సెటిల్మెంట్లు అనేవి తన డిక్షనరీలోనే లేవని, తనపై ఒక్క పోలీసు కేసు కూడా లేదని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. పార్లమెంటుకు మరోసారి వెళ్లేందుకు సరైన అభ్యర్థినే అని భావిస్తేనే మరోసారి తనకు అవకాశం కల్పించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని పింగళి వెంకట్రామారెడ్డి కన్వెన్షన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో, రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ ఓ పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా

–తరువాయి 3లో..

**కిషన్‌రెడ్డి సంస్కారవంతుడు**

కిషన్‌రెడ్డి ఎంపీగా ఏం చేశారో చాలా వివరంగా చెప్పారు. ఆయన సంస్కారవంతుడు, నిజాయతీ ఉన్న వ్యక్తి. సికింద్రాబాద్ ఓటరుగా కిషన్‌రెడ్డిని చూసి గర్వపడుతున్నా. చేసిన అభివృద్ధిని చక్కగా వివరించారు. ప్రజా సమస్యల పట్ల ఆయన స్పందన బాగుంది. ఆయన పని తీరుకు ఉత్తమ మార్కులు వేస్తాను. ప్రజలు విచక్షణతో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి.

– జయప్రకాష్ నారాయణ,
లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు



## మోదీ కెప్టెన్సీలో ఐపీఎల్ కప్ బీజేపీదే

- 400 సీట్లలో ఘనవిజయం సాధించబోతున్నాం
- కరీంనగర్ అభివృద్ధికి 12 వేల కోట్లు తెచ్చిన
- విజయక్రాంతి' ప్రత్యేక ఇంటర్వ్యూలో బండి సంజయ్

5

# కాంగ్రెస్ సర్కార్‌కు బీజేపీ చెక్

రేవంత్ సర్కారును బీజేపీ కూల్చుతుంది • 104 మంది ఎమ్మెల్యేలున్న బీఆర్‌ఎస్‌నే వదలలేదు • 64 మంది ఉన్న కాంగ్రెస్‌ను వదిలిపెట్టదు

ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత • గట్టిగా పోరాడితే మెజార్టీ స్థానాలు మనవే • ఎమ్మెల్సీ కవితపై కక్షపూరితంగా కేసు

బీఆర్‌ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు • ఎంపీ అభ్యర్థులకు బీఫామ్‌లు, చెక్కులు అందజేత

హైదరాబాద్, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్నదని, గట్టిగా పోరాడితే బీఆర్‌ఎస్ మెజార్టీ ఎంపీ సీట్లు సాధిస్తుందని ఆ పార్టీ అధినేత కే చంద్రశేఖర్‌రావు అన్నారు. కాంగ్రెస్‌లోకి వలస వెళ్లిన బీఆర్‌ఎస్ నేతలు ఇప్పుడు బాధపడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్‌లో అంతా బీజేపీ పెత్తనమే నడుస్తోందని చెప్పారు. గతంలో 104 మంది ఎమ్మెల్యేలు ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ కుట్రలు చేసిందని, 64 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్న కాంగ్రెస్ సర్కార్‌ను కమలనాథులు ఎందుకు వదిలిపెడుతారని ప్రశ్నించారు. గురువారం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ రాష్ట్ర నాయకులతో కేసీఆర్ విస్తృత సమావేశం నిర్వహించారు. లోక్‌సభ ఎంపీ అభ్యర్థులకు బీఫామ్‌లు అందజేశారు. ఎన్నికల ఖర్చు నిమిత్తం ఒక్కో అభ్యర్థికి రూ.95 లక్షలు, కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదితకు రూ.45 లక్షల చెక్కులను అందించారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహాలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ భవిష్యత్తు అంతా బీఆర్‌ఎస్‌దేనని తెలిపారు. రైతుల సమస్యలపై పోరాడుతానని, ఉద్యమకాలం నాటి కేసీఆర్‌ను మళ్లీ చూస్తారని పేర్కొన్నారు. రైతుల సమస్యలే అజెండాగా ప్రజల్లోకి వెళ్లాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్‌లోకి కొందరు

–తరువాయి 2లో..



తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలతో జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు



గురువారం హైదరాబాద్‌లో విజయక్రాంతి దినపత్రికను ఆవిష్కరించిన సందర్భంగా ఇంటర్ కాంటినెంటల్ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఉద్యోగులు, జర్నలిస్టులతో పత్రిక చైర్మన్ సీఎల్ రాజం, ఎండీ చిలప్పగారి విజయారాజం, డైరెక్టర్లు చిలప్పగారి శ్రీకాంత్, చిలప్పగారి సౌమ్య

## నేటి నుంచి సీఎం సుడిగాలి పర్యటన

- 24 వరకు జిల్లాల్లో ఎన్నికల ప్రచారం

హైదరాబాద్, ఏప్రిల్ 15 (విజయక్రాంతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 పార్లమెంట్ నియోజక వర్గాల్లో సుడిగాలి పర్యటన చేయనున్నారు. గత రెండు రోజులు కేరళలో ప్రచారానికి వెళ్లగా.. శుక్రవారం నుంచి రోజూ రెండు సభలకు హాజరయ్యేలా కార్యాచరణ సిద్ధం చేశారు. శుక్రవారం ఉదయం మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి హాజరై బహిరంగ సభలో పాల్గొననున్నారు. సాయంత్రం మహబూబాబాద్‌లో నిర్వహించే సభకు రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. 20న ఉదయం మెదక్‌లో పార్టీ అభ్యర్థి నీలం మధు నామినేషన్ కార్యక్రమానికి హాజరై.. సాయంత్రం కర్ణాటకలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. 21న భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నామినేషన్‌కు హాజరై బహిరంగలో మాట్లా డనున్నారు. 22న ఆదిలాబాద్, 23న నాగర్‌కర్నూల్‌లో నిర్వహించే సభలకు సీఎం హాజరుకానున్నారు. 24న ఉదయం జహీరాబాద్, సాయంత్రం వరంగల్‌లో నిర్వహించే సభల్లో పాల్గొంటారు.

## నేటి నుంచి కళాశాలల్లో తనిఖీలు

హైదరాబాద్, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): జేఎన్‌టీయూ పరిధిలోని కళాశాలల్లో యూనివర్సిటీ అధికారులు శుక్రవారం నుంచి తనిఖీలు చేపట్టనున్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి అటానమస్, నాన్ అటానమస్ ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ కళాశాలల్లో ఈ తనిఖీలు జరపనున్నారు. ఈ మేరకు ఆయా కళాశాలల యాజమాన్యాలకు జేఎన్‌టీయూ ఈ నెల 15న సర్క్యులర్ జారీ చేసింది. ఫాక్ట్ ఫైండింగ్ కమిటీ (ఎఫ్‌ఎఫ్‌సీ) ఈ తనిఖీలను చేపట్టనుంది. యాజమాన్యాలు తనిఖీల సమయంలో అధ్యాపకులు, కళాశాలలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియజేయాలని సూచించింది. కళాశాలల్లో సరిపడా అధ్యాపకులు ఉన్నారా.. విద్యార్థులకు ల్యాబ్‌లు, వసతులు సక్రమంగా ఉన్నాయా అనే అంశాలను పరిశీలించి వచ్చే విద్యా సంవత్సరానికి కళాశాలకు గుర్తింపును ఇవ్వనున్నారు.



గురువారం హైదరాబాద్‌లో ఇంటర్ కాంటినెంటల్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయంలో విజయక్రాంతి పత్రిక ఆవిష్కరణ దృశ్యం


విజయక్రాంతి ప్రధాన కార్యాలయంలో పూజలో పాల్గొన్న చైర్మన్ సీఎల్ రాజం, ఎండీ విజయారాజం దంపతులు


ఖమ్మం టౌన్‌లో విజయక్రాంతి దినపత్రికను అమ్ముతున్న కిరాణా దుకాణం వ్యాపారి

# తెలంగాణ ఆకాంక్షల వారధి విజయక్రాంతి

(మొదటి పేజీ తరువాయి...)

ఇంటర్ కాంటినెంటల్ ఉద్యోగులకు చైర్మన్ సీఎల్ రాజం ప్రత్యేక శుభాకాంక్షలు చెప్పారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఇంటర్ కాంటినెంటల్ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ చిలప్పగారి విజయారాజం, డైరెక్టర్లు చిలప్పగారి శ్రీకాంత్, చిలప్పగారి సౌమ్య, ఎడిటర్ కె.కృష్ణమూర్తి, సీఈవో దేవళ్ల రాహుల్, స్టేట్ బ్యూరో చీఫ్ ఎక్కల్‌దేవి శ్రీనివాస్, హైదరాబాద్ సిటీబ్యూరో చీఫ్ బూడిద సుధాకర్, సెంట్రల్ డెస్క్ సీనియర్ జర్నలిస్టులు కె.రాంప్రసాద్, బెక్కం వేణు, ఎం.రాంచందర్, దోర్బల బాలశేఖరశర్మ, కె.రామకృష్ణ, సత్యప్రసాద్, ఇంతియాజ్, సర్క్యులేషన్ జీఎం శ్రీకాంత్, అడ్వర్టైజింగ్ జీఎం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఇంటర్ కాంటినెంటల్ కార్యాలయంలో విజయక్రాంతి దినపత్రికను ఆవిష్కరిస్తున్న చైర్మన్ సీఎల్ రాజం, ఎండీ విజయారాజం, డైరెక్టర్లు చిలప్పగారి శ్రీకాంత్, చిలప్పగారి సౌమ్య, సీఈవో దేవళ్ల రాహుల్ తదితరులు

# హైదరాబాద్‌కు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్


కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ఆహ్వానిస్తున్న ఎంపీ డాక్టర్ లక్ష్మణ్

- కిషన్‌రెడ్డి నామినేషన్‌కు అతిథిగా రాక

హైదరాబాద్, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హైదరాబాద్ చేరుకున్నారు. సికింద్రాబాద్ ఎంపీ, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఆయన గురువారం నగరానికి వచ్చారు. విమానాశ్రయంలో ఎంపీ డా.కె.లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు ఆయనకు స్వాగతం పలికారు.

# గరిష్ఠ స్థాయికి విద్యుత్ డిమాండ్

- జీహెచ్‌ఎంసీలో 4 వేల మెగావాట్లకుపైగా చేరిక
- గతేడాదితో పోల్చితే 16.11 శాతం వృద్ధి

| అంశం | 2022 ఏప్రిల్ | 2023 ఏప్రిల్ | 2024 ఏప్రిల్ |
|---|---|---|---|
| సగటు డిమాండ్ (మెగావాట్లు) | 3092 | 3148 | 3655 |
| సగటు వినియోగం (మిలియన్ యూనిట్లు) | 66.16 | 66.80 | 78.55 |
| డిమాండ్ వృద్ధి (శాతం) | – | 1.81 | 16.11 |
| వినియోగంలో వృద్ధి(శాతం) | – | 0.97 | 17.59 |

హైదరాబాద్, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): గ్రేటర్ హైదరాబాద్‌లో విద్యుత్తు డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. గురువారం ఆల్‌టైం రికార్డుగా 4,053 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ నమోదయ్యింది. గతేడాది మే 19న గ్రేటర్ పరిధిలో 3,756 మెగావాట్ల విద్యుత్తు డిమాండ్ నమోదు కాగా.. ఈ ఏడు ఒక నెల రోజుల ముందుగానే ఏప్రిల్ 18న ఆ రికార్డును తుడిసిపెట్టేసింది. గడిచిన మూడేండ్లలో గ్రేటర్‌లో నమోదైన విద్యుత్తు డిమాండ్, వినియోగం ఇలా ఉంది. గ్రేటర్ పరిధిలో గరిష్ఠ డిమాండ్, వినియోగంలో భారీగా పెరుగుదల నమోదవుతోంది. 2022లో గ్రేటర్ పరిధిలో ఏప్రిల్ నెలలో సగటున 3,092 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ ఉండగా.. 2023 ఏప్రిల్ నాటికి 3,148 మెగావాట్లకు చేరింది. అంటే సగటున 50 మెగావాట్లు పెరిగింది. దాని శాతం 1.81 మాత్రమే. కానీ అదే 2024 ఏప్రిల్‌లో చూసుకుంటే 3,655 మెగావాట్లకు చేరింది. అంటే సగటు డిమాండ్ 510 మెగావాట్లకు పెరగడంతో 16.11 శాతం వృద్ధి నమోదయ్యింది. వినియోగం విషయంలోనూ 2022 ఏప్రిల్‌లో 66.16 మిలియన్ యూనిట్ల సగటు నమోదవ్వగా 2023లో 66.80 మిలియన్ యూనిట్ల (0.97 శాతం వృద్ధి) సగటు ఉంది. 2024 ఏప్రిల్ నాటికి 78.55 మిలియన్ యూనిట్ల సగటుతో 17.59 శాతం వృద్ధి నమోదయ్యింది.










## డిప్యూటీ తహసీల్దార్ అసభ్య ప్రవర్తన

### చెంప చెల్లుమనిపించిన మహిళ

సంగారెడ్డి, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): నారాయణఖేడ్ పట్టణంలో అద్దెకు ఉంటున్న ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రాజుగౌడ్ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో చెంప చెల్లుమనిపించింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణఖేడ్ పట్టణంలో సువర్ణ సినిమా టాకీస్ రోడ్డులో డిప్యూటీ తహసీల్దార్ అద్దెకు ఉంటున్నాడు. తన ఫొటోలు, వీడియోలు సెల్‌ఫోన్‌లో తీస్తున్నారని బాధితురాలు తన భర్తకు తెలిపింది. దీంతో భర్త భార్యతో కలిసి డిప్యూటీ తహసీల్దార్‌పై గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్‌ఐ విద్యాచరణరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తహసీల్దార్‌పై కేసు నమోదు

### 50ఎకరాల భూ యజమాని కిడ్నాప్ కేసులో హస్తం

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి తహసీల్దార్ కట్ట వెంకటరంగారెడ్డిపై సైబరాబాద్ పరిధిలోని మోకిల పోలీసు స్టేషన్‌లో కిడ్నాప్ కేసు నమోదైంది. మండలంలోని చంద్రధన గ్రామంలో ఉన్న 50ఎకరాల భూ యజమాని శ్రీనివాస్‌రాజును కిడ్నాప్ కేసులో తహసీల్దార్ హస్తం ఉందని తేలింది. గత నవంబరు నెలలో శ్రీనివాసరాజును సూర్యనారాయణరాజు కిడ్నాప్ చేసి 24గంటల తరువాత తలకొండపల్లి తహసీల్దార్ కార్యాలయానికి తీసుకొచ్చారు. పాస్‌బుక్, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు లేకుండానే శ్రీనివాసరాజు నుంచి 30ఎకరాల భూమిని సూర్యనారాయణరాజుకు తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేశారు. గాయాలైన శ్రీనివాసరాజును చూసి కూడా తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేసినట్టు పోలీసులు గుర్తించారు. ప్రధాన నిందితుల్లో ఒకరైనా సాయితో నాలుగు రోజుల క్రితమే రూ. 10లక్షలకు తహసీల్దార్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. గత సంవత్సరం నవంబరు 16న 12న స్లాట్స్ బుక్ కాగా కేవలం శ్రీనివాసరాజు స్లాట్ మాత్రమే తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేశాడు. ఎన్నికల విధుల్లో ఉన్న తహసీల్దార్ కల్వకుర్తి నుంచి వచ్చి కేవలం శ్రీనివాసరాజు రిజిస్ట్రేషన్ ముగించుకుని మళ్లీ కల్వకుర్తి ఎన్నికల విధులకు వెళ్లినట్టు విచారణలో తేలింది. తహసీల్దార్ ఈ కేసుతో సంబంధం ఉందని నిర్ధారణకు వచ్చిన మోకిలా పోలీసులు వెంకటరంగారెడ్డిని నిందితుడి జాబితాలో చేర్చారు. 41–ఏ సీపీఆర్‌సీ కింద తహసీల్దార్‌కు నోటీసులు జారీ చేసి అరెస్టుకు రంగం సిద్ధం చేశారు.

## చిక్కడపల్లిలో రూ.3.5 లక్షలు స్వాధీనం

హైదరాబాద్ సిటీ బ్యూరో, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నగరవ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే గురువారం చిక్కడపల్లిలోని అచ్చయ్య నగర్, బాగ్‌లింగంపల్లి ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. కిషోర్ కుమార్ అనే వ్యక్తి హోండా ఎస్పీ 125 బైక్‌లో రూ.3,52,795 నగదు తరలిస్తుండగా పట్టుకున్నారు. నగదుకు సంబంధించి సరైన పత్రాలు చూపకపోవడంతో సీజ్ చేసి చిక్కడపల్లి పోలీసుల ద్వారా రిటర్నింగ్ అధికారికి అందజేశారు. అక్రమంగా నగదు తరలిస్తూ పట్టుబడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్ తెలిపారు.



గురువారం కాసాని జ్ఞానేశ్వర్‌కు బీఫాం అందజేస్తున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

# కాంగ్రెస్ సర్కార్‌కు బీజేపీ చెక్

(మొదటి పేజీ తరువాయి...)

వెళ్లినంత మాత్రాన బీఆర్‌ఎస్‌కు ఎలాంటి నష్టంలేదని తెలిపారు. పార్లమెంటులో గళం వినిపించాల్సిన అవసరం బీఆర్‌ఎస్‌కు ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో టీమ్‌వర్క్ లేదని, స్థిరత్వం ఎక్కడా కనిపించడంలేదని విమర్శించారు. ఎమ్మెల్సీ కవితపై ఎలాంటి కేసు లేకున్నా కక్షపూరితంగా అరెస్టు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ సీనియర్ నేత బీఎల్ సంతోష్‌కు నోటీసులు పంపినందుకు బీఆర్‌ఎస్‌పై కక్ష పెంచుకుని ఆరోపించారు. మనీలాండరింగ్ కేసులో ఇరికించి పార్టీని దొంగదెబ్బ తీయాలని బీజేపీ కుట్రలు చేస్తున్నదని మండిపడ్డారు. ఇసుక కుంగడంతో మేడిగడ్డ ఆనకట్ట వద్ద సమస్య వచ్చిందని తెలిపారు. రేవంత్‌రెడ్డి సర్కార్ మాటలు అధికారులు వినడంలేదని, కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మడం లేదని మజ్లిస్ నేత ఓవైసీ పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు.

### పోస్టుకార్డు ఉద్యమం

రూ.500 బోనస్‌తో సహా ప్రభుత్వం ఎగ్గొట్టిన హామీలను వెంటనే అమలు చేయాలని కేసీఆర్ డిమాండ్ చేశారు. నియోజకవర్గాలవారీగా పోస్ట్ కార్డు ఉద్యమం ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యమ కాలం నుంచి నేటివరకు తెలంగాణ ప్రజల హక్కులను కాపాడేది బీఆర్‌ఎస్ మాత్రమేనని, నాటి ఉద్యమ స్ఫూర్తిని ప్రదర్శించడం ద్వారా కాంగ్రెస్ అసమర్థ పాలనను ఎండగట్టాలని సూచించారు. లోక్‌సభ ఎన్నికల తరవాత బీజేపీ, కాంగ్రెస్‌ల కొట్లాటతో రాష్ట్రంలో రాజకీయ అనిశ్చితి నెలకొంటుందని కేసీఆర్ అన్నారు. ఆ పరిస్థితిని తట్టుకుని రాజకీయ అస్థిరతకు లోనుకాకుండా ఉండాలంటే బీఆర్‌ఎస్ బలంగా ఉండాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ కార్యకర్తలను అక్రమ అరెస్టు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నదని, దీనిని పార్టీ శ్రేణులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కేసులపై పోరాడేందుకు లీగల్ సెల్‌ను ఇప్పటికే పటిష్ఠం చేశామని, కేసులు ఎదుర్కొనేందుకు ఎంత ఖర్చయినా వెనకడుగు వేయకుండా కార్యకర్తలను కాపాడుకుంటామని స్పష్టంచేశారు. ఇందు కోసం రూ.10 కోట్లు బీఆర్‌ఎస్ లీగల్ సెల్ అకౌంట్‌కు కేటాయించినట్లు ప్రకటించారు.

### ఉదయం పొలంబాట, సాయంత్రం రోడ్ షోలు

లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి కేసీఆర్ కొత్త పంథా ఎంచుకున్నారు. త్వరలో బస్సు యాత్ర చేపడుతామని తెలిపారు. బీఆర్‌ఎస్ సభలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నదని చెప్పారు. చేవెళ్ల, మెదక్ నియోజకవర్గాల్లో సభలకు భారీగా జనం తరలివచ్చారని పేర్కొన్నారు. అంతకు ముందు సూర్యాపేట, జనగాం జిల్లాలో రైతుల సమస్యలపై పర్యటిస్తే పెద్ద సంఖ్యలో అన్నదాతలు వచ్చినట్లు తెలిపారు. ఈ నెల 22 నుంచి రోడ్ షోలు ఉంటాయని చెప్పారు. ఒక లోక్‌సభ పరిధిలోని రెండుమూడు అసెంబ్లీ స్థానాల్లో రోజుకు రెండుమూడు రోడ్ షోలు ప్లాన్ చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలవరకు రైతుల వద్దకు వెళ్లాలని, సాయంత్రం సమయంలో రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించాలని నిర్ణయించారు. వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్ కేంద్రాల్లో భారీ బహిరంగ సభలు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎంపీ అభ్యర్థుల విజయం కోసం ముందుస్తు ప్రణాళికలు చేసుకోవాలని, జిల్లా నాయకులు కూడా ఇతర పార్టీల మోసాలకు గురికాకుండా సొంతపార్టీ గెలుపుకోసం కృషి చేయాలని సూచించారు.


తెలంగాణ భవన్‌లో సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

# అంకిత భావంతో పనిచేశా

(మొదటి పేజీ తరువాయి...)

ఆయన మాట్లాడుతూ.. 2019లో సికింద్రాబాద్ ఎంపీగా ఎన్నికైనప్పటి నుంచి ఇప్పటివరకు అంకిత భావంతో పనిచేశానని, తనను మరోసారి ఆశీర్వదించి మరోసారి ఎంపీగా ఎన్నుకుంటే ఈ ప్రాంతాన్ని, రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీగా సికింద్రాబాద్ నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పదేళ్లలో రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల కేంద్ర నిధులు తీసుకొచ్చినట్లు ఆయన వెల్లడించారు.

## ఎంపీలంతా అభివృద్ధి పత్రాలివ్వాలి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తాను చేసిన అభివృద్ధిపై విడుదల చేసిన ప్రోగ్రెస్ రిపోర్ట్‌లాగే రాష్ట్రంలోని మిగతా 16 పార్లమెంట్ స్థానాల్లో ఎంపీలుగా పనిచేసినవారు సైతం ఇస్తే బాగుంటుంది. మిగతా నియోజకవర్గాల్లోనూ ఇదే ట్రెండ్ ప్రారంభమైతే తమ ఎంపీ చేసిన అభివృద్ధిపై ప్రజలకు స్పష్టత వస్తుంది. కేవలం ఎంపీలుగా చెలామణి అయ్యి అభివృద్ధిలో భాగస్వామ్యం కాని వారికి ప్రజలు మరోసారి అవకాశం ఇచ్చేందుకు ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తారు.

**– పాశం యాదగిరి, సీనియర్ జర్నలిస్ట్**

# 106 ఎకరాల భూమి అటవీ శాఖదే..

- జస్టిస్ సుందరేశ్, ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తీర్పు

హైదరాబాద్, ఏప్రిల్ 18 (విజయక్రాంతి) : భూపాలపల్లిలోని కొంపల్లి శివారులో ఉన్న 106.34 ఎకరాల భూమి అటవీ శాఖకే చెందుతుందని అత్యున్నత ధర్మాసనం గురువారం తీర్పు చెప్పింది. 1985లో వరంగల్ జిల్లా న్యాయస్థానంలో మహ్మద్ అబ్దుల్ ఖాసీం అనే వ్యక్తి ఆ భూమి తనదే అని పిటిషన్ వేశాడు. ఇరువైపులా వాదనలు విన్న కోర్టు 1994లో అటవీ శాఖకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. జిల్లా కోర్టు తీర్పును సవాల్ చేస్తూ అదే ఏడాది సదరు వ్యక్తి హైకోర్టును ఆశ్రయించగా వాదనల అనంతరం 2018లో అటవీ శాఖకే భూమి చెందుతుందని హైకోర్టు కూడా తేల్చి చెప్పింది. తీర్పుపై హైకోర్టులో అబ్దుల్ ఖాసీం రివ్యూ పిటిషన్ వేయగా మార్చి 2021లో భూమి అతనికే చెందుతుందని పేర్కొంది. మళ్లీ అటవీ శాఖ సుప్రీంకోర్టును ఆశ్రయించగా ఈ ఏడాది ఫిబ్రవరిలో స్పెషల్ లీవ్ పిటిషన్‌పై జస్టిస్ సుందరేశ్, ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించి అటవీ శాఖకే భూమి చెందుతుందని తీర్పు ఇచ్చింది.

# రవాణాకు 42 వేల కోట్లు

- కేంద్రపథకాల ద్వారా రుణాలు 38 వేల కోట్లు
- రీజినల్ రింగ్‌రోడ్డుకు 26 వేల కోట్ల నిధులు
- కేంద్రం నుంచి తెచ్చిన నిధులపై కిషన్‌రెడ్డి ప్రగతి నివేదిక

హైదరాబాద్, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి గత ఐదేండ్లలో చేసిన అభివృద్ధిపై గురువారం ప్రగతి పత్రం విడుదల చేశారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో తాను చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను ఓ పుస్తకం రూపంలో నియోజకవర్గంలోని ప్రజలు, మేధావులకు అందించారు. కిషన్‌రెడ్డి ప్రచురించిన ప్రోగ్రెస్ రిపోర్ట్‌లో ఈ కింది నిధులను కేంద్ర ప్రభుత్వం నుంచి తెచ్చినట్టు వివరించారు.

**కిషన్‌రెడ్డి తన ప్రగతి నివేదన పత్రంలో వెల్లడించిన వివరాలు**

| అంశం | నిధులు (రూ.కోట్లలో) |
|---|---|
| వైద్యం, ఆరోగ్య సంరక్షణ | 3,876 |
| రవాణా మౌలిక సదుపాయాలు | 42,833 |
| సైన్స్ అండ్ టెక్నాలజీ | 40 |
| విద్య, నైపుణ్య శిక్షణ | 1,268 |
| క్రీడలు, ఫిట్‌నెస్ | 18 |
| సాంస్కృతికం, పర్యాటకం | 563 |
| వివిధ కేంద్ర పథకాల ద్వారా ఇచ్చిన రుణాలు | 38,013 |
| రీజనల్ రింగ్ రోడ్డు | 26,000 |
| ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ | 627 |
| అంబర్‌పేట ఫ్లైఓవర్ | 266 |
| ఆరాంఘర్– శంషాబాద్ రహదారి విస్తరణ | 283 |
| సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ | 719 |
| చర్లపల్లి రైల్వేస్టేషన్ కొత్త టెర్మినల్ | 221 |
| హైదరాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధి | 336 |
| కాచిగూడ రైల్వేస్టేషన్ అభివృద్ధి | 375 |
| బేగంపేట రైల్వేస్టేషన్ అభివృద్ధి | 23 |
| ఔటర్ రింగ్ రైల్ | 12,500 |
| రైల్వే మ్యూజియం | 40 |
| ఎంఎంటీఎస్ ఫేజ్2 | 553 |
| ఎంఎంటీఎస్ ఫేజ్ 2 యాదాద్రి వరకు | 600 |
| సివిల్ ఏవియేషన్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ ఏర్పాటు | 353 |
| సనత్‌నగర్ ఈఎస్‌ఐసీ మెడికల్ కళాశాల, దవాఖాన | 1,438 |
| సనత్‌నగర్ ఈఎస్‌ఐసీ సూపర్ స్పెషాలిటీ దవాఖాన | 663 |
| బీబీనగర్ ఎయిమ్స్ | 1,366 |
| నేషనల్ యానిమల్ రీసెర్చ్ ఫెసిలిటీ సెంటర్ | 346 |
| 236 బస్తీ దవాఖానల ఏర్పాటు | 73 |
| హెల్తీ బేబీ షోతో 7 వేల పోషణ్ కిట్ల పంపిణీ | 2.5 |
| నేషనల్ సెంటర్ ఫర్ డిసీస్ కంట్రోల్ | 30 |
| ఐఐటీ హైదరాబాద్ | 1,089 |
| 3 కేంద్ర విశ్వవిద్యాలయాలకు | 105 |
| సీఎస్ఐఆర్, ఐఐసీటీల్లో ఎక్సలెన్స్ కేంద్రాలు | 10 |
| ఎన్ఐఈఎల్ఐటీ ఏర్పాటు | 5 |
| సఖి నివాస్ వసతి గృహం ఏర్పాటు | 6 |
| ఉస్మానియా వర్సిటీలో 2 ఎస్సీ హాస్టళ్ల నిర్మాణం | 30 |
| మహిళా పారిశ్రామికవేత్తల భవనం | 22 |
| 5 ఖేలో ఇండియా సెంటర్ల ఏర్పాటు | 17 |
| ఉస్మానియా వర్సిటీలో క్రీడా కేంద్రాలు | 14 |
| కంటోన్మెంట్ పార్క్ | 4 |
| హైదరాబాద్ సేఫ్ సిటీ ప్రాజెక్టు | 123 |
| కుతుబ్‌షాహీ సర్క్యూట్ అభివృద్ధి | 97 |
| ట్యాంక్‌బండ్ వద్ద సౌండ్ అండ్ లైట్ షో | 45 |
| గోల్కొండ కోట, ఓయూ సౌండ్ అండ్ లైట్ షో | 12 |
| గోల్కొండ కోట అభివృద్ధి పనులు | 16 |
| అబిడ్స్‌లో రామ్‌జీ గోండ్ ట్రైబల్ మ్యూజియం | 25 |
| చార్మినార్ అభివృద్ధి కోసం | 3 |
| మింట్ కాంపౌడ్ అభివృద్ధి పనులు | 5 |
| ఎపిగ్రఫీ మ్యూజియం | 20 |
| సంగీత నాటక అకాడమీ కల్చరల్ సెంటర్ | 25 |
| సైన్స్ మ్యూజియం | 233 |



గురువారం భద్రాద్రిలో పట్టాభిషిక్తుడైన సీతారామ చంద్రస్వామి

# రాజాధిరాజా.. రఘువంశ తేజా!

- భద్రాద్రిలో అట్టహాసంగా రామయ్య మహాపట్టాభిషేకం
- ముఖ్యఅతిథిగా విచ్చేసి పట్టువస్త్రాలు సమర్పించిన గవర్నర్ రాధాక్రిష్ణన్

ఖమ్మం , ఏప్రిల్ 18 (విజయక్రాంతి): శ్రీరామనవమి సందర్భంగా రామయ్య బుధవారం సీతమ్మను పరిణమయమాడి గురువారం కిరీటం, ఛత్రం, ఖడ్గం, రాజ దండం, గధాధారుడై పట్టాభిషిక్తుడైయ్యాడు. ఈ అపురూప ఘట్టానికి భద్రాచలంలోని మిథిలా ప్రాంగణం వేదికైంది. రఘువంశ పాలనాధీశుడిగా రామయ్య ఠీవిని చూసి భక్తజనం పులకించారు. తొలుత అర్చకులు పవిత్ర గోదావరి నుంచి ప్రధాన ఆలయంలో రామయ్య పాదాలకు స్నపనం చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాద్యాల నడుమ రామయ్యను మిథిలా ప్రాంగణానికి తీసుకొచ్చారు. పవిత్ర జలాలతో ఆభరణాలు, ఆయుధాలతో పాటు స్థల శుద్ధి చేశారు. పట్టాభిషేక మహోత్సవానికి విఘ్నం రాకుండా విశ్వక్సేన పూజ చేశారు. ముందుగా స్వామివారికి బంగారు పాదుకలు తొడిగారు. అనంతరం విశ్వక్సేనుడు అధిపతి అయి రాజముద్రికను సమర్పించారు. అనంతరం కుంభ హారతి, నక్షత్ర హారతులు ఇచ్చి పట్టాభిషేక ఘట్టాన్ని ముగించారు. అట్టహాసంగా జరిగిన ఈ వేడుకకు గవర్నర్ రాధాక్రిష్ణన్ హాజరయ్యారు. స్వామివారి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆయనకు హెలిప్యాడ్ వద్ద రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి హనుమంతరావు, కలెక్టర్ ప్రియాంక ఆల స్వాగతించారు. ఆలయంలో ఆలయ ఈవో రమాదేవి, ప్రధానార్చకులు, ఆలయ అధికారులు పూర్ణకుంభంతో ఆహ్వానించారు. పట్టాభిషేక వేడుకను వీక్షించేందుకు వేలాది మంది భక్తులు భద్రాద్రికి విచ్చేశారు. ప్రభుత్వ యంత్రాంగం వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ఎస్పీ రోహిత్‌రాజ్ ఆధ్వర్యంలో భద్రాచలం ఏఎస్పీ పరితోశ్ పంకజ్ పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సీతారాముల కల్యాణ వేడుక, శ్రీరాముని మహాపట్టాభిషేకాన్ని విజయవంతంగా పూర్తి చేసిన ప్రభుత్వ అధికారులు, ఆలయ అర్చకులు, సిబ్బందితో పాటు పోలీసులకు రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్ ప్రియాంక ఆల అభినందనలు తెలిపారు. వేడుకలకు మంచి కవరేజీ ఇచ్చిన విలేకర్లకు కృతజ్ఞతలు తెలిపారు.



పట్టాభిషేక మహోత్సవానికి శ్రీ సీతారామచంద్రస్వామిని తోడ్కొని వెళ్తున్న భక్తులు



## తెలంగాణది శతాబ్దాల చరిత్ర

- నాటి అస్మక జనపదమే నేటి రాష్ట్రం
- హెరిటేజ్ వీక్‌లో మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 18: క్రీస్తు పూర్వమే షోడశ (16) మహాజనపదాల్లో ఒకటిగా వెలుగొందిన అస్మక జనపదమే నేటి తెలంగాణ ప్రాంతం కావటం మనకు గర్వకారణమని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ ఏడాది 'చారిత్రక కట్టడాల వైవిధ్యాన్ని ఆవిష్కరించండి, ఆస్వాదించండి' అనే నినాదాన్ని యునెస్కో చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రపంచ వారసత్వ దినోత్సవం (ఏప్రిల్ 18) సంద ర్భంగా ప్రసిద్ధ చారిత్రక కట్టడాలు, వారసత్వ ప్రదేశాల వైభవాన్ని మంత్రి కొండా సురేఖ స్మరించుకున్నారు. తెలంగాణలో యునెస్కో గుర్తింపు పొందిన ఏకైక చారిత్రక కట్టడం రామప్ప దేవాలయం. ఈ సందర్భంగా రామప్పలోని శిల్ప కళారీతులను మంత్రి కొనియాడారు. తెలంగాణ శిల్పుల నేర్పును, కళానైపుణ్యాన్ని చాటి చెప్పే పాండవుల గుట్ట రాక్ పెయింటింగ్స్, జైన బౌద్ధ ఆరామాలు, వేయిస్తంభాల గుడి, ఓరుగల్లు కోట, పద్మాక్షి గుట్ట, భువనగిరి కోట, చార్మినార్, గోల్కొండ కోట, మక్కా మసీదు, మెదక్ చర్చి తదితర కట్టడాలు తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రపంచానికి చాటుతాయని మంత్రి తెలిపారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, రాష్ట్ర పురావస్తు శాఖలు కలిసి భారతదేశ సంస్కృతి, చారిత్రక కట్టడాలు, వాటి పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కలిపించేందుకు ఏటా హెరిటేజ్ వీక్‌ను నిర్వహిస్తున్నాయని మంత్రి తెలిపారు. ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఇంటాక్)ను దేశ చారిత్రక వారసత్వాన్ని కాపాడటానికి నాటి ప్రధాని ఇందిరాగాంధీ స్థాపించారని మంత్రి సురేఖ గుర్తు చేశారు.

# కాంగ్రెస్‌ది నిర్లక్ష్య వైఖరి

- ఎన్నికల లబ్ధి కోసం రైతులను ఇబ్బంది పెడుతోంది
- కాఫర్ డ్యామ్ కట్టి పొలాలకు నీళ్లు ఇవ్వాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




హైదరాబాద్, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రం, రైతుల ప్రయోజనం కంటే రాజకీయమే ముఖ్యమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు విమర్శించారు. ఆయన ఎక్స్ వేదికగా గురువారం స్పందిస్తూ ఇంత నికృష్టమైన రాజకీయాలు కేవలం లోక్‌సభ ఎన్నికల్లో లాభం కోసమేనా అంటూ ప్రశ్నించారు. మేడిగడ్డ దగ్గర కాఫర్ డ్యామ్ కట్టి, మరమ్మతులు చేయాలని, నీళ్లు ఎత్తిపోసి రైతులను ఆదుకోవాలని మాజీ సీఎం కేసీఆర్ డిమాండ్ చేస్తున్నారని వెల్లడించారు. నీటి పారుదల శాఖ ఇంజినీర్లు నివేదిక ఇచ్చిన తరువాత కాఫర్ డ్యామ్ కట్టేందుకు ఎల్ అండ్ టీ కంపెనీ ముందుకు వచ్చినా ఈ ప్రభుత్వం చిల్లర రాజకీయాలతో రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని మండిపడ్డారు. కేసీఆర్‌ను అబాసుపాలు చేయాలనే ఒకే ఒక్క ఎజెండాతో కాఫర్ డ్యామ్ కట్టకుండా రైతులను నిండా ముంచాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలు పత్రికల్లో ప్రచురితమైన క్లిప్పింగ్‌లను షేర్ చేశారు.

# టెట్ అభ్యర్థులకు అలర్ట్


- రేపటితో దరఖాస్తు గడువు ముగింపు
- గతేడాది కన్నా తక్కువ సంఖ్యలో దరఖాస్తులు
- ఫీజు పెంపే కారణం!

హైదరాబాద్, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్ ) దరఖాస్తుల స్వీకరణ గడువు రేపటి(శనివారం)తో ముగియనుంది. ఈసారి గతేడాదితో పోల్చితే దరఖాస్తులు తక్కువగా వచ్చాయి. ఫీజు భారీగా పెంచడంతోనే అనుకున్నంతగా అభ్యర్థులు టెట్‌కు దరఖాస్తు చేసుకోలేదు. గురువారం సాయంత్రం వరకు మొత్తం 2,56,744 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో పేపర్–1కు 92,129 దరఖాస్తులు రాగా, పేపర్–2కు మాత్రం 1,64,615 అప్లికేషన్లు అందినట్లు పేర్కొన్నారు. గురువారం ఒక్క రోజే పేపర్–1కు 511, పేపర్–2కు 1377 దరఖాస్తులు వచ్చాయి. టెట్ గడువు ముందస్తు షెడ్యూల్ ప్రకారం ఈనెల 10వ తేదీతో ముగియగా అభ్యర్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల నేపథ్యంలో ఈనెల 20వ తేదీ వరకు పొడిగించారు. మరోవైపు టీచర్లకు పదోన్నతులు కావాలంటే టెట్ అర్హత తప్పనిసరి చేసినా టెట్ రాసేందుకు ఉపాధ్యాయులు కూడా ఆసక్తి చూపడంలేదని వచ్చిన దరఖాస్తుల సంఖ్యను చూస్తే స్పష్టమవుతోంది.



**గతంలో టెట్‌కు వచ్చిన దరఖాస్తులు**

| సంవత్సరం | దరఖాస్తులు |
|---|---|
| 2016 | 3.40 లక్షలు |
| 2017 | 3.29 లక్షలు |
| 2022 | 3.79 లక్షలు |
| 2023 | 2.83 లక్షల |
| 2024 | 2.56 లక్షలు (ఈనెల 18 వరకు) |









మల్కాజిగిరి స్థానానికి నామినేషన్ వేస్తున్న బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్. చిత్రంలో ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి తదితరులు


మహబూబ్‌నగర్ ఎంపీ స్థానానికి నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి డీకే అరుణ. చిత్రంలో బీజేపీ నేతలు కే లక్ష్మణ్ తదితరులు



గురువారం మెదక్ పార్లమెంట్ స్థానానికి నామినేషన్ వేస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు


నాగర్‌కర్నూల్ ఎంపీ స్థానానికి నామినేషన్ వేస్తున్న పోతుగంటి భరత్. చిత్రంలో ఎంపీ రాములు, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తదితరులు

# ఓట్ల పండుగ

(మొదటి పేజీ తరువాయి...)

వికాస్‌రాజ్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు స్థానాల అభ్యర్థులకు 15 శాతం తగ్గింపు ఉంటుందని చెప్పారు. రాజకీయ పార్టీలు అభ్యర్థులకు సంబంధించి ఫామ్ ఏ, ఫామ్ బీలను సీఈవో కార్యాలయంతో పాటు రిటర్నింగ్ అధికారికి కూడా అందజేయాలని కోరారు. పోటీచేసే అభ్యర్థులకు పోలీస్‌స్టేషన్లో కేసులు ఉంటే ప్రముఖ దినపత్రికలో ప్రకటించాలని సూచించారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్స్ సరిపడా ఉన్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 9,500 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు చెప్పారు. 51 అసెంబ్లీ నియోజకవర్గాల్లో భారీగా నగదు ఖర్చు చేసే అవకాశం ఉందని, అక్కడ గట్టి నిఘా పెట్టినట్లు తెలిపారు. 19 ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, ఒక నోడల్ అధికారిని ఈసీఐ నియమించిందని పేర్కొన్నారు. 204 అంతర్‌రాష్ట్ర, 444 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 160 కేంద్ర సంస్థల బలగాలకు సంబంధించి ఇప్పటికే 60 కంపెనీలు రాష్ట్రానికి వచ్చాయని వివరించారు. మరో 100 కంపెనీలు వస్తాయని తెలిపారు. ప్రతి జిల్లాలో 16 మంది నోడల్ అధికారులు ఉండగా, 2,94 లక్షల మంది ఎన్నికల డ్యూటీలో ఉంటారని చెప్పారు. వివిధ జిల్లాల్లో ఇప్పటివరకు 2 వేల ఫిర్యాదుల వచ్చాయని తెలిపారు.

**ఓటింగ్ శాతం పెంచడానికి చర్యలు.**

పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడానికి చర్యలు చేపట్టినట్లు వికాస్‌రాజ్ తెలిపారు. ఎన్నికల పోల్ చీటిలను కూడా నామినేషన్లు ఘట్టం ముగిసిన తర్వాత పంపిణి చేస్తామని చెప్పారు. వేసవి కావడంతో ఎండవేడిమి నుంచి రక్షణకు చర్యలు తీసుకుంటామని, పోలింగ్ కేంద్రాల వద్ద మంచినీళ్లు, మెడికల్ బృందాలను ఏర్పాటు చేస్తామని వివరించారు. హెల్ప్‌డెస్క్‌ను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్‌కు ఎన్నికల సంఘం ఇచ్చిన నోటీసుకు సమాధానమిచ్చేందుకు వారం రోజుల సమయం కావాలని కోరారని చెప్పారు.

**మొదటిరోజు నామినేషన్లు వేసింది వీళ్లే**

| అభ్యర్థి | నియోజకవర్గం | పార్టీ |
|---|---|---|
| ఈటల రాజేందర్ | మల్కాజ్‌గిరి | బీజేపీ |
| ఈటల జమున | మల్కాజ్‌గిరి | బీజేపీ |
| డీకే అరుణ | మహబూబ్‌నగర్ | బీజేపీ |
| రఘునందన్‌రావు | మెదక్ | బీజేపీ |
| పోతుగంటి భరత్ | నాగర్‌కర్నూల్ | బీజేపీ |
| శానంపుడి సైదిరెడ్డి | నల్లగొండ | బీజేపీ |
| మల్లు రవి | నాగర్‌కర్నూల్ | కాంగ్రెస్ |
| నీలం మధు | మెదక్ | కాంగ్రెస్ |
| సురేష్ షెట్కార్ | జహీరాబాద్ | కాంగ్రెస్ |


నాగర్‌కర్నూల్ స్థానానికి నామినేషన్ దాఖలుచేస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి

**ప్రచార హోరు మొదలు**

నామినేషన్ల పర్వం మొదలు కావటంతో అభ్యర్థులు ప్రచార హోరు పెంచుతున్నారు. తొలిరోజు పలువురు ప్రముఖులు నామినేషన్లు వేశారు. నామినేషన్లకు భారీ ర్యాలీగా కదిలిన నేతలు,సాయంత్రం కూడా ప్రత్యేకంగా ర్యాలీలు చేపట్టారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జీ కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ నియోజకవర్గానికి నేడు నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఇందుకోసం బీజేపీ భారీ ఏర్పాట్లు చేసింది. కిషన్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరు కానున్నారు. ఖమ్మం బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు కూడా నేడు నామినేషన్ వేయనున్నారు. కాగా, బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి దంపతులు కిషన్‌రెడ్డి, కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురి సమక్షంలో గురువారం బీజేపీలో చేరారు.

స్వతంత్రులుగా మహబూబ్‌నగర్‌లో ఒకరు, మెదక్‌లో నలుగురు, చేవెళ్లలో ముగ్గురు, పెద్దపల్లిలో నలుగురు, ఆదిలాబాద్‌లో ఇద్దరు, కరీంనగర్‌లో ఇద్దరు, మల్కాజ్‌గిరిలో ఆరుగురు, జహీరాబాద్, నిజామాబాద్‌లో ఒక్కొక్కరు, నల్లగొండలో ముగ్గురు, భువనగిరిలో ముగ్గురు, వరంగల్‌లో ముగ్గురు, మహబూబాబాద్, ఖమ్మంలో ఒక్కొక్కరు నామినేషన్లు దాఖలు చేశారు.

# వంద రోజుల్లో ఐదు గ్యారెంటీలు అమలుచేశాం

- ఆగస్టులోగా రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తాం
- అంబేద్కర్ గురించి మాట్లాడే నైతిక హక్కు కేసీఆర్‌కు లేదు
- మంత్రి కొండా సురేఖ ఫైర్


వరంగల్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్ తూర్పు, ఏప్రిల్ 18 : అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఐదు గ్యారెంటీలను అమలు చేశామని అటవీ పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టంచేశారు. ఆగస్టులోగా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పారు. వరంగల్‌లో గురువారం రాత్రి జరిగిన కాంగ్రెస్ నియోజకవర్గస్థాయి సమావేశంలో మంత్రి సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంబేద్కర్ గురించి మాట్లాడే నైతిక హక్కు కేసీఆర్‌కు లేదని అన్నారు. రాజకీయాల్లోకి అసభ్య పదజాలం తీసుకొచ్చిందే కేసీఆర్, కేటీఆరేనని విమర్శించారు. మోదీ పాలనలో అదానీ, అంబానీ ఆస్తులు పెరిగాయే తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని పేర్కొన్నారు. భారత్ జోడో యాత్రతో రాహుల్‌గాంధీ దేశ ప్రజల కష్టాలను చూశారని.. ప్రజల్లో ఉండే ప్రధాని కావాలా? అదానీ, అంబానీలకు కొమ్ముకాసే వ్యక్తి కావాలో ప్రజలు ఆలోచించాలని కోరారు. మద్యం కేసులో జైలుపాలైన కవితను బయటకు తీసుకురావాలనే లక్ష్యంతో బీఆర్‌ఎస్ నాయకులను బీజేపీ అభ్యర్థులుగా బరిలో నిలిపారని ఆరోపించారు. శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్‌ను ఆదరించినట్టుగానే పార్లమెంట్ ఎన్నికలలో కూడా ఆదరించి డాక్టర్ కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమని చెప్పారు. కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎంఎల్‌ఏ కడియం శ్రీహరి, ఎంపి అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య, పలువురు కార్పోరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పరిగి అసెంబ్లీ నియోజకవర్గం కుల్కచర్లలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే, డీసీసీ ప్రెసిడెంట్ టీ రాంమోహన్‌రెడ్డితో కలిసి బూత్‌స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి.
– హైదరాబాద్ సిటీ బ్యూరో, ఏప్రిల్ 18 (విజయక్రాంతి)




# మాదిగలకు రెండు సీట్లు ఇవ్వాలి

- మాజీ మంత్రి మోత్కుపల్లి దీక్ష
- జరిగిన అన్యాయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళతా
- పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు


కాంగ్రెస్ ఎంపీ టికెట్ల కేటాయింపులోమాదిగలకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ దీక్షకు దిగిన మోత్కుపల్లి. చిత్రంలో కాంగ్రెస్ నేతలు వీహెచ్, సర్వే సత్యనారాయణ తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): లోక్‌సభ ఎన్నికల టికెట్ల కేటాయింపుల్లో మాదిగలకు కాంగ్రెస్ పార్టీ రెండు సీట్లు కేటాయించాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత మోత్కుపల్లి నరసింహులు గురువారం ఆయన నివాసంలో ఒక రోజు దీక్ష చేపట్టారు. మోత్కుపల్లి చేపట్టిన దీక్షకు పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేశ్, చింతస్వామితో పాటు కాంగ్రెస్ నాయకులు, వివిధ సంఘాల నేతలు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి మాదిగలకు మొదటి నుంచి వెన్నంటి ఉన్నారని, టికెట్ల కేటాయింపులో జరిగిన అన్యాయాన్ని సీఎం రేవంత్ రెడ్డి, పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లుతానని తెలిపారు. నర్సింహులు చేపట్టిన దీక్షలో న్యాయం ఉందని, ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ పోరాటం చేయడం విద్యార్థి దశ నుంచే మెత్కుపల్లికి అలవాటన్నారు. ఎంపీ సీట్లలో మాదిగలకు అవకాశం ఇవ్వకపోవడం వల్ల పార్టీకి నష్టం జరిగే ప్రమాదం ఉందని మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు అన్నారు. టికెట్ల కేటాయింపు లో జరిగిన పొరపాటును సరిదిద్దకపోతే.. మాదిగలు పార్టీకి దూరమయ్యే ప్రమాదం ఉందన్నా రు. తాను పార్టీ మారే ఆలోచన లేదని తెలిపారు. మోత్కుపల్లి నరసింహులు చేసే పోరాటానికి ఎమ్మార్పీఎస్ మద్దతు ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్ స్పష్టం చేశారు.








# విద్యాశాఖ మంత్రి లేని రాష్ట్రం

- కాంగ్రెస్‌కు ఆర్భాటమే తప్ప పనులు చేతకాదు
- ఆ పార్టీ అధికారంలోకి వచ్చాకే రాష్ట్రంలో కరువు
- బీజేపీ నేత బూర నర్సయ్యగౌడ్



హైదరాబాద్, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): విద్యాశాఖ మంత్రి లేని రాష్ట్రం ఏదైనా ఉందటే అది తెలంగాణ మాత్రమేనని భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ విమర్శించారు. ఫుడ్ పాయిజన్‌తో ఓ బాలుడు చనిపోవడం ప్రపంచంలోనే అరుదైన సంఘటన అని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు ఇది నిదర్శనమని మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆర్భాటమే తప్ప పనులు చేతకాని ప్రభుత్వమిదని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే కరువు వచ్చిందన్నారు. గత ప్రభుత్వం కృష్ణానీటిని ఏపీకి దోచిపెట్టిందని విమర్శించారు. బీఆర్‌ఎస్ నాయకులు ఉండేది ఇక్కడ కానీ చప్పట్లు కొట్టేది మాత్రం జగన్‌కు అని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ నిర్వాకంతో తెలంగాణ ప్రజలు తాగునీటి కష్టాలు పడుతున్నారని అన్నారు. సమస్యల పరిష్కారం గాలికొదిలేసి సీఎం రేవంత్ రెడ్డి మాత్రం పేగులు మెడలో వేసుకుంటా, తొక్కుతా అంటూ డైలాగులు కొడుతున్నాడని అన్నారు. నల్లగొండ ఏమవుతుందోనన్న సోయి అక్కడి కాంగ్రెస్ నేతలకు లేదని, సీఎంను ప్రసన్నం చేసుకునే పనిలో వారంతా బిజీగా ఉన్నారని ఆరోపించారు. ఆలీబాబా అరవై దొంగల్లా కాంగ్రెస్ నాయకులు తయారయ్యారని ఎద్దేవా చేశారు. ధరణి సాయంతో బద్వేల్‌లో 400 ఎకరాలు ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. కోమటిరెడ్డి సోదరులిద్దరి స్థానాల కింద సీఎం రేవంత్ బాంబ్ పెట్టాడని, రాజగోపాల్ రెడ్డి తన ఇంటికి మాత్రమే హోంమంత్రి అవుతాడని రాష్ట్రానికి కాలేరని చురకలు అంటించారు.

# టికెట్లపై కాంగ్రెస్‌లో అంతర్యుద్ధం!

- హస్తం పార్టీలో కొలిక్కి రాని టికెట్ల వివాదం
- దీక్షలు, ఆందోళనలు చేస్తున్న పార్టీ నాయకులు
- కొన్ని కుటుంబాలకే పెద్దపీట వేయడమేంటని ఆందోళన
- ప్రకటించని మూడు స్థానాలపై కొనసాగుతోన్న చర్చ

హైదరాబాద్, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): హస్తం పార్టీలో పార్లమెంట్ ఎన్నికల టికెట్ల పంచాయితీ ఇంకా కొనసాగుతోంది. ఒకటి, రెండు వర్గాలకే పెద్ద పీట వేసి.. మిగతా వర్గాలను పట్టించుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌కు చెల్లు చీటి చెప్పారని, ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ సూచనలను పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా టికెట్ల కేటాయింపుల్లో సామాజిక న్యాయం పాటించడం లేదని నిరసనలు, దీక్షలకు వరకు నేతలు వెళ్లారు. ఒక్కో కుటుంబానికి రెండు, మూడు సీట్లు కేటాయించడం వల్ల.. పార్టీ కోసం కష్టపడిన వారి పరిస్థితి ఏంటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. సర్వేల ప్రకారమే సీట్లు ఇచ్చామని చెప్పడం అంతా డొల్ల అని కొట్టిపారేస్తున్నారు. రాష్ట్రంలోని 17 స్థానాలకు 14 మంది అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించింది. ఇంకా 3 స్థానాల్లో (ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్) అభ్యర్థులను ప్రకటించడంలో తర్జనభర్జన పడుతోంది. నామినేషన్ల ప్రక్రియ మొదలైనప్పటికీ పెండింగ్ స్థానాలను ప్రకటించకపోవడం వల్ల ప్రచారానికి సమయం సరిపోదని నేతలు చెబుతున్నారు. ఇప్పటివరకు ప్రకటించిన వాటిలో 5 ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు స్థానాలు ఉండగా, మిగతా 9 స్థానాల్లో రెడ్డి సామాజిక వర్గానికి 6 సీట్లు (చేవెళ్ల, మల్కాజిగిరి, నిజామాబాద్, భువనగిరి, నల్లగొండ, మహబూబ్‌నగర్) కేటాయించి పెద్ద పీట వేశారని, బీసీలకు కేవలం మూడు సెగ్మెంట్ల(సికింద్రాబాద్, మెదక్, జహీరాబాద్)లో మాత్రమే టికెట్లు ఇచ్చారని మండిపడుతున్నారు.

**రిజర్వ్‌డ్ స్థానాల్లో..**

ఇక ఎస్టీ నియోజకవర్గాల్లోని రెండు సీట్లు ఒకటి ఆదివాసీ, లంబాడీలకు కేటాయించారు. మిగతా మూడు ఎస్సీ రిజర్వుడు స్థానాల విషయంలో వివాదం కొనసాగుతోంది. మూడు సీట్లలో రెండు మాల సామాజిక వర్గానికి, ఒకటి బైండ్ల సామాజిక వర్గానికి కాంగ్రెస్ పార్టీ టికెట్లు కేటాయించింది. రాష్ట్రంలో దాదాపు 70 లక్షలకు పైగా ఉన్న మాదిగలకు ఒక్క సీటు కేటాయించకపోవడంతో ఆ వర్గం నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ టికెట్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సోదరుడు మల్లు రవి, ఎమ్మెల్యే గడ్డం వివేక్ తనయుడు గడ్డం వంశీకి పెద్దపల్లి టికెట్ కేటాయించారు. ఇప్పటికే వివేక్ సోదరుడు వినోద్ బెల్లంపల్లి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. దీంతో ఒకే కుటుంబం నుంచి ముగ్గురికి అవకాశం ఇస్తే.. పార్టీ కోసం పని చేస్తున్న మిగతా వారి పరిస్థితి ఏంటని నిలదీస్తున్నారు. వరంగల్ నుంచి బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుతూరు కడియం కావ్యకు ఇవ్వడంపైనా ఆ జిల్లా నేతలు భగ్గుమంటున్నారు. కడియం కావ్యను మార్చి మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారికి ఇవ్వాలని పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నారు.

**ఉమ్మడి నల్లగొండలోనూ...**

ఇక ఉమ్మడి నల్లగొండలో మూడు కుటుంబాలే సీట్లను పంచుకుంటున్నాయని కాంగ్రెస్‌కు చెందిన మిగతా నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నల్లగొండ ఎంపీ టికెట్ మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి తనయుడు రఘువీర్‌రెడ్డికి కేటాయించారు. ఇప్పటికే జానారెడ్డి మరో తనయుడు జయవీర్‌రెడ్డి నాగార్జునసాగర్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి హుజూర్‌నగర్, ఆయన సతీమణి పద్మావతికి కోదాడ టికెట్లు ఇచ్చారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండ అసెంబ్లీ, ఆయన సోదరుడు రాజగోపాల్‌రెడ్డికి మునుగోడు అసెంబ్లీ సీటు ఇచ్చారు. 2018లో రాజగోపాల్‌రెడ్డి మునుగోడు నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆ తర్వాత కాంగ్రెస్, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి బీజేపీలో చేరడం, ఉప ఎన్నిక రావడం అనివార్యమైంది. ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయం సాధించారు. తీరా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ముందు బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరి మునుగోడు టికెట్ తెచ్చుకుని ఎమ్మెల్యేగా గెలుపొందారు. మునుగోడులో అప్పటివరకు పార్టీ కోసం పనిచేసిన నాయకుల్లో కొందరు పార్టీని వీడాల్సి వచ్చిందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్‌లో జరుగుతున్న పరిణామాలపై దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే పార్టీకి నష్టం జరిగే ప్రమాదం ఉందని చెబుతున్నారు.






# మోదీ కెప్టెన్సీలో ఐపీఎల్ కప్ బీజేపీదే

- 400 సీట్లలో ఘనవిజయం సాధించబోతున్నాం
- కెప్టెన్ కూడా లేని కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడిస్తం
- విజయక్రాంతి' ప్రత్యేక ఇంటర్వ్యూలో బండి సంజయ్



- రాష్ట్రంలో కాంగ్రెస్ టీంకు ప్లేయర్లే లేరు
- బీఆర్ఎస్ టీం ప్లేయర్ల డకౌట్ ఖాయం
- కరీంనగర్ అభివృద్ధికి 12 వేల కోట్లు తెచ్చిన
- కాదని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంట

కరీంనగర్, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 400 సీట్లతో ఘనవిజయం సాధిస్తుందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రధాని అభ్యర్థి ఎవరో కూడా తెలియని విపక్ష కూటమికి ఈసారి కూడా ఘోర ఓటమి తప్పదని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ కనిపించకుండా పోతుందని పేర్కొన్నారు. గురువారం ఆయన 'విజయక్రాంతి'కి ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంతోపాటు రాష్ట్రంలో ఎక్కడైనా కాంగ్రెస్ 6 గ్యారెంటీల ద్వారా ఒక్కరంటే ఒక్కరు లబ్ధి పొందినట్లు నిరూపించినా తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. ఇంటర్వ్యూ ముఖ్యాంశాలు..

**తెలంగాణ రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. బీజేపీ ఎన్ని సీట్లు గెలుస్తుందని మీ అంచనా?**

ఐపీఎల్ క్రికెట్ మాదిరిగానే దేశంలో ఇండియన్ పొలిటికల్ లీగ్ (ఐపీఎల్) మ్యాచ్ రసవత్తరంగా ప్రారంభమైంది. ఈ ఎన్నికల పోటీల్లో నరేంద్రమోదీ కెప్టెన్సీలో బీజేపీ టీం 400 సీట్లతో ఐపీఎల్ కప్ గెలవబోతున్నది. తెలంగాణ పొలిటికల్ లీగ్ (టీపీఎల్) లో కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో 17 సీట్లు సాధించి కప్‌ను కైవసం చేసుకోబోతున్నాం. బీఆర్ఎస్ టీం నుంచి బరిలో నిలిచిన ప్లేయర్లు పోటీ నుండే తప్పుకుని పక్క టీముల్లోకి జారుకుంటున్నారు. కాంగ్రెస్ పరిస్థితి చూస్తే జాలేస్తున్నది. కెప్టెన్ (ప్రధాని అభ్యర్థి) లేకుండానే ఆ పార్టీ బరిలో దిగింది. రాష్ట్రంలోనైతే ఆ టీంకు అసలు ప్లేయర్లే దొరకడం లేదు. కరీంనగరే ఇందుకు నిదర్శనం. .

**ఐదేళ్లలో ఎంపీగా, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా మీరు సాధించిన విజయాలు ఏమున్నాయంటే ఏం చెప్తారు?**

తెలంగాణ ప్రజలను అరిగోస పెడుతున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని గల్లిలోకి గుంజుకొచ్చి గడీల పాలనను బద్దలు కొట్టిన. ఏ ప్రభుత్వమైతే ధర్నాలు, నిరసనలను నిషేధించిందో అదే ప్రభుత్వాన్ని ధర్నా చౌక్ కే గుంజుకొచ్చిన. కేసీఆర్ పాలనలో విసిగిపోయిన ప్రజలందరికీ అండగా ఉంటూ పోరాటాలు చేసిన. ఆర్టీసీ ఆస్తులు అమ్మకుండా అడ్డుకున్న. కరీంనగర్–వరంగల్, కరీంనగర్ – జగిత్యాల మధ్య కేంద్రం సహకారంతో రూ.4 వేల కోట్లపై చిలుకు నిధులతో ఫోర్ లేన్ రహదారి విస్తరణ పనులు ప్రారంభించేలా చేసిన. ఎంపీగా నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.12 వేల కోట్లకుపైగా నిధులు తీసుకొచ్చిన. కరీంనగర్ – వరంగల్ ఫోర్ లేన్ విస్తరణ పనులకు 2,146.86 కోట్లు, కరీంనగర్ జగిత్యాల 4 లేన్ విస్తరణ పనులకు రూ. 2,151.35 కోట్లు, ఎల్కతుర్తి సిద్దిపేట రోడ్డు విస్తరణ పనుల కోసం రూ. 578.85 కోట్లు, తీగలగుట్ట ఆర్వోబీకి సేతు బంధన్ పథకం కింద కేంద్రమే పూర్తిగా నిధులను (రూ.154.85 కోట్లు) విడుదల చేసేలా ఒప్పించిన. సీఆర్ఐఎఫ్ ద్వారా రూ.328.5 కోట్లు, కరీంనగర్ రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం 51.80 కోట్లు తెచ్చిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ ఎక్స్‌టెన్షన్ సెంటర్ ఏర్పాటు చేయించిన. ప్రధానమంత్రి అవాస్ యోజన ద్వారా 8,041 ఇండ్లకు 145 కోట్ల నిధులు మంజూరు చేయించిన. అమృత్ 1.0 ద్వారా రూ.281 కోట్ల తో 12 ప్రాజెక్టులు, అమృత్ 2.0 ద్వారా రూ.583.27 కోట్లతో 11 ప్రాజెక్టులు గుర్తించడం జరిగింది. పీఎం స్వనిధి ద్వారా 46,974 మంది స్ట్రీట్ వెండార్స్‌కు 76.48 కోట్ల రుణ సహాయం చేశాం. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతులకు 756.73 కోట్ల సహాయం అందించాం. ఉజ్వల యోజన ద్వారా 50,647 కుటుంబాలకు ఉచిత గ్యాస్ కనెక్షన్‌లు ఇచ్చాం. ఇవి కొన్ని మాత్రమే.

**కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలతో ఎంపీ ఎన్నికల్లో ప్రజలు తమకే ఓట్లేస్తారని ఆ పార్టీ ధీమాతో ఉన్నది కదా? దీనిపై మీరేమంటారు?**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి కొద్దిరోజులే అయ్యింది కదా అని ఇన్నాళ్లు ఊరుకున్నం. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పింది. కాంగ్రెస్ వారెంటీ ముగిసిపోయింది. గ్యారెంటీలపై చేతులెత్తేసింది. మళ్లోసారి జనాన్ని మోసం చేసేందుకు సిద్ధమైంది. దొంగ హామీలు ఇవ్వడం, మోసం చెయ్యడం కాంగ్రెస్ డీఎన్ఏ లోనే ఉంది. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2,500 ఇచ్చారా? వృద్ధులు, వితంతవులకు నెలకు రూ.4 వేల పెన్షన్ ఇచ్చారా? రైతులకు, కౌలు రైతులకు ఎకరాకు రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేల చొప్పున ఇచ్చారా? విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు ఇచ్చారా? ఇల్లులేని పేదలందరికీ జాగాతోపాటు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం చేశారా? రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేశారా? ఈ ఆరు గ్యారెంటీల్లో ఒక్కటంటే ఒక్కటైనా అమలు చేశారా? కాంగ్రెస్ నేతలకు సవాల్ చేస్తున్నా.. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఆరు గ్యారెంటీల్లో ఒక్కరంటే ఒక్కరు లబ్ధి పొందినట్లు నిరూపించినా నేను రాజకీయాల నుంచి తప్పుకుంటా?

**కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు బండి సంజయ్ ఎంపీగా నయాపైసా తేలేదని పదేపదే ప్రచారం చేస్తున్నాయి. అందుకు మీ సమాధానం?**

నేను గతంలోను చెప్పాను.. ఇప్పుడూ చెప్తున్నాను. నేను నా కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి కోసం ఏం చేశానో చర్చకు సిద్ధం. గ్రామాల వారీగా కేంద్రం ఎన్ని నిధులు ఖర్చు చేసిందో లెక్క పత్రం ఉంది. అవే ప్రజాహిత యాత్రలో గ్రామగ్రామాన ప్రజలకు వివరించిన. అయినా కండ్లుండి చూడలేని కబోదులు కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు. ఇక్కడ పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి నాన్ లోకల్.. బహుశా అందుకే బండి సంజయ్ చేసిన అభివృద్ధి ఏమిటో తెల్వదనుకుంటా.

**బండి సంజయ్ రాముడి పేరు మీద ఫ్లెక్సీలు కట్టి రాజకీయాలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి?**

అయోధ్యలో రామ మందిర నిర్మాణం దేశంలోని హిందువులందరి 5 శతాబ్దాల కల.. ఆ కలను నెరవేర్చిన మహానాయకుడు మోదీ. మా దేవుడు శ్రీరాముడు. మాకు ఆదర్శం మోదీ. మేం దేశం కోసం, హిందూ ధర్మం కోసం పనిచేస్తామే తప్ప..కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మాదిరిగా రాహుల్‌గాంధీ కోసమో, కేసీఆర్ కుటుంబం కోసమో రాజకీయం చేయడం లేదు. అయోధ్యలో రామమందిర నిర్మాణం హిందువులకు ఒక పండుగ. ఫ్లెక్సీలు కట్టుకుని సంబురం చేసుకుంటే తప్పేముంది?

**బండి సంజయ్ పార్లమెంట్‌కు వెళ్లలేదు.. మాట్లాడలేదని అంటున్నారు?**

అబద్ధాలకు కూడా హద్దు పద్దు ఉండాలి. నేను పార్లమెంట్ సభ్యుడుగా అనేక చర్చల్లో పాల్గొన్న. నేను ఎంపీగా గెలిచిన తర్వాత 2 సంవత్సరాలు దేశం మొత్తం కరోనా ప్రభావాన్ని చూసింది. కరోనా టైంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులెవరూ గడప దాటి బయటకు రాలేదు. పారాసెటమాల్ వేసుకుంటే తగ్గిపోద్దని ఉచిత సలహాలిస్తూ.. వాళ్లు మాత్రం పెద్ద పెద్ద దవాఖానల్లో ట్రీట్ మెంట్ చేయించుకున్నరు. కానీ నేను ప్రాణాలకు తెగించి కరోనా పేషెంట్ల వద్దకు వెళ్లి వారికి మానసిక ధైర్యం కల్పించిన.

**బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని కాంగ్రెస్ విమర్శిస్తోంది. దీనికి మీ సమాధానం?**

నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అన్నట్లుగా ఆ రెండు పార్టీలు నటిస్తున్నయ్. నిజానికి చీకటి ఒప్పందాలు, అవినీతిపై విచారణల్లేకుండా రాయబారాలు నడుపుతూ డ్రామాలాడుతోంది బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలే. పార్లమెంట్ లో కలిసి పని చేస్తోంది ఆ రెండు పార్టీలే.

**బండి సంజయ్‌కి హిందువులను రెచ్చకొట్టి లబ్ధి పొందడమే పని అని మీ ప్రత్యర్థులు ప్రచారం చేస్తున్నారు కదా?**

హిందువులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసేది ఎంఐఎం పార్టీ. 15 నిమిషాలు టైమిస్తే హిందువులను నరికి చంపుతానని ఒవైసీ చెబితే చర్యలు తీసుకోకుండా ఆ పార్టీతో పదేళ్లపాటు సంసారం చేసింది బీఆర్ఎస్. అధికార మనుగడ కోసం ఒవైసీతో అంటకాగుతోంది కాంగ్రెస్ పార్టీ. హిందువుల ఆత్మగౌరవం కోసం కొట్లాడుతా.

**మీరు గెలిస్తే కేంద్ర మంత్రి అవుతారని మీ పార్టీ నేతలే చెబుతున్నారు.**

నేను బీజేపీ సైనికుడి. కరీంనగర్ ప్రజల సేవకుడిని. మోదీ బాటలో నడిచే కార్యకర్తను. పార్టీ అప్పగించిన పనిని వంద శాతం నిర్వహించడమే నా భాధ్యత. నాకు ఎలాంటి భాధ్యత, గుర్తింపు ఇవ్వాలో మోదీ, జేపీ నడ్డా, అమిత్ షా నాయకత్వంలోని మా జాతీయ నాయకత్వం నిర్ణయిస్తది.

**బీఆర్ఎస్ నాయకులు స్మార్ట్ సిటీ, హై వేలకు మా చొరవతోనే నిధులు వచ్చాయంటున్నారు?**

దాచుకోవడం, దోచుకోవడం.. ప్రశ్నించే వాళ్లపై కేసులు పెట్టి వేధించడం తప్ప బీఆర్ఎస్ నేతలు చేసిందేముంది? స్వలాభం కోసం కరీంనగర్ అభివృద్ధిని కుంటుపరిచిన నేతలు బీఆర్ఎస్ వాళ్లు. చిత్తశుద్ధితో కరీంనగర్‌ను అభివృద్ధి చేసింది నేను. కేసీఆర్ అవినీతిని, నిధుల దారి మళ్లింపు అంశాన్ని నేను కేంద్రం దృష్టికి తీసుకుపోయిన. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీలో అధికారులను నిలదీసిన. కేంద్రమిచ్చిన నిధులను వారం రోజుల్లో జమ చేయకపోతే వడ్డీతోసహా వసూలు చేస్తామని కేంద్రం హెచ్చరించేదాకా పట్టించుకోని నాయకులు.. ఇవాళ తగుదునమ్మా అని సిగ్గు లేకుండా మా ఘనతే అని చెప్పుకుంటున్నరు. నాడు రోడ్లు బాగు చేయాలని జనం మొత్తుకున్నా పట్టించుకోలే. ఇవన్నీ నేను ఎంపీ అయ్యాకే భారీ ఎత్తున నిధులు తీసుకొచ్చిన. తెలంగాణలో కేంద్ర రహదారుల మౌలిక సదుపాయల నిధి కింద అత్యధిక నిధులు తీసుకొచ్చింది నేను.

# మోదీతో పినరయి రహస్య ఒప్పందం

- అందుకే కేసులున్నా సీఎంపై చర్యలు సున్నా
- ప్రధాని కాబోయేది రాహుల్ గాంధీయే
- వయనాడ్‌లో రైతులతో సీఎం రేవంత్ రెడ్డి



గురువారం కేరళలోని వయనాడ్‌లో ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): కేరళ ముఖ్యమంత్రి, ఆయన కుటుంబ సభ్యులపై ఈడీ, ఆదాయ పన్ను కేసులున్నా వారిపై ప్రధాని మోదీ చర్యలు తీసుకోవడం లేదని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రధాని మోదీతో పినరయ్ రహస్య ఒప్పందం వల్లే ఇది సాధ్యమైందని ఆరోపించారు. బంగారం స్మగ్లింగ్‌లో విజయన్ కుటుంబ సభ్యుల పాత్ర ఉన్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చూస్తే ఇది నిజమనిపిస్తున్నదని ఆయన అన్నారు. కేరళలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కోసం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రేవంత్ రెడ్డి గురువారం వయనాడ్‌కు చెందిన రైతులతో సమావేశమయ్యారు. తెలంగాణ, కర్ణాటక, జార్ఖండ్, ఢిల్లీ వంటి రాష్ట్రాలు కేంద్రంతో నిధుల కోసం పోరాడుతున్నాయని అన్నారు. కేరళ సీఎం మాత్రం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. విజయన్ పైకి సీపీఎం ముఖ్యమంత్రిగా, కమ్యూనిస్టు నాయకునిగా కనిపిస్తున్నా ఆయన కమ్యూనలిస్టు అని, మతతత్వ బీజేపీతో కలిసి పని చేస్తున్నారని ఆరోపించారు. వయనాడ్‌లో బీజేపీ అభ్యర్థి సురేంద్రన్‌కి కేరళ సీఎం మద్దతునిస్తున్నాడని అన్నారు. సొంత పార్టీ సీపీఎంతో పాటు కేరళ ప్రజలను విజయన్ మోసం చేస్తున్నాడని, ఈడీ, ఆదాయపన్ను కేసులున్నన్ని రోజులు సీపీఎం పార్టీ కోసం విజయన్ పనిచేయబోరన్నారు. మణిపూర్‌లో వందలాది క్రైస్తవులు బీజేపీ గూండాల చేతిలో చనిపోతే... ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా కనీసం అక్కడ పర్యటించలేదన్నారు. కానీ రాహుల్ గాంధీ అక్కడి బాధితులను కలిసి వారి బాధలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారని రేవంత్ అన్నారు.

**రాసిపెట్టుకోండి...**

జూన్ 9న రాహుల్ గాంధీ ఈ దేశ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేస్తారని రేవంత్ జోస్యం చెప్పారు. దేశంలో రెండు పరివార్‌ల మధ్య పోరాటం జరుగుతోందని.. మోదీ పరివార్‌లో ఈడీ, ఈవీఎంలు, సీబీఐ, ఐటీ, అదానీ, అంబానీ ఉన్నారని, ఇండియా పరివార్‌లో ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, వయనాడ్ కుటుంబ సభ్యులున్నారని తెలిపారు. ఇందిరా, రాజీవ్ దేశం కోసం ప్రాణత్యాగం చేశారని.. సోనియా, రాహుల్ పదవులను త్యాగం చేశారని అన్నారు. వయనాడ్ ప్రజలు రాహుల్ గాంధీ వైపున్నారని, ప్రత్యక్షంగా తమ ప్రచారమే అవసరం లేదన్నారు. రాహుల్ గాంధీపై ప్రజల అభిమానాన్ని ప్రత్యక్షంగా చూద్దామనే తాను తెలంగాణ నుంచి కేరళ వచ్చినట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ నుంచి పోటీ చేయాలని తాము రాహుల్ గాంధీని కోరామని కానీ ఆయన వయనాడ్ వైపే మొగ్గు చూపారని తెలిపారు. గత ఎన్నికల్లో వాయనాడ్‌లో ఆయనకు 65 శాతం ఓట్లు వచ్చాయని, ఈ ఎన్నికల్లో 75 శాతం ఓట్లు రావాలని కోరారు. మోదీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామని, వయనాడ్ వర్సెస్ వారణాసి మధ్యన ఇప్పుడు పోరాటం సాగుతోందన్నారు. వయనాడ్ ప్రజలు ఈ దేశానికి కాబోయే ప్రధానికి ఓటేస్తున్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేరళ ప్రజలు ఎంతో కష్టపడే స్వభావం కలవారని, వారి శ్రమ వల్లే దుబాయ్ లాంటి దేశాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. కానీ కేరళ మాత్రం ఇంకా అభివృద్ధి చెందలేదని తెలిపారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితే కేరళతోపాటు దేశమంతా అభివృద్ధి చెందుతుందని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.


# ముస్లిం మహిళల ఓట్లు మోదీకే

- మూడోసారి ప్రధాని కావడం ఖాయం
- రాహుల్ గాంధీకి మెచ్యూరిటీ తగ్గుతోంది
- బీజేపీ ఎంపీ కే లక్ష్మణ్



గురువారం మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ నేత కే లక్ష్మణ్

హైదరాబాద్, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): దేశంలో మోదీ హవా నడుస్తోం దని, మూ డోసారి ఆయనే ప్రధానమంత్రి అవుతారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కే లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు. ముస్లిం మహిళలు సైతం ఆయనకు ఓటేసేందుకు ఎదురుచూస్తున్నారని తెలిపారు. అన్ని పార్టీల సానుభూతిపరులు సైతం మోదీనీ మూడోసారి ప్రధానిగా చూడాలని కోరుకుంటున్నారని చెప్పారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ నాయకుడు కాటేపల్లి జనార్దన్ రెడ్డి సహా పలువురు నాయకులు లక్ష్మణ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వయసు పెరుగుతున్న కొద్దీ మెచ్యూరిటీ తగ్గుతోందని విమర్శించారు. మోదీ సాహసోపేత నిర్ణయాల మీద మాట్లాడేందుకు రాహుల్‌కు నోరు రావడం లేదన్నారు. ఎన్నికల బాండ్లకు ముందు నల్ల ధనం విచ్చలవిడిగా ఉండేదని... బాండ్ల జారీతో పారదర్శకత వచ్చిందన్నారు. ఎన్నికల బాండ్ల ద్వారా కాంగ్రెస్ పార్టీ విరాళాలు పొందలేదా అని లక్ష్మణ్ ప్రశ్నించారు. ఈడీ, సీబీఐను అడ్డుపెట్టుకుని బీజేపీ విరాళాలు సేకరిస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించడం సిగ్గుచేటన్నారు. ఉత్తరాదిన కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోయిందని... దక్షిణాదిన సైతం అదే పరిస్థితి వస్తుందన్నారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్ మాదిరిగా తెలంగాణ అభివృద్ధి చెందాలంటే బీజేపీని గెలిపించాలని లక్ష్మణ్ విజ్ఞప్తి చేశారు.



INTERCONTINENTAL
PUBLICATIONS PVT. LTD
VOICE OF TELANGANA

విజయక్రాంతి
www.vijayakranthinews.com
హైదరాబాద్, శుక్రవారం, 19 ఏప్రిల్ 2024





## ముత్యాల పలుకు

మనకు వచ్చే అవకాశాలు
నిజానికి చాలా గొప్పవి. అయినా,
ఒకసారి మిమ్మల్ని హెచ్చరించవలసి
వస్తుంది ఎందుకంటే, అధికారం
సామర్థ్యాన్ని మించి పోయినప్పుడు
చెడు కాలంలోకి మనం నెట్టబడతాం.

– డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్



## మన సామెతలు

- సంసారి తిరిగి చెడును, సన్యాసి తిరుగక చెడును.
- దున్నబోతే దూడలల్ల, మేయబోతే ఆవులల్ల.
- ఎత్తుకుంటే చంకకుండది, దించితే కిందుండది.
- క్షణం తీరిక లేదు, దమ్మిడి ఆమ్దాని లేదు.
- చల్లకు వచ్చి ముంత దాచినట్టు.

# ఈవీఎంలపై వివాదం

ఎన్నికల్లో ఓటు వేయడానికి పేపర్ బ్యాలెట్ పత్రాలకు బదులుగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను (ఈవీఎం) ప్రవేశపెట్టినప్పటి నుంచి కూడా వాటి విశ్వసనీయతపై వివాదం కొనసాగుతూనే ఉంది. పేపర్ బ్యాలెట్ కారణంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఆలస్యం కావడం, రిగ్గింగ్‌కు అవకాశం ఉండడం లాంటి పలు కారణాలవల్ల ఎన్నికల కమిషన్ ఈవీఎంలను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. 1982లో తొలిసారి కేరళలోని ఓ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక సందర్భంగా ఎన్నికల కమిషన్ ప్రయోగాత్మకంగా కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలను ప్రవేశపెట్టింది. పేపర్ బ్యాలెట్ స్థానంలో ఈవీఎంలను ఉపయోగించడంపై దాఖలైన పిటిషన్ల సందర్భంగా సుప్రీంకోర్టు ఎన్నికల ప్రక్రియలో ఏదైనా మార్పు చేయాలంటే సంబంధిత చట్టంలో పార్లమెంటు సవరణ చేయాల్సి ఉంటుందని స్పష్టంచేసింది. దరిమిలా ప్రజాప్రాతినిధ్య చట్టానికి సవరణ తీసుకు రావడంతో ఈవీఎంల వినియోగానికి మార్గం సుగమమైంది. దరిమిలా మొదట రాష్ట్ర శాసనసభల ఎన్నికల్లో, తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో దశలవారీగా వీటిని ఈసీ ప్రవేశపెట్టింది. చివరికి 2004 లోక్‌సభ ఎన్నికల నుంచి అన్ని ఎన్నికల్లోను ఈవీఎంలనే ఉపయోగించడం జరుగుతూ ఉంది. అయితే, ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయడం ద్వారా అధికార పార్టీ రిగ్గింగ్‌కు పాల్పడే అవకాశం ఉంటుందని ప్రతిపక్షాలు ఆదినుంచీ ఆరోపిస్తూనే ఉన్నాయి. ఈ ఆరోపణలను అటు ఎన్నికల సంఘం, ఇటు అధికార బీజేపీ తోసిపుచ్చుతూ వస్తున్నాయి. ఐనా, వివాదం సద్దుమణగలేదు. దీనికి పరిష్కారంగా ఓట్ల లెక్కింపు సమయంలో ఈవీఎంలలో పోలైన ఓట్లను వీవీ ప్యాట్ స్లిప్‌లతో క్రాస్ చెక్ చేసేందుకు ఈసీ అవకాశం కల్పించింది. ఇప్పటిదాకా ఇది మాక్ పోలింగ్ సమయంలో, ఎంపిక చేసిన ఈవీఎంలలో మాత్రమే పరీక్షించడం జరుగుతోంది. కానీ, ప్రతి ఓటరుకూ వీవీప్యాట్ స్లిప్‌లు అందించాలని, అలాగే అన్ని ఈవీఎంలలో పోల్ అయిన ఓట్లను వీవీ ప్యాట్ స్లిప్‌లతో క్రాస్ చెక్ చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ప్రస్తుతం ఈ పిటిషన్లపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారణ జరుపుతోంది. గురువారం విచారణ సందర్భంగా బెంచ్ కీలక వ్యాఖ్యలు చేసింది.

ఎన్నికల ప్రక్రియ ఎంతో పవిత్రమైందని, ఓటర్లు ఆశించింది జరగలేదని ఎవరూ భయాందోళనలు చెందకుండా చూసుకోవాలని ధర్మాసనం ఈసీకి సూచించింది. 2024 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కేరళలోని కాసరగోడ్‌లో ఇటీవల మాక్ పోలింగ్ నిర్వహించారని, దీనిలో నాలుగు ఈవీఎంలను వీవీప్యాట్‌లతో సరిపోల్చినప్పుడు బీజేపీకి అదనంగా ఓట్లు వచ్చాయని పిటిషనర్లలో ఒకరైన అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ తరపున వాదించిన సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ తెలిపారు. దీనిపై బెంచ్ స్పందిస్తూ, ఈ వ్యవహారాన్ని పరిశీలించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఈ సందర్భంగా బెంచ్ ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ ఆరోపణల్లో వాస్తవం లేదని, దీనిపై కాసరగోడ్ జిల్లా కలెక్టర్ నుంచి వివరణను కూడా తెప్పించుకున్నామని, ఆ నివేదికను కోర్టుకు సమర్పించనున్నట్లు సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీశ్ కుమార్ తెలిపారు. కాగా, ఓటరు ఓటు వేసిన తర్వాత వీవీ ప్యాట్ స్లిప్ తీసుకునేందుకు అవకాశం కల్పించాలని మరో పిటిషనర్ తరపు న్యాయవాది నిజాం పాషా కోరారు. 'ఈ ప్రక్రియ ఓటరు గోప్యతకు భంగం కలిగించదా?' అని జస్టిస్ ఖన్నా ప్రశ్నించగా, 'లేదని' న్యాయవాది చెప్పారు. వీవీ ప్యాట్‌లోని మిషిన్‌లో లైటు ఎల్లవేళలా వెలుగుతూ ఉండాలని ప్రశాంత్ భూషణ్ సూచించారు. దీనివల్ల ఓటరు స్లిప్ కటింగ్, బాక్స్‌లో పడడాన్ని చూడగలుగుతాడని, ఇది వారి గోప్యతకు అడ్డు రాదని చెప్పారు. పారదర్శక ఓటింగ్‌కు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని కూడా ధర్మాసనం ఈసీని ప్రశ్నించింది. చివరగా సుప్రీంకోర్టు తీసుకునే నిర్ణయంపై ఈ మొత్తం వ్యవహారం ఆధారపడి ఉంటుంది.

# నీరు కారుతున్న 'నోటా'

నోటా విధానం వల్ల నిజాయితీ, నైతిక విలువలు పాటించే వారిని మాత్రమే రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులుగా బరిలోకి దించుతారనే ఆశాభావాన్ని సుప్రీంకోర్టు వ్యక్తం చేసింది. అయితే, ఒక మంచి ఉద్దేశ్యంతో వెలువరించిన ఈ తీర్పుకు అన్ని రాజకీయ పార్టీలు తిలోదకాలిచ్చాయి. నైతిక విలువలకు ఎటువంటి ప్రాధాన్యం ఇవ్వకుండా డబ్బు, కులం, మంది మార్బలం ఉండే వారినే తమ అభ్యర్థులుగా ప్రకటిస్తున్నాయనేది అవునన్నా కాదన్నా నేటి వాస్తవచిత్రం. గత అయిదేళ్ల కాలంలో వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికలతో కలిపి నోటాకు 1.29 కోట్లకు పైగా ఓట్లు లభించినప్పటికీ ఎన్నికల్లో పోటీ చేసే నేర చరిత అభ్యర్థుల సంఖ్య సార్వత్రిక ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికలు రెండింటిలోనూ పెరిగిపోయింది.



తడకమళ్ళ మురళీధర్

నోటా (నన్ ఆఫ్ ది అబోవ్) విధానం మొదటిసారిగా 2013లో చత్తీస్‌గడ్, మిజోరం, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రవేశపెట్టడం జరిగింది. 'పీపుల్స్ యూనియన్ సివిల్ లిబర్టీస్' వారు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌లో సుప్రీంకోర్టు తీర్పు ప్రకటిస్తూ 'నోటా అనే బటన్‌ను ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లో (ఈవీఎం) పోటీలో ఉన్న అభ్యర్థులకు చివరగా చేరుస్తూ చర్యలు తీసుకోవాల్సిందిగా' ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా 'భారత ఎన్నికల సంఘం' నోటా ఆప్షన్‌ను క్రాస్ గుర్తుతో చేర్చింది.

### గోప్యతకు ఢోకా లేదు

ఓటు వేయటమనేది ఓటరు ప్రాథమిక హక్కుగా భారత రాజ్యాంగం పరిగణనలోకి తీసుకోలేదు. ఓటు వినియోగం కేవలం చట్టబద్ధమైన హక్కు మాత్రమే కాబట్టి, ఏ ఓటరైతే ఓటు వేయటానికి ఇష్టపడడో అతనికి ఓటు వేయటానికి నిరాకరించే హక్కుకూడా ప్రజా ప్రాతినిధ్య చట్టం కల్పించింది. అయితే, ఓటు వేసిన వారు తాము ఎవరికి ఓటు వేశారనే విషయాన్ని గోప్యంగా ఉంచుకునే హక్కు ఉన్నట్లే, పోటీలోని అభ్యర్థులు ఎవరినీ ఎన్నుకోడానికి లేదా ఏ ఒక్కరికీ ఓటు వేయటానికి ఎవరైతే ఇష్టపడరో ఆ పౌరుడూ గోప్యతను కోరుకోవటంలో తప్పు లేదు. 'ఇవిఎం' విధానం వచ్చాక, నోటాకు ఓటు వేసేవారి గోప్యతకు రక్షణ లభించింది. కానీ, అంతకు ముందు పద్ధతి వేరు.

నోటా అమలుకు ముందు ఏదేని ఓటర్ పోలింగ్ స్టేషన్‌కు వెళ్లి బ్యాలెట్ పేపర్ తీసుకున్న పిదప, పోటీలో ఉన్న ఏ ఒక్క అభ్యర్థికి కూడా ఓటు వేయకూడదని నిర్ణయించుకున్నట్లయితే, ప్రిసైడింగ్ అధికారి 'ఫారం 17'లో అటువంటి ఓటర్ పేరు ఎదురుగా రిమార్క్ రాసి ఆ ఓటర్ సంతకం తీసుకోవటం, బ్యాలెట్ పేపర్ మీద, దాని కౌంటర్ ఫైల్ మీద 'రిటర్న్ చేయబడింది/ రద్దు చేయబడింది' అని రాసి, ఆ బ్యాలెట్ పేపర్‌ను ప్రత్యేక కవర్‌లో భద్ర పరచే విధానం వుండేది. ఆ విధంగా రిమార్క్ రాసి, రద్దు చేయబడిన బ్యాలెట్లను ప్రత్యేక కవర్‌లో ఉంచేవారు. దాంతో ఆ ఓటరు ఓటు వేయలేదనే గోప్యత బహిర్గతమయ్యేది. తద్వారా అతని భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం వాటిల్లేది. ఈ గోప్యతకు భంగం కలుగకుండా నివారించటానికి, పోలింగ్ స్టేషన్‌కు వచ్చిన ఓటరుకు పోటీలో ఉన్న ఏ అభ్యర్థి నచ్చక పోతే, 'ఈవీఎం'లోని నోటా బటన్‌ను నొక్కితే సరిపోతుంది. ఓటరు ఎవరికీ ఓటు వేయలేదనేది గోప్యంగానే ఉండిపోతుంది.

### నోటాకు విలువ లేనట్లేనా?

రాజ్యసభ, విధానమండలి ఎన్నికల్లో ఈ విధానం అమలులో లేదు. 'ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులకంటే నోటాకు ఎక్కువ ఓట్లు వచ్చిన సందర్భంలో ఎటువంటి చర్య తీసుకోవాలి?' అనే దానికి కూడ సుప్రీంకోర్టు అప్పట్లోనే జవాబిచ్చింది. నోటాకు అత్యధికంగా ఓట్లు పోలయి, మొదటి స్థానంలో నిలిచినట్లయితే, రెండో స్థానంలో నిలిచిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. 'నోటాకు పోలైన ఓట్లు మొదటి స్థానంలో ఉండి, పోటీలోని ఏ అభ్యర్థికైనా మొత్తం చెల్లుబాటైన ఓట్లలో 1/6 వంతు కంటే తక్కువ ఓట్లు వచ్చినట్లయితే అతడు ధరావత్తు కోల్పోతాడా?' అన్న ప్రశ్నకు కూడా 'భారత ఎన్నికల సంఘం' 'కాదని' సమాధానం చెప్పింది. అటువంటి సందర్భంలో నోటాకు పోలైన ఓట్లను పరిగణనలోకి తీసుకోకుండా మిగతా ఓట్లను మాత్రమే పరిగణనలోకి తీసుకొని ధరావత్తు విషయం నిర్ణయిస్తారు.

నోటా విధానం ఓటర్లను ప్రభావితం చేసి వారిని పోలింగ్ స్టేషన్ దాకా తీసుకు వెళ్తుందని, తద్వారా ఓటింగ్ శాతం పెరుగుతుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. కానీ, ఈ నోటా విధానానికి రాన్రాను ప్రాముఖ్యం తగ్గిపోతున్నది.




ఎందుకంటే, రెండో స్థానంలో నిలిచిన అభ్యర్థిని విజేతగా ప్రకటించటం, అభ్యర్థుల ధరావత్తు నిర్ణయించటానికి నోటాకు పోలైన ఓట్లను పరిగణనలోకి తీసుకోకపోవటం అనే విషయాలను నిపుణులు జీర్ణించుకోలేక పోతున్నారు. పోటీలోని ఏ అభ్యర్థి మాకు తగిన వ్యక్తి కాదని నియోజకవర్గంలోని అత్యధిక ఓటర్లు తిరస్కరించే సందర్భంలోనూ రెండోస్థానంలో నిలిచిన అభ్యర్థిని ఎన్నికైనట్లు ప్రకటించటం భావ్యం కాదన్నది కొందరి అభిప్రాయం.

### అసమర్థులకు పట్టం తప్పదా?

నోటాకు అత్యధిక ఓట్లు పోలైతే పోటీలోని అభ్యర్థులను కొన్ని సంవత్సరాల పాటు పోటీ చేయటానికి అనర్హులుగా ప్రకటిస్తూ, ఆ నియోజక వర్గానికి మరోసారి ఎన్నిక జరిపేటట్లు ఆదేశాలివ్వాల్సిందిగా సుప్రీంకోర్టు ముందు కొందరు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు వేశారు. ఇలా, రెండోసారి లేదా మూడోసారి ఎన్నిక జరపటం అనేది చాలా ఖర్చు, శ్రమతో కూడుకున్నదని, మన దేశంలో ఇటువంటి విధానం ఆచరణ యోగ్యం కాదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. 'నీతిమాలిన, నైతిక విలువలు లేని, మెజారిటీ ఓటర్ల చేత తిరస్కరణకు గురైన అభ్యర్థిని ఐదేళ్లపాటు నియోజకవర్గ నాయకుడిగా గుర్తించటం' అంతకంటే ఘోరమైన విషయమని పలువురు రాజనీతిజ్ఞులు, ఆర్థిక నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. కాగా, గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ వంటి స్థానిక ఎన్నికలకు ప్రజా ప్రాతినిధ్య చట్టం వర్తించడం లేదు.

> సుప్రీంకోర్టు మరో తీర్పు ప్రకారం పార్లమెంటు, అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా నామినేషన్‌తోపాటు, ప్రముఖ వార్తా పత్రికల్లో తమ మీద ఉన్నటువంటి నేర చరిత్రను బహిర్గతం చెయ్యాల్సి వుంది. 'ఇంతటి కఠినమైన ఆంక్ష వున్నప్పటికీ రౌడీలు, నేర చరితులు ప్రజా ప్రతినిధులుగా ఎన్నిక కావటంలో లోపం ఎక్కడుంది?' అనేది పెద్ద ప్రశ్నగా మిగిలిపోతున్నది. ఏది ఏమైనా సుప్రీంకోర్టు ద్వారా ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మరో తీర్పు రావాలి లేదా పార్లమెంటు అయినా సంచలన నిర్ణయం తీసుకోవాలి.


అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్( ఎడిఆర్) నివేదిక ప్రకారం గత పదేళ్లుగా క్రిమినల్ కేసులున్న ఎంపీల సంఖ్య పెరుగుతూ ఉంది. 2009లో ఎన్నికయిన ఎంపీలలో 30 శాతం మందిపై క్రిమినల్ కేసులున్నాయి. అంతకు ముందు ఎన్నికలతో పోలిస్తే ఈ సంఖ్య పెరిగింది. ఎడిఆర్ విశ్లేషించిన మొత్తం 543 మంది ఎంపీలలో 162 మంది ఎంపీలు తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటించారు. వీరిలో 76 మంది అంటే 17శాతం మందిపై తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసులున్నాయి.

(వ్యాసకర్త: విశ్రాంత జిల్లా జడ్జి)



*అంతరిక్షమూ ఒక యుద్ధ క్షేత్రమే. భవిష్యత్తులో అది యుద్ధాలకు వేదిక కాగలదు. గగనతలం, సముద్రం, భూభాగాలపైనా దీని ప్రభావం వుంటుంది. త్వరలోనే అంతరిక్ష దౌత్యమూ వాస్తవరూపానికి వస్తుందని నమ్ముతున్నాను.*

**– భారత త్రివిధ దళాల అధిపతి జనరల్ అనిల్ చౌహాన్**



*రాహుల్ గాంధీ, ఒమర్ అబ్దుల్లా ఇరువురూ 'స్పూన్ ఫీడింగ్ కిడ్స్'. వారిద్దరూ వ్యక్తిగతంగా ఎలాంటి త్యాగాలు చేయలేదు. రాజకీయ వారసత్వాన్ని ఎంజాయ్ చేస్తున్నారు. సొంతంగా చేసిందేమీ లేదు.*

**– కాంగ్రెస్ మాజీ నేత గులాం నబీ అజాద్**


# మోదీ హవాకు మూలం?

రెండు పర్యాయాలు అధికారాన్ని విజయవంతంగా పూర్తి చేసుకొని, ముచ్చటగా మూడో దఫాకూడా దేశంలో పాలనా పగ్గాలు చేజిక్కించుకోవాలని శతథా ప్రయత్నిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ 'హవా'కు మూలం ఏమిటి?

ఈ సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ ఆయన్నే ఎందుకు గెలిపించాలి? ప్రత్యామ్నాయం లేకనా? లేక, దేశంలోని మెజారిటీ ప్రజల మత విశ్వాసాన్ని చూరగొనడమేకాక అభివృద్ధి విషయంలోనూ ఆయన తనదైన ముద్రతో సాగుతున్నందుకా? గడచిన పదేళ్లుగా నరేంద్ర మోదీ ఆధ్వర్యాన నడిచిన బీజేపీ సర్కారు దేశానికి చేసిన అభివృద్ధి పనులు ఎన్నో కొన్ని లేకపోలేదు. పై సందేహాలకు కొందరు రాజకీయ విశ్లేషకులు చెబుతున్న సమాధానాలు ఒకింత ఆలోచింపదగ్గవిగానే వున్నాయి. రోడ్లు, రహదారులు, వంతెనలు వంటి మౌలిక వసతుల కల్పన, జాతీయ స్థాయిలో ఆర్థిక వ్యవస్థ, వ్యవహారాలను చెక్కుచెదరకుండా ఉంచగలగటం, అంతర్జాతీయ స్థాయిలో దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేయడం.. వంటి కొన్ని మంచి పనులు వాటిలో వున్నాయి. 'అసలు, దేశంలో మోదీ హవా ఏమీ లేదు' అన్న ప్రతిపక్షాల విమర్శను ప్రస్తుతానికి పక్కన పెట్టి, సానుకూల విషయాలను మాత్రమే పరిగణనలోకి తీసుకొంటే, అందులోని వాస్తవం బోధపడుతుంది.

### ఆర్థిక వ్యవస్థ చెక్కు చెదరలేదు!

భారత దేశంలో ఆర్థిక వ్యవస్థ ఎంతో సవ్యంగా వున్నట్టు పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. గడచిన కొన్నేళ్లుగా పలు రంగాలలో భారతీయులు గణనీయమైన అభివృద్ధిని సాధించారని, ప్రపంచవ్యాప్తంగా భారత్ ప్రతిష్ట మరింత బాగా ఇనుమడిస్తున్నదని కూడా వారు పేర్కొన్నారు. భారతదేశం భవిష్యత్తు మీద తాము పూర్తి భరోసాతోనే వున్నట్టు వారు చెప్పారు. పెద్ద ఆర్థిక వ్యవస్థలతోకూడిన దేశాలతో పోల్చినప్పుడు మన దేశం 'జీడీపీ' వేగంగా పెరుగుతున్నదని వారన్నారు. 2024, 2025 ఆర్థిక సంవత్సరాలలో సగటున 6.7 శాతం మేర పెరుగుదల నమోదు కానున్నట్టు కూడా వారు తెలిపారు.



### చైనా సంస్కరణలను గుర్తుకు తెస్తున్నారు!

నరేంద్ర మోదీని చైనా విప్లవకారుడు, అక్కడి రాజనీతివేత్త డెంగ్ జియావో పింగ్ (1904–1997)తో పోల్చుతున్నారు. ఆ దేశంలో డెంగ్ ప్రవేశపెట్టిన అద్భుత సంస్కరణలను గుర్తుకు తెచ్చేలా నరేంద్ర మోదీ కృషి చేస్తున్నట్టు కూడా విశ్లేషకులు కితాబు నిచ్చారు. దేశంలోని మధ్యతరగతి వర్గానికి చెందిన ప్రజలు బీజేపీ పాలనపట్ల సంతృప్తితోనే వున్నట్టు వారు నమ్ముతున్నారు. ఈ మధ్యకాలంలో దేశవ్యాప్తంగా జరిగిన మౌలిక వసతుల కల్పనను వారు ఉటంకిస్తున్నారు. రోడ్లు, జాతీయ రహదారులు, వంతెనలు, రైల్వేల అభివృద్ధి వంటి విషయాలలో మోదీ సర్కారు చక్కగా పని చేసినట్టు వారు చెప్పారు. వందే భారత్ రైళ్లు, ముంబైలో ఏర్పాటైన (జాతీయ స్థాయిలో) అతి పొడవైన సముద్ర వంతెన వంటివి వాటిలో వున్నట్టు పేర్కొన్నారు. గత అయిదేళ్లలో దేశవ్యాప్తంగా మౌలిక రంగంలో సుమారు 1 ట్రిలియన్ అమెరికన్ డాలర్ల వ్యయం జరిగినట్టు చెప్పారు.

### ఉత్పాదక రంగంలో గణనీయ ప్రగతి

చైనాలోని అసాధారణ వేగవంతమైన అభివృద్ధితో పోల్చలేక పోతున్నప్పటికీ ఉత్పాదక రంగంలో గత కొన్నేళ్లుగా గణనీయ ప్రగతి నమోదైనట్టు పై విశ్లేషకులు తెలిపారు. విదేశాలకు చెందిన కంపెనీలను దేశానికి రప్పించి, పెట్టుబడులు పెట్టించడంలోనూ మోదీ ప్రభుత్వం విశేష కృషి చేసిందనీ అన్నారు. గతేడాది భారతదేశానికి చెందిన స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు 100 శాతం వరకూ పెరిగాయని, వచ్చే ఏడాదికల్లా ప్రపంచంలోని 'ఐఫోన్స్ అసెంబ్లింగ్'లలో మన దేశం 25 శాతం వాటాను సొంతం చేసుకోగలదనీ వారు వెల్లడించారు. పరిశ్రమల రంగంలో ఉత్పాదకతను మరింతగా పెంపొందించడానికిగాను సుంకాల నియమ నిబంధనలు, అధికార యంత్రాంగ వ్యవస్థ విషయాలలో మరింత మేలైన కృషి జరపవలసి ఉంటుందని కూడా వారు సూచించారు.

ప్రపంచ స్థాయిలోనూ ప్రధాని మోదీ సవ్యమైన పాత్రనే పోషించినట్లు విశ్లేషకులు తెలిపారు. అంతర్జాతీయ స్థాయి దేశాధినేతలైన జోబైడెన్, మాక్రన్‌ల నుండి పుతిన్ వంటివారి వరకు అందరితోనూ ఆయన సత్సంబంధాలనే నెరిపారని, ముస్లిమ్ దేశాలు (ఈజిప్ట్, సౌదీ అరేబియా, యుఎఈ) సైతం ఆయనకు ఎర్ర తివాచీ పరిచాయని వారు గుర్తు చేశారు.

– దోర్బల బాలశేఖరశర్మ

# ఇదేం ప్రయాణం!

దేశంలోనే అత్యంత రద్దీ నగరాల్లో ఒకటైన బెంగళూరులో ఓ జంట ద్విచక్ర వాహనంపై ఎంత ప్రమాదకరంగా ప్రయాణం చేస్తూ ఉందో సోషల్ మీడియాలో వైరల్ కావడం ద్వారా వెలుగులోకి వచ్చింది.

భార్యాభర్తలు స్కూటీపై కూర్చుని ఉంటే పక్కనే వాళ్ల బిడ్డ ఫుట్‌రెస్ట్‌పైన నిలబడి ఉన్నాడు. రాత్రిపూట రద్దీగా ఉండే రోడ్డుపై ఏదయినా గుంత లాంటిది ఉండి బైక్ దానిలో పడితే చిన్న పిల్లాడు ఎగిరి పడే ప్రమాదం ఉంది. అదేమీ పట్టనట్లుగా ఆ జంట ప్రయాణం చేస్తుండడం చూసిన ఓ వ్యక్తి దాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టాడు. ఇంకేముంది, నెటిజన్లు ఆ జంటపై రకరకాల కామెంట్లు చేస్తూ ఓ ఆటాడుకున్నారు. చివరికి ట్రాఫిక్ పోలీసులకు కూడా ఫిర్యాదు చేయడంతో వారిపై చర్యలు తీసుకోవడానికి సిద్ధమయ్యారు.

ప్రతి రోజూ ప్రమాదాలు జరుగుతున్నా, ఎన్నో విలువైన ప్రాణాలు పోతున్నా వాహనదారుల నిర్లక్ష్యం మాత్రం పెరుగుతూనే ఉంది. ఇద్దరు ప్రయాణించడానికి పరిమితమైన ద్విచక్ర వాహనాలపై ముగ్గురు, అప్పుడప్పుడు నలుగురు కూడా ప్రయాణించడం చూస్తూనే ఉన్నాం. ఏదయినా ప్రమాదం జరిగితే ఆ వాహనంపై ప్రయాణించే అందరి ప్రాణాలకు ముప్పేనన్న విషయం వారికి తెలిసినా అదేమీ పట్టనట్లు ప్రవర్తిస్తుంటారు.

### బెంగళూరులో భారీ జరిమానా

బెంగళూరులోనే ఓ మహిళ నిర్వాకం చూస్తే ఎవరైనా ఆశ్చర్యపోక తప్పదు. ఆమె ఏకంగా 270 సార్లు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడినట్లు అక్కడి నగర ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. హెల్మెట్ లేకుండా బండి



నడపడం, ట్రిపుల్ రైడింగ్, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంప్.. ఇలా అనేక ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడినందుకు ఆమెకు ఏకంగా రూ.1.36 లక్షలు జరిమానా విధించినట్లు వారు తెలిపారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో ఆ మహిళ ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడినట్లు వీడియోలు రికార్డు అయ్యాయి. వాటి ఆధారంగా పోలీసులు పెండింగ్‌లో ఉన్న చలానాలు, జరిమానాలు కలిపి లక్షా 36 వేల రూపాయలు కట్టాల్సిందిగా ఆమెకు వరస నోటీసులు పంపారు. గతంలో కూడా బెంగళూరు ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి భారీగానే జరిమానాలు విధించారు. అయినా, ప్రజల్లో మార్పు రావడం లేదని నగర పోలీసు జాయింట్ కమిషనర్ ఎంఎన్ అనుచేత్ ఆవేదన వ్యక్తంచేశారు. పదేపదే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినందుకు ఇటీవల ఓ ద్విచక్ర యజమానిపై కేసు నమోదు చేయడంతోపాటు రూ.3.2 లక్షల జరిమానా విధించినట్లు ఆయన చెప్పారు.

ఇది ఒక బెంగళూరు నగర సమస్యే కాదు. దేశంలోని అన్ని నగరాల్లోను ఇదే తంతు. ట్రాఫిక్ నిబంధనలు ఉండేది తమ రక్షణ కోసమేననే విషయాన్ని వాహనదారులు గ్రహిస్తే ఇలాంటి పరిస్థితులు రావు.

## రచయితలకు ఆహ్వానం

'ఎడిట్ పేజీ' కోసం వివిధ సమకాలీన సామాజిక, రాజకీయ, ఆర్థిక తదితర అంశాలపై రచయితలు తమ స్వీయ రచనలు పంపవచ్చు. వ్యాసం నిడివి సుమారు 600 పదాలలోపు వుండాలి. మా చిరునామా: 'విజయక్రాంతి' దినపత్రిక, ఇంటర్‌కాంటినెంటల్ పబ్లికేషన్స్ ప్రై.లి., ప్లాట్ నంబర్: 1267/ఎ, రోడ్ నంబర్: 63/ఎ, జూబ్లీ హిల్స్, హైదరాబాద్–33.
email: vk.editpage@gmail.com

## పాఠకులకు గమనిక

ఎడిట్ పేజీలోని వ్యాసాలు, వాటిలోని భావనలు ఆయా రచయితల సొంత అభిప్రాయాలుగానే పరిగణించగలరు.

– ఎడిటర్






## కాగ్ నివేదికలపై ప్రజల్లో ఆసక్తి

హైదరాబాద్, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై కాగ్ (సీఏజీ) రూపొందించే రిపోర్టులపై ప్రజల్లో ఆసక్తి పెరుగుతోందని రాష్ట్ర అకౌంటెంట్ జనరల్ (ఆడిట్) పి.మాధవి తెలిపారు. ప్రజల్లో మరింత అవగాహన పెంచేలా నివేదికలను రూపొందించాలని స్టేట్ ఆడిట్ అడ్వయిజరీ బోర్డ్ (ఎస్ఏఏబీ) నిర్ణయించినట్లు తెలిపారు.

# ఓటు వేయం.. చైతన్యాన్ని చాటం!

## ఓటింగ్‌పై 'గ్రేటర్'వాసుల అనాసక్తి

- ఎన్నిక ఏదైనా నామమాత్రంగా పోలింగ్‌శాతం నమోదు
- గత లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడి నాలుగు స్థానాల్లో
- 50 శాతం కంటే తక్కువ పోలింగ్‌శాతం
- 'హైదరాబాద్' స్థానంలో కేవలం 44.85శాతం పోలింగ్
- పోలింగ్ శాతం పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు తప్పనిసరి



హైదరాబాద్, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఓటర్లు ఏ ఎన్నిక అయినా ఓటు వేయడానికి ఆసక్తి చూపుతారు. ఏదైనా కారణంతో తమ ఓటర్ స్లిప్ రాకపోతే తమకు తాము చిన్న బుచ్చుకుంటారు. అవసరమైతే సర్కార్ అధికారులు, సిబ్బందితో తగవుకు దిగుతారు. పట్టుబట్టి తమ ఓటు హక్కు సాధించుకుంటారు. చివరకు ఓటు హక్కు వినియోగించుకుంటారు. అందుకు ఎన్ని గంటలైనా క్యూలో నిలబడతారు. పోలింగ్ కేంద్రం నుంచి బయటకు వచ్చి ఓటు వేశానని గర్వంగా చెప్పుకుంటారు. కానీ నగరాల్లో నివసిస్తున్న వారు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్‌లో ఏఎన్నిక అయినా రానురాను పోలింగ్ శాతం తగ్గుతూ వస్తున్నది. అందుకు ఎన్నికలపై ఆసక్తి లేకపోవడం, నిర్లక్ష్యం, బద్ధకం ఇలా కారణలేవైనా చెప్పుకోవచ్చు.

### 2019 ఎన్నికల్లో పోలింగ్ ఇలా..

2019 సార్వత్రిక ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఉన్న లోక్‌సభ స్థానాల్లో 50శాతం కంటే తక్కువ పోలింగ్‌శాతం నమోదైన స్థానాల్లో తెలంగాణ నుంచి హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల పార్లమెంట్ సెగ్మెంట్స్ ఉన్నాయి. ఇవే ఎన్నికల్లో జాతీయస్థాయిలో సగటు 67.4 శాతం కంటే తక్కువగా పోలింగ్ జరిగిన రాష్ట్రాల జాబితాలో తెలంగాణ 62.7శాతం ఓట్లతో ఏడో స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా అత్యల్పంగా ఓటింగ్‌శాతం నమోదైన పార్లమెంట్ సెగ్మెంట్లలో హైదరాబాద్ 44.85 పోలింగ్‌శాతం నమోదు చేసి దేశంలోనే నాలుగో స్థానంలో నిలిచింది. ఇదే వరసలో సికింద్రాబాద్ ఏడో స్థానం, మల్కాజ్‌గిరి 12వ స్థానం, చేవెళ్ల 25వ స్థానంలో నిలిచాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ హైదరాబాద్ స్థానంలో 45.58 శాతం, సికింద్రాబాద్‌లో 50.55 శాతం, మల్కాజ్‌గిరిలో 46.84 శాతం, చేవెళ్లలో 65.69 శాతం మాత్రమే పోలింగ్‌శాతం నమోదైంది.

### విస్తీర్ణం.. ఓటర్ల సంఖ్య ఇలా..

దేశంలో తొలిసారి జరిగిన లోక్‌సభ (1951–52) ఎన్నికల్లో 17.3 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. వీరిలో నగరాలు, పట్టణాలకు చెందిన ఓటర్లు కేవలం 17 శాతం మాత్రమే. కానీ దశాబ్దాలు గడుస్తుండగా అర్బనైజేషన్ పెరిగింది. గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలు క్రమక్రమంగా పెరిగాయి. ఇక హైదరాబాద్ వంటి మహానగరాల సంగతైతే ప్రత్యేకంగా ఏం చెప్పనక్కర్లేదు. ప్రస్తుతం హైదరాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలో 21.97 లక్షల మంది ఓటర్లు, సికింద్రాబాద్ పరిధిలో 20.98 లక్షల మంది, మల్కాజ్‌గిరి పరిధిలో 37.38 లక్షల మంది, చేవెళ్ల పరిధిలో 29.06 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. విస్తీర్ణపరంగా 78.12 చ.కిమీతో హైదరాబాద్ పార్లమెంట్ స్థానం రాష్ట్రంలోనే చిన్నది. అలాగే ఓటర్ల పరంగా 37.38 లక్షల మందితోఒ మల్కాజ్‌గిరి అతిపెద్ద పార్లమెంట్ స్థానంగా నిలుస్తున్నది.

### పోలింగ్‌శాతం పెరగకపోవడానికి కారణాలు..

ఏటికేడు ఓటర్ల సంఖ్య పెరుగుతున్నప్పటికీ ఆ స్థాయిలో పోలింగ్ కేంద్రాల సంఖ్య పెరగడం లేదు. ఉద్యోగం, ఉపాధి, విద్యతో పాటు ఇతర కారణాలతో ఎంతోమంది ఓటర్లు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. పోలింగ్ రోజూ యాజమాన్యాలు ఉద్యోగులు, సిబ్బందితో పనిచేయిస్తున్నాయి. పోలింగ్ కేంద్రాల్లో క్యూ లైన్లలో నిలబడే ఓపిక నగరప్రాంతాలకు చెందిన ఓటర్లకు ఉండడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. కొందరికి రెండు చోట్ల ఓట్లు ఉండడమూ పోలింగ్ శాతం తగ్గడానికి కారణం.

**2019 ఎన్నికల్లో పోలింగ్ శాతం**

| లోక్‌సభ స్థానం | హైదరాబాద్ | సికింద్రాబాద్ | మల్కాజ్‌గిరి | చేవెళ్ల |
|---|---|---|---|---|
| ఓటర్ల సంఖ్య | 21,97,531 | 20,98,347 | 37,36716 | 29,06213 |
| పోలింగ్ శాతం | 44.84% | 46.50% | 49.63 % | 53.35 % |

### ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు ఉండాలి..

నగరాలు, పట్టణాలు పట్టణ ప్రాంతాల్లో ఎన్నికల సంఘం ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలు పెంచాలి. పోలింగ్ రోజు యాజమాన్యాలు ఉద్యోగులు, సిబ్బందికి వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలి. పోలింగ్ బూత్‌కు వెళ్లే రూట్ మ్యాప్‌ను ఓటర్లకు వాట్సప్ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి. రెండు చోట్ల ఓట్లు ఉన్నవారిని గుర్తించి వారికి ఒకేచోట ఓటు హక్కు కల్పించాలి. యువ ఓటర్లను ఆకర్షించేందుకు ఈసీ మారథాన్, 2కే రన్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలి. సామాజిక మాధ్యమాల్లో ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రభావవంతంగా ప్రచారం చేయాలి.



రోడ్‌షోలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, గోవా సీఎం ప్రమోద్ సావంత్

## బీజేపీ గెలుపు దేశ నినాదం

- తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కనుమరుగు ఖాయం
- కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే హక్కు లేదు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మెదక్, ఏప్రిల్ 18(విజయక్రాంతి): రానున్న రోజుల్లో తెలంగాణలో ఇంకో పార్టీకి భవిష్యత్తు లేదని, కేవలం భారతీయ జనతా పార్టీ మాత్రమే కొనసాగుతుందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం రాత్రి మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన ప్రసంగించారు. ఆరు గ్యారంటీల పేరుతో రాష్ట్రం లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను నిలువునా మోసం చేసిందని విమర్శించారు. పదేళ్ల పాలించిన బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల తర్వాత కనుమరుగవుతుందని, అలాగే కాంగ్రెస్ కనుమరుగు కావడానికి ఎంతో దూరం లేదని తెలిపారు. ఫిర్ ఏక్ బార్ మోదీ అనే నినాదం దేశంలోని ప్రతి ఇంటిలో మారుమోగుతుందన్నారు. ప్రధానిగా మోదీ మూడోసారి కావడం ఖాయమన్నారు. ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును గెలిపించి మోదీకి బహుమతిగా ఇవ్వాలన్నారు. గోవా సీఎం ప్రమోద్ సావంత్ మాట్లాడుతూ తెలంగాణలో పదేళ్లు కేసీఆర్ లూటీ చేస్తే.. ఇప్పుడు కాంగ్రెస్‌కు ఏటీఎంగా మారిందన్నారు. దేశ వ్యాప్తంగా జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా తెలంగాణకు ఎన్నో రహదారుల అభివృద్ధి ప్రధాని మోదీ చేశారని, మోసాలు, కుట్రలు, అవినీతి, అక్రమాలు చేసే వారిని ఎన్నికల్లో నిలబెట్టారని, వారిని ఇంటికి పంపించి బీజేపీ అభ్యర్థిని పార్లమెంట్‌కు పంపించాలన్నారు. ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు మాట్లాడుతూ రామరాజ్యం కావాలంటే బీజేపీకి ఓటు వేయాలన్నారు. పార్లమెంట్‌లో జిల్లావాసి వెళ్లాలి కాని అరువు తెచ్చుకున్నోళ్లు కాదన్నారు. బీఆర్ఎస్‌లో అభ్యర్థులు లేక అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారికి టికెట్లు ఇచ్చారని విమర్శించారు. జిల్లా మరింత అభివృద్ధి చెందాలంటే బీజేపీకి ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు శ్రీనివాస్, మెదక్, సంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, గోదావరి అంజిరెడ్డి పాల్గొన్నారు.

## ప్రతి కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అసెంబ్లీ సెగ్మెంట్ ఏఆర్‌వోలు, ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం అయ్యారు. భారత ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలకనుగుణంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, స్ట్రాంగ్‌రూమ్, కమిషనింగ్, కౌంటింగ్, బ్యారికేటింగ్, రెసెప్షన్ అండ్ డిస్ట్రిబ్యూషన్, ఫుడ్ ఏర్పాటు కోసం కావాల్సిన వ్యయంపై చర్చించారు. జిల్లాలోని రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో 1675లోకేషన్స్‌లో 3968 పోలింగ్ కేంద్రాలున్నాయని ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల మేరకు మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి హేమంత్‌కేశవ్ పాల్గొన్నారు.

## ఎన్నికల శిక్షణకు గైర్హాజరైన వారిపై కొరడా

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): పార్లమెంటు ఎన్నికల్లో పోలింగ్ నిర్వహణ తదితర విధులకు గైర్హాజరైన సిబ్బందిపై జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ కొరడా ఝుళిపించారు. ఎన్నికల శిక్షణా కార్యక్రమానికి హాజరు కావాలని ఇప్పటికే రెండుమార్లు నోటీసులు అందజేసినా స్పందించని 10 మందిపై ఆర్పీ యాక్ట్ 1951 సెక్షన్ 134 ప్రకారం (సీఆర్ నం.155/24) క్రిమినల్ కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, ఎక్స్‌పెండేచర్ మానిటరింగ్, స్వీప్, మ్యాన్ పవర్, మెటీరియల్ మేనేజ్‌మెంట్, పీడబ్ల్యూడీ తదితర నోడల్ అధికారులు, ఎన్నికల అధికారులతో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో గురువారం అధికారుల పనితీరుపై సమీక్ష జరిపారు. అనంతరం ఎన్నికల శిక్షణా తరగతులకు హాజరుకాని 10 మంది సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ ఎన్నికల విధుల నిర్వహణలో జిల్లాలో నియామకం చేసిన నోడల్ అధికారులు తమ విధులను పూర్తి అవగాహనతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు.

# కడియం కావ్యను ఆశీర్వదించండి

- బీజేపీ అరాచకాలను అడ్డుకోవాలంటే కాంగ్రెస్ గెలవాలి
- మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి

వరంగల్, ఏప్రిల్18 (విజయక్రాం తి): వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తు న్న డాక్టర్ కావ్యను నిండు మనసుతో ఆశీర్వదించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. వరంగల్‌లో గురువారం జరిగిన వర్ధన్నపేట నియోజకవర్గస్థాయి కాంగ్రెస్ సన్నాహక సమావేశంలో కడియం మాట్లాడుతూ.. వర్ధన్నపేటకు చెందిన వ్యక్తినే అయినప్పటికీ అక్కడి నుంచి పోటీ చేసే అవకాశం రాకున్నా అభివృద్ధిలో మాత్రం తన పాత్ర ఉన్నదని చెప్పారు. రాజకీయాల్లోకి సేవ చేయడానికి రావాలే తప్ప వ్యాపారం కోసం కాదని పేర్కొన్నారు. ఇటీవల శాసనసభ ఎన్నికలలో ప్రజలిచ్చిన తీర్పుకు చిన్న మెదడు చిట్లిపోయిన వ్యక్తులు కావ్య నాన్‌లోకల్ అంటూ పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. వందల ఎకరాల భూములు అక్రమంగా సంపాదించుకున్న వ్యక్తి రమేశ్ అని ఆరోపించారు. అందుకే శాసనసభ ఎన్నికలలో చావుదెబ్బ తిన్నారని ఎద్దేవాచేశారు. దేశంలో బీజేపీ అరాచకాలను అడ్డుకోవాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. బీజేపీ పాలనలో అన్ని వర్గాల మీద దాడులు జరుగుతున్నాయన్నారు. మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం రద్దు చేస్తామని బహిరంగంగా ప్రకటించడమే కాకుండా లౌకిక వాదం లేకుండా పోయే ప్రమాదమున్న నేపథ్యంలో ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. అనంతరం కాంగ్రె స్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. బీజేపీ గత పదేండ్లలో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. తనను నాన్‌లోకల్ అంటున్న భూ బకాసురుడు రమేశ్‌ను, బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో పాతాళంలోకి తొక్కాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నాగరాజు, రాజేందర్‌రెడ్డి, సత్యనారాయణరావు, యశస్వినిరెడ్డి, ఎంపీ పసునూరి దయాకర్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.



వరంగల్‌లో జరిగిన వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి

# రాహుల్‌ను ప్రధాని చేయాల్సిన బాధ్యత మనదే

- మోదీ తమ్ముడు కేసీఆర్.. వారిద్దరు కవల పిల్లలు
- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- కబ్జాలు చేసిన వ్యక్తిని ప్రజలు ఇంట్లో కూర్చోబెట్టారు
- ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): తెలంగాణ కోసం ఎంతో మంది ప్రాణాలను తృణప్రాయంగా అర్పిస్తున్న తరుణంలో సోనియాగాంధీ రాష్ట్రాన్ని ఇచ్చిందని.. ఆమె రుణం తీర్చుకోవడానికి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవిని గెలిపించుకుందామని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయాల్సిన నైతిక బాధ్యత మనందరిపై ఉన్నదని చెప్పారు. గురువారం వనపర్తి పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ సమావేశంలో మంత్రి మాట్లాడారు. ప్రధాని మోదీ, మాజీ సీఎం కేసీఆర్ కవలపిల్లలు అని అన్నారు. ధనిక రాష్ట్రంగా తెలంగాణను పదేండ్ల కింద కేసీఆర్ చేతిలో పెడితే 8 లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా మార్చాడని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలు అమలు చేస్తామని, ఇప్పటికే 5 గ్యారెంటీలను అమలు చేశామని స్పష్టంచేశారు. రాహుల్ ప్రధాని అయిన వెంటనే నిరుద్యోగుల కోసం 30లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ వేస్తారని చెప్పారు. ఎంపీ అభ్యర్థి మల్లురవి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ.. మోదీ దేశానికి చేసిందేమీ లేదని అన్నారు.

### కబ్జాలు చేసిన వ్యక్తిని ఇంట్లో..

భూకబ్జాలకు పాల్పడిన వ్యక్తిని వనపర్తి ప్రజలు ఇంట్లో కూర్చోబెట్టారని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిని ఉద్దేశించి అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరాలనుకుంటే రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి సమక్షంలో చేరండి.. ఎమ్మెల్యే మేఘారెడ్డి సమక్షంలో వద్దు అని నిరంజన్‌రెడ్డికి సూచించారు. తమ మధ్య తగాదాలు పెట్టే పద్ధతి మానుకోవాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేశ్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, పట్టణ పార్టీ అధ్యక్షులు చీర్ల చందర్, కౌన్సిలర్లు విభూతినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



వనపర్తి పట్టణంలో జరిగిన కార్నర్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

## మిర్యాలగూడ అభివృద్ధికి సహకరిస్తా..

- నల్లగొండ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి

నల్లగొండ, ఏప్రిల్ 18 (విజయక్రాంతి) : తనను గెలిపిస్తే మిర్యాలగూడ అభివృద్ధికి సహకరిస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి అన్నారు. గురువారం ఉదయం ఆయన మిర్యాలగూడలో పర్యటించారు. ఉదయం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎన్నెస్పీ మైదానంలో మార్నింగ్ వాకర్లను కలిసి ముచ్చటించారు. తన తండ్రి జానారెడ్డి చేసిన అభివృద్ధి వివరించారు. యువకుడిగా పార్లమెంటులో మిర్యాలగూడ సమస్యలను వివరించి రైల్వేలు, భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ), టెలికం సమస్యలు, విస్తరణ అంశాలు దృష్టికి తీసుకవచ్చి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వంద రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో భాగంగా పలు సంక్షేమ పథకాల అమలును వివరించారు. రఘువీర్ వెంట మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, నూకల వేణుగోపాల్ రెడ్డి, సొనబోయిన శ్రీనివాస్ యాదవ్, పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మార్నింగ్ వాకర్స్‌తో ముచ్చటిస్తున్న కుందూరు రఘువీర్‌రెడ్డి

## రిటర్నింగ్ కార్యాలయం పరిశీలన

- కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ ఆఫీస్‌ను సందర్శించిన వ్యయ పరిశీలకుడు
- సెంథిల్‌కు స్వాగతం పలికిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు ఎస్. సెంథిల్ కుమారన్ కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన సువిధ, ఎంసీసీ, అసిస్టెంట్ వ్యయపరిశీలకుని కార్యాలయం, వీఎస్‌టీ సెంటర్లలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.



బెజ్జంకిలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

## కాంగ్రెస్ ఇచ్చిన హామీలను మరిచింది

- బీజేపీకి ఓటేస్తే పెనంమీది నుంచి పొయ్యిలో పడినట్టే
- బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి
- బెజ్జంకి రోడ్‌షోలో మాజీ మంత్రి హరీశ్‌రావు



రోడ్‌షో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీలను మరిచిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. గురువారం కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కలిసి రోడ్‌షో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఆరుగ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. క్వింటాలు వడ్లు రూ. 2500లకు కొంటామన్నారు ఏమయ్యిందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతులకు ప్రకటించిన ఏ హామీ నెరవేర్చలేదన్నారు. బీజేపీకి ఓటేస్తే పెనం నుంచి పొయ్యిలో పడ్డట్టు ఉంటుందన్నారు. కరీంనగర్ పరిధిలో బండి సంజయ్ అభివృద్ధికి ఐదు పైసలు కూడా తేలేదని, బెజ్జంకి లక్ష్మీనరసింహస్వామికి ఒక్క రూపాయి తెచ్చాడా అని ప్రశ్నించారు. బోయినపల్లి విజయ్‌కుమార్‌ని భారీ మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.






హైదరాబాద్, శుక్రవారం, 19 ఏప్రిల్ 2024
www.vijayakranthinews.com








"అమేథీ నుంచి పోటీ చేసేందుకు రాహుల్ జంకుతున్నారు. కాంగ్రెస్ గత 20 ఏళ్లుగా 'రాహుల్‌యాన్'ను లాంచ్ చేయలేకపోతోంది. రాహుల్‌యాన్ లాంచ్ అయ్యేది లేదు.. లాండ్ అయ్యేది లేదు."

– కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్



కేరళలోని కన్నూర్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో అభివాదం చేస్తున్న రాహుల్

## దేశ రక్షకులు కాంగ్రెస్ కార్యకర్తలే

- క్షేత్రస్థాయి కార్యకర్తలే కాంగ్రెస్‌కు బలం
- దేశ ఐకమత్యాన్ని బీజేపీ కూలదోస్తోంది
- చరిత్రను మార్చేందుకు ప్రయత్నం
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: భారత్ భావజాలానికి వ్యతిరేకంగా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ పని చేస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. వాళ్లు రాజ్యాంగంతో పాటు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల సంఘంతో పాటు వివిధ సంస్థలను దుర్వినియోగం చేసున్నారని మండిపడ్డారు. కేరళలోని కన్నూర్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన.. బీజేపీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. దేశంలో ఏకత్వాన్ని విచ్ఛిన్నం చేస్తున్నారని ఆరోపించారు. కానీ దేశంలో భిన్నత్వంలో ఏకత్వాన్ని కాంగ్రెస్ ప్రోత్సహిస్తుందన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య రక్షణ కోసం ఈ ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుత బీజేపీ పాలనలో సమాన హక్కులు, అందరికీ అవకాశాలు లభించట్లేదని ఆరోపించారు.

**బీజేపీకి 150 సీట్లు మాత్రమే**

గ్రామాలు, పట్టణాల్లో ఆర్‌ఎస్‌ఎస్ భావజాలానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరముందని రాహుల్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ కార్యకర్త లే దేశ రక్షకులన్నారు. బీజేపీకి 150 సీట్లే వస్తాయన్నారు. రాష్ట్రాల నుంచి వచ్చిన నివే దికల ప్రకారం కాంగ్రెస్ బలంగా పుంజు కుంటోందని చెప్పారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోనూ బలమైన కూటమిగా ఏర్పడ్డామని, మంచి ఫలితాలు చూస్తామని రాహుల్ ఆశాభావం వ్యక్తం చేశారు.

**కొత్త చరిత్రను బీజేపీ రుద్దుతోంది...**

కేరళలో కాంగ్రెస్, యూడీఎఫ్.. దేశంలో విభిన్న సంస్కృతులను గౌరవిస్తామని రాహుల్ ఉద్ఘాటించాచరు. వివిధ భాషలు, సంస్కృతులు, చారిత్రక నేపథ్యాలు, వివిధ ప్రజల భావోద్వేగాలను ప్రాధాన్యమిస్తామని తెలిపారు. కానీ, బీజేపీ తనకు కావాల్సిన చరిత్రను మాత్రమే ప్రజలపై రుద్దేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఒకే దేశం, ఒకే భాష అంటూ ప్రజలను మభ్యపెడుతోందన్నారు. తమ సమయాన్ని వృథా చేస్తూ దేశంలో వైవిధ్యాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

# తొలి విడత పోలింగ్ నేడే

- 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎన్నికలు
- 102 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ నిర్వహణ
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన ఎన్నికల కమిషన్
- ఈవీఎంలలో అభ్యర్థుల భవితవ్యం నిక్షిప్తం చేయనున్న ఓటర్లు
- తొలి విడతలో బరిలో నిలిచిన ప్రముఖ నేతలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: సార్వత్రిక ఎన్నికల సమరానికి సర్వం సిద్ధమైంది. ఇవాళ లోక్ సభ ఎన్నికల్లో కీలక ఘట్టం ఆవిష్కృతం కానుంది. దేశవ్యాప్తంగా 543 లోక్‌సభ స్థానాలకు 7 విడతల్లో ఎన్నికలు జరుగుతుండగా, తొలి దశ ఎన్నికలకు శుక్రవారం తొలి విడత పోలింగ్ జరగనుంది. ఇందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈవీఎంలను చేరాల్సిన ప్రదేశాలకు పకడ్బందీగా సిబ్బంది తరలించింది. తొలి విడతలో 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 102 లోక్‌సభ సీట్లకు ఈ ఎన్నికలు నిర్వహించనున్నారు. తమిళనాడులో 39 లోక్‌సభ స్థానాలు ఉండగా అన్ని స్థానాలకు ఒకే రోజు పోలింగ్ జరగనుంది. ఇక రాజస్థాన్‌లో 12 సీట్లకు, ఉత్తరప్రదేశ్‌లో 8, మధ్యప్రదేశ్‌లో 6, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, అస్సాంలో ఐదు సీట్ల చొప్పున, బిహార్‌లో నాలుగు, పశ్చిమ బెంగాల్‌లో మూడు, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయలో రెండు చొప్పున, చత్తీస్‌గఢ్, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, అండమాన్–నికోబార్, జమ్ము కశ్మీర్, లక్షద్వీప్, పుదుచ్చేరిలో ఒక్కో సీటు చొప్పున లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. కాగా, అరుణాచల్‌ప్రదేశ్‌లో 60 అసెంబ్లీ స్థానాలకు, సిక్కింలోని 32 అసెంబ్లీ స్థానాలకు కూడా ఎన్నికలు జరగనున్నాయి.

**ప్రముఖ అభ్యర్థులు వీరే..**

తొలి విడత ఎన్నికల్లో కీలక వ్యక్తులు బరిలో ఉన్నారు. దీంతో ఎన్నికల రణం మరింత రసవత్తరంగా మారింది. విమర్శలు, ప్రతివిమర్శలతో ఎన్నికల వాతావరణాన్ని హాట్ హాట్‌గా మార్చారు. కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, సర్బానంద సోనోవాల్, భూపేంద్ర యాదవ్‌తో పాటు కాంగ్రెస్ తరపున గౌరవ్ గొగోయ్, డీఎంకే నుంచి కనిమొళి, బీజేపీ నుంచి అన్నామలై, సౌందరరాజన్, ఒ.పన్నీరు సెల్వం తదితరులు బరిలో ఉన్నారు.

**ఓటేయనున్న 16.63 కోట్ల మంది**

తొలి విడత ఎన్నికలు శుక్రవారం ఉదయం ఏడు గంటలకు ప్రారంభమై సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగనున్నది. ఎన్నికలు జరుగుతున్న స్థానాల్లో మొత్తం 1.87 లక్షల పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు 18 లక్షల మంది సిబ్బందిని కేటాయించారు. తొలి విడతలో 16.63 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వారిలో 8.4 కోట్ల మంది పురుషులు, 8.23 కోట్ల మంది స్త్రీలు, 11,371 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. 20 నుంచి 29 ఏండ్ల మధ్య ఉన్న యువ ఓటర్లు 3.51 కోట్ల మంది ఉండటం గమనార్హం.



**నితిన్ గడ్కరీ**

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి హ్యాట్రిక్ కొట్టాలని యత్నిస్తున్నారు. 2014, 2019 ఎన్నికల్లో గెలిచారు.



**తమిళిసై సౌందరరాజన్**

ఇటీవల తెలంగాణ గవర్నర్ పదవికి రాజీనామా చేసి తమిళనాడులోని చెన్నై సౌత్ నుంచి బీజేపీ తరపున బరిలో ఉన్నారు.




**కంగనా రనౌత్**

హిమాచల్‌ప్రదేశ్ మండీ నుంచి బాలీవుడ్ నటి కంగనా రనౌత్ పోటీ చేస్తున్నారు. ఆమె కాంగ్రెస్ నేత విక్రమాదిత్య సింగ్‌తో పోటీలో ఉన్నారు.



**అన్నామలై**

తమిళనాడు బీజేపీ చీఫ్ అన్నామలై కోయంబత్తూర్ నుంచి బరిలో ఉన్నారు. ఐపీఎస్‌కు రాజీనామా చేసి తమిళనాడు బీజేపీ చీఫ్‌గా ఎదిగారు.



**పన్నీరు సెల్వం**

రామనాథపురం నుంచి పన్నీరు సెల్వం పోటీ చేస్తున్నారు. ఈవీఎంలో ఆయన పేరు చుట్టూ నలుగురు అభ్యర్థుల పేర్లు పన్నీరు సెల్వమే.

## నామినేషన్ల ప్రక్రియ షురూ

- ఏపీ, తెలంగాణలో నిన్నటి నుంచే దాఖలుకు అవకాశం
- ఏప్రిల్ 25 తుది గడువు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి నాలుగో దశ నోటిఫికేషన్ విడుదలైంది. గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. మొత్తం 9 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 92 నియోజకవర్గాల్లో ఈ దశలో ఎన్నికలు జరగనున్నాయి. తెలంగాణలోని 17 ఎంపీ స్థానాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని 25 లోక్‌సభ స్థానాలు, 175 అసెంబ్లీ స్థానాలకు మే 13న ఎలక్షన్ జరగనున్నాయి. తెలంగాణ, ఏపీతో పాటు బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బంగా, జమ్ము కశ్మీర్‌లోని పలు స్థానాలకు ఈ దశలో పోలింగ్ జరుగుతుంది. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 25 వరకు ఈసీ గడువు విధించింది. ఏప్రిల్ 26న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. ఏప్రిల్ 29 వరకు అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు ఈసీ అవకాశం కల్పించింది.



## మామిడి పండ్లు తింటున్న కేజ్రీవాల్

- షుగర్ లెవల్స్ పెంచుకునే ప్రయత్నమన్న ఈడీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: లిక్కర్ స్కాంలో ఆరోపణలు ఎదుర్కొంటూ తీహార్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ బెయిల్ కోసం చెక్కెర లెవెల్స్ పెంచుకునేందుకు మామిడి పండ్లు, మిఠాయిలు తింటున్నారని ఈడీ ఆరోపించింది. షుగర్ లెవల్స్ పెరుగుతున్నాయని, వారంలో 3 సార్లు వైద్యనిపుణుడిని సంప్రదించేందుకు అనుమతివ్వాలని కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం ఢిల్లీ ప్రత్యేక న్యాయస్థానం విచారించింది. 'షుగర్ లెవల్స్ పెరిగి అనారోగ్యానికి గురైతే బెయిల్ వస్తుందని కేజ్రీవాల్ భావించి చక్కెరలు ఎక్కువుండే ఆహారం తీసుకుంటున్నారు' అని ఈడీ తరపు స్పెషల్ పీపీ జోహెబ్ హుస్సేన్ వాదించారు. ఈ వాదనను కేజ్రీవాల్ తరపు న్యాయవాది వివేక్ జైన్ తోసిపుచ్చారు. మీడియా అటెన్షన్ కోసమే ఈడీ ఆరోపణలు చేస్తున్నదని చెప్పారు. జైలులో కేజ్రీవాల్‌కు అమలు చేస్తున్న డైట్ ప్లాన్‌తో పాటు ఆయన మెడికల్ రిపోర్టులు అందజేయాలని జైలు అధికారులను కోర్టు ఆదేశించింది.

## మొదటిసారి ఓటు వేస్తున్నారా..!

- 1.82 కోట్ల మంది కొత్త ఓటర్లు
- ఇవాళ ఓటేయనున్న యువ ఓటర్లు
- ఓటు హక్కు వినియోగంపై ఈసీ సూచనలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: సార్వత్రిక ఎన్నికల్లో మొదటి ఘట్టం చివరి దశకు వచ్చింది. దేశంలో మొత్తం 543 పార్లమెంట్ స్థానాలకు 7 దశల్లో ఎన్నికలు జరగనుండగా.. తొలిదశ పోలింగ్ నేడు జరగనుంది. దేశంలో కొత్తగా 1.82 కోట్ల మందికి ఓటు హక్కు లభించింది. తొలి విడతలో భాగంగా 21 రాష్ట్రాల్లోని 102 నియోజకవర్గాల్లో పోలింగ్ జరగనుంది. తొలిసారి ఓటేసే వారికి ఎన్నికల కమిషన్ పలు సూచనలు చేసింది.

**అవసరమైన పత్రాలు..**

మీరు ఓటు వేయడానికి వెళ్లినప్పుడు ఏదో ఒక గుర్తింపు పత్రం చూపించాలి. ఓటర్ ఐడీ కార్డు, ఆధార్ కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు, ఫొటోతో ఉన్న బ్యాంకు లేదా పోస్టాఫీస్ పాస్‌బుక్, జాతీయ ఉపాధి హామీ కార్డు, ఎన్‌పీఆర్ స్మార్ట్ కార్డ్ లేదా ఏదైనా ప్రభుత్వం గుర్తించిన సంస్థ ద్వారా పొందిన ఐడీ కార్డుల్లో ఏదో ఒకటి చూపించాలి.

**పోలింగ్ ప్రక్రియ..**

పోలింగ్ బూత్ తెలుసుకునేందుకు.. ఓటర్ ఐడీ కార్డులోని ఎపిక్ నంబర్‌ను ఈసీ వెబ్‌సైట్‌లో ఎంటర్ చేయాలి. ఆ వెంటనే మీరు ఏ పోలింగ్ బూత్‌లో ఓటు వేయాలో వివరాలు కన్పిస్తాయి.


పోలింగ్ బూత్‌లో సిబ్బంది ఓటర్ల జాబితాలో మీ పేరును మీ ధ్రువీకరణ పత్రంతో బేరీజు చేసుకుంటారు.

ఆ తర్వాత మీ చూపుడు వేలుకు ఇంక్ పూస్తారు. రశీదు ఇచ్చాక రిజిస్టర్‌లో సంతకం చేయాలి.

ఈ రశీదును మరో ఎన్నికల సిబ్బందికి ఇవ్వాలి. తర్వాత బూత్‌లోకి వెళ్లాక ఈవీఎంలో మీరు ఓటేసే పార్టీ లేదా అభ్యర్థి గుర్తు పక్కన ఉన్న బటన్ నొక్కాలి. వెంటనే బీప్ శబ్దం వస్తుంది. అంటే మీరు ఓటు వేసినట్లు సంకేతాన్ని ఇస్తుంది.

**ఓటు వేసే అర్హత..**

ఓటర్ల జాబితాలో మీ పేరు ఉందో లేదో ముందుగా తెలుసుకోవాలి. ఇందుకోసం స్థానిక ఎన్నికల అధికారిని సంప్రదించాలి. లేదా ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో మీ పేరును సరి చూసుకోవాలి.



## నేను కృష్ణుడి గోపికను

బీజేపీ ఎంపీ హేమమాలిని

మధుర, ఏప్రిల్ 18: తనను తాను శ్రీకృష్ణుడి గోపికగా భావిస్తున్నానని బీజేపీ ఎంపీ, బాలీవుడ్ నటి హేమమాలిని అన్నారు. మూడోసారి ఎంపీ సీటు ఇచ్చినందుకు ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె మధురలో మీడియాతో మాట్లాడారు. తాను రాజకీయాల్లోకి పేరు కోసమో, డబ్బు సంపాదించడానికో రాలేదని, ప్రజా సేవే లక్ష్యంగా వచ్చానని వివరించారు.

## మీ వల్లే.. కాదు మీ వల్లే..!

- శ్రీరామనవమి అల్లర్లపై పరస్పర ఆరోపణలు
- బెంగాల్‌లో బీజేపీ, టీఎంసీ మధ్య వార్

కోల్‌కత్తా, ఏప్రిల్ 18: శ్రీరామనవమి సందర్భంగా బుధవారం పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్, రాజ్‌నగర్ ఊరేగింపుల్లో ఘర్షణలు చోటుచేసుకున్నాయని, బీజేపీ ముందస్తుగానే ఘర్షణలకు ప్లాన్ చేసిందని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. మరోవైపు ఘర్షణలపై ఎన్‌ఐఏ విచారణ జరపాలని బీజేపీ బెంగాల్ అధ్యక్షుడు సుకాంతా మజుందార్ డిమాండ్ చేశారు. ఘర్షణల్లో టీఎంసీ నేతల ప్రమేయం ఉందని ఆరోపించారు. సీఎం మమతా బెనర్జీ రెచ్చగొట్టే ప్రసంగాల వల్లే బెంగాల్‌లో ఘర్షణలు చోటుచేసుకున్నాయని, ఎన్నికల సంఘం ఆమెపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత సువేందు అధికారి కోరారు. ఈ వ్యాఖ్యలను సీఎం మమతా బెనర్జీ ఖండించారు.

## ఫైటర్ జెట్ల డీల్ విప్లవాత్మకం

ఇండియా, అమెరికా ఒప్పందంపై అమెరికా రక్షణ మంత్రి

వాషింగ్టన్, ఏప్రిల్ 18: భారత వాయుసేన కోసం జెట్ ఇంజిన్లు తయారు చేసేందుకు భారత్, అమెరికా మధ్య కుదిరిన ఒప్పందం చరిత్రాత్మకమైనదని అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ అన్నారు. గతేడాది జూన్‌లో ప్రధాని మోదీ అమెరికా పర్యటనలో ఒప్పందం కుదిరింది. భారత్‌లో ఎఫ్414 జెట్ ఇంజిన్లు తయారు చేసేందుకు అమెరికా కంపెనీ జనరల్ ఎలక్ట్రిక్‌తో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ ఒప్పందం చేసుకొన్నది.







# ఆపరేషన్ విజయ్‌నగర్

- ఎత్తైన కొండలు, దట్టమైన అడవులు, క్రూర మృగాల మధ్య..
- గంటల కొద్దీ ట్రెక్కింగ్ ద్వారా చేరుకోవాల్సి ఉంటుంది
- ఛత్తీస్‌గఢ్ లాంటి నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లోనూ ప్రత్యేక చర్యలు
- వాయుసేన సహకారంతో పోలింగ్ ఏర్పాట్లు



అరుణాచల్‌ప్రదేశ్, ఏప్రిల్ 18: దేశంలో సూర్యుడు ఉదయించే రాష్ట్రం అరుణాచల్‌ప్రదేశ్. ఇక్కడి చాంగ్‌లాంగ్ జిల్లాలోని విజయ్‌నగర్ చాలా మారుమూల ప్రాంతం. మయన్మార్‌లోకి చొచ్చుకుపోయినట్లు ఉంటుంది. చుట్టూ దట్టమైన అడవి, ఎత్తయిన కొండల్లో ఉంది ఈ ప్రాంతం. అయితే ప్రస్తుతం దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. అరుణాచల్‌ప్రదేశ్‌లో రెండు ఎంపీ స్థానాలు ఉన్నాయి. కానీ, ఈ ప్రాంతంలో ఎన్నికల నిర్వహణ చాలా కష్టంతో కూడుకున్న పని. అందులో ముఖ్యంగా విజయనగర్ ప్రాంతం పూర్తిగా అడవులు, కొండలు.. సరైన రోడ్డు మార్గం లేని పరిస్థితి నెలకొంది. ఎత్తైన పర్వతాలు, దట్టమైన అడవులు దాటుకుని వెళ్లాల్సి ఉంటుంది. కొన్ని పోలింగ్ స్టేషన్లకు సులభంగా చేరుకోగలిగినా.. కొన్ని ప్రాంతాలకు మాత్రం చాలా దూరం ప్రయాణించాల్సి వస్తుంది. చాలా ప్రాంతాల్లో మొబైల్ సిగ్నల్ కూడా ఉండదు. అయినా ఎన్నికల సంఘం మాత్రం ప్రతి ఒక్క ఓటు కోసం ఏర్పాట్లు చేస్తుంది. అంతర్జాతీయ సరిహద్దులో ఉన్న ఈ ప్రాంతంలో పోలింగ్ ఏర్పాట్ల గురించి తెలుసుకుందాం.

**అనేక సవాళ్లు దాటుకుంటూ**

దేశంతో పోలిస్తే అరుణాచల్ ప్రదేశ్‌లో జనాభా సాంద్రత చాలా తక్కువ. ఇందువల్ల ఇక్కడ ఎన్నికల నిర్వహణ అధికారులకు వైవిధ్యంతో పాటు అనేక సవాళ్లు ఎదురవుతాయి. సుమారు 13 వేల అడుగల ఎత్తైన ప్రాంతాల్లో ఒకే ఒక్క ఓటరు ఉన్నారు. వారికి కూడా ఓటు కల్పించేందుకు ఎన్నికల స ంఘం కావాల్సిన ఏర్పాట్లు చేస్తోంది. వివిధ ప్రత్యామ్నాయాలను ఉపయోగిస్తూ ఓటర్లకు చేరువవుతోంది. ఇలాంటి పరిస్థితే క్రాదాది జిల్లాలోని హాయ్‌మాచిలో ఎదురవుతుంది. అక్కడికి చేరుకునేందుకు 40 నుంచి 50 కిలోమీటర్లు ఎన్నికల అధికారులు ట్రెక్కింగ్ చేసుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. ఈ క్రమంలో అడవి జంతువుల నుంచి ప్రమాదాలు కూడా ఎదురవుతాయి. వీటన్నింటినీ దాటుకుని వెళ్లాల్సి ఉంటుంది. ఇంత కష్టపడినా వృద్ధులను పోలింగ్ స్టేషన్లకు తీసుకురావడం మరో సవాలుతో కూడుకున్న పని అని అధికారులు చెబుతున్నారు.

**పర్వతాల్లో సాహస యాత్ర**

అరుణాచల్‌ప్రదేశ్‌లో ఉన్న రెండు స్థానాలకు మొదటి దశలో భాగంగా ఏప్రిల్ 19న ఎన్నికలు జరగనున్నాయి. లోక్‌సభతో పాటు రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. అయితే, తూర్పు అరుణాచల్ లోక్‌సభ నియోజకవర్గంతో పాటు మియావో అసెంబ్లీ సెగ్మెంట్‌లో భాగమైన చాంగ్‌లాంగ్ జిల్లాలోని విజయనగర్.. సముద్రమట్టానికి 4,070 అడుగుల ఎత్తులో ఉంది. ఇక్కడ గోర్ఖా సమాజానికి చెందిన యోబిన్ తెగ, అలాగే మాజీ అస్సాం రైఫిల్స్ నివసిస్తుంటారు. విజయనగర్ పరిధిలోని 9 పోలింగ్ స్టేషన్లలో 3,859 ఓటర్లు ఉన్నారు. ఇందులో రెండు స్టేషన్లకే విద్యుత్ సౌకర్యం ఉంది. గతంలో ఎన్నికల అధికారులు వాయుసేన హెలికాప్టర్ల ద్వారా ఆయా పోలింగ్ స్టేషన్లకు చేరుకునేవారు. ప్రస్తుతం రోడ్డు సౌకర్యాలు పెరగడంతో కొన్ని ప్రాంతాలకు మోటార్ వాహనాల ద్వారా చేరుకుంటున్నారు. అయితే, ఈ రోడ్డు సౌకర్యం కూడా ఆరు పోలింగ్ స్థానాలకే ఉంది. మిగిలిన 3 స్టేషన్లకు రోడ్డు సౌకర్యం లేదు. ఈ స్థానాలకు కొంత దూరం నాలుగు చక్రాల బండిలో వెళ్లాల్సి ఉంటుంది. మిగిలిన దూరం పర్వతాలను అధిరోహించాల్సి వస్తుంది. ఈ ప్రాంతంలో మొబైల్ సిగ్నల్స్ ఉండని కారణంగా వీఎస్‌ఏటీ డివైజ్‌లను ఉపయోగించాల్సి ఉంటుంది. పోలింగ్ ముగిశాక సిబ్బంది రాత్రి 9 గంటల్లోపు బయల్దేరాల్సి వస్తుంది. వీరు చాంగ్‌లాంగ్‌లోని స్ట్రాంగ్‌రూమ్‌కు చేరుకునే సరికి మరో 3 గంటలు సమయం పడుతుంది.

**నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లోనూ...**

హిమాలయ ప్రాంతాల్లోని ఎత్తైన కొండల్లోనే కాకుండా నక్సల్స్ ప్రభావిత ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్‌లోనూ ఈసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఛత్తీస్‌గఢ్‌లో మూడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలు సజావుగా జరిగేలా భారత సాయుధ దళాలు కూడా తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి. నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లోకి పోలింగ్ సిబ్బంది సురక్షితంగా చేరుకునేందుకు భారత వాయుసేన ఎంఐ–17 హెలికాప్టర్లను కేటాయించింది. బీజాపూర్ కలెక్టర్ అనురాగ్ పాండే, ఎస్పీ జితేంద్రయాదవ్ మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు కావాల్సిన చర్యలు తీసుకున్నామన్నారు. 48 ఈవీఎంలను ఐఏఎఫ్ హెలికాప్టర్ల ద్వారా చేర్చినట్లు గడ్చిరోలి ఎస్పీ నీలోత్‌పాల్ వెల్లడించారు. ప్రస్తుతం ఎన్నికల అధికారులను వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్లకు సురక్షితంగా చేరుస్తున్నామని స్పష్టం చేశారు.

సినిమా రంగంలో చిత్ర నిర్మాణం ఒక ఎత్తయితే వాటి విడుదల మరో ఎత్తు. పెట్టుబడులకు సరిపడా వసూళ్ళు రావాలంటే సరైన విడుదల ఉండాల్సిందే. ఆ రకంగా మన తెలుగు చిత్ర పరిశ్రమలో సంక్రాంతి, వేసవి, దసరా మరియు డిసెంబర్ కలుపుకుని నాలుగు సీజన్లు ఉన్నాయి. కలెక్షన్ల వర్షం కురిపించే అగ్రహీరోల చిత్రాలు తెరమీదికి వచ్చేది ఈ సీజన్లలోనే. తెలుగు వారి సంబురాల సంక్రాంతి తర్వాత సినీ హంగామా అంతా సమ్మర్ లోనే. వేసవి సెలవులలో విద్యార్థులు బ్లాక్ బోర్డ్ నుండి సిల్వర్ స్క్రీన్ వైపు చూడటం ఇందుకు ముఖ్య కారణం. బుల్లితెరపై ఐపిఎల్ మ్యాచ్‌లు, వెండి తెరపై అభిమాన హీరోల చిత్రాలు ఇదీ వారి సమ్మర్ షెడ్యూల్. ఏసి థియేటర్లలో మండే ఎండల నుండి కాస్త ఉపశమనం కల్పించడంతో పాటు రెండున్నర గంటల వినోదం పంచుతామంటే ప్రేక్షకులు మాత్రం అంతకంటే కోరేదేముంటుంది? అయితే ఈ ఏడు వేసవి సినిమా రిలీజ్ షెడ్యూల్ చూస్తుంటే సినీ ప్రియులకు భానుడి తాపంతో పాటు వినోద తాపము తప్పేట్టు లేదు.

# వేసవిలో వినోద తాపం..



అగ్ర హీరోల నుండి ఏడాదికి ఒక సినిమా అయినా ఉండాలని ఆశించి, అది సంక్రాంతికి కాస్త అటుఇటైనా సమ్మర్ కోసం ఆశగా చూస్తారు అభిమానులు. ఈ సంవత్సరం వారికి నిరాశే మిగిలేలా ఉంది. గతేడాది 'వాల్తేర్ వీరయ్య', 'భోళా శంకర్' చిత్రాలతో తెరపైకి వచ్చిన చిరంజీవి, 'విశ్వంబర'తో మళ్ళీ తెరపై కనపడేది 2025లోనే. పంద్రాగష్టు దాకా వచ్చేదేలే.. ఆ రోజున 'తగ్గేదేలే' అంటున్నారు అల్లు అర్జున్. 'గుంటూరం కారం'తో మహేశ్ అభిమానులు సైతం మంటెత్తిపోగా, అది చల్లారాలంటే రెండు మూడేళ్ళు పడుతుంది. రాజమౌళి ముస్తాబు అలాంటిది మరి. బాలయ్య–గోపీచంద్ మలినేని చిత్రం ఇంకా సెట్స్ పైనే ఉంది. పవన్ కళ్యాణ్ సరేసరి. రావాల్సిన సినిమాలున్నా ఆయన దృష్టంతా ప్రస్తుతం ఎన్నికల పైనే ఉంది. ఇలా కారణాలేవైనా ఎండాకాలంలో అగ్రహీరోలెవ్వరూ తెరపైకి రావడం లేదన్నది అసలు విషయం.








వాస్తవానికి 2024 సమ్మర్ బరిలో నిలిచేందుకు చాలా సినిమాలు పోటీ పడ్డాయి. అటుపై ఒక్కోటి మెల్లగా జారుకున్నాయి. వాటిలో రామ్ చరణ్ – గేమ్ చేంజర్, ఎన్టీఆర్ – దేవర కూడా ఉన్నాయి. పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానున్న ఈ భారీ చిత్రాలు నిర్మాణాంతర పనుల మూలంగా వేసవి వినోదాలను పంచలేకపోయాయి. 'నా సామిరంగ', 'ఈగల్' చిత్రాలను ఏడాది ఆరంభంలోనే తెరపైకి తీసుకొచ్చిన నాగార్జున, రవితేజ ప్రస్తుతం తర్వాతి చిత్రాల్లో తలమునకలై ఉన్నారు. నాని, వరుణ్ తేజ్, నితిన్ వంటి యువహీరోలు కూడా చిత్రీకరణలకై పరిమితమయ్యారు. సంక్రాంతి నుండి వేసవికి మారిన విజయ్ 'ఫ్యామిలీ స్టార్' ఇటీవల విడుదలైనా కుటుంబ ప్రేక్షకులు సహా ఎవ్వరి పైనా చల్లటి గాలులు కురిపించలేకపోయింది. ఈ దశలో మలయాళ మేఘం నుండి కురిసిన ప్రేమలు, మంజుమ్మల్ బాయ్స్ చిత్రాలు తుంపర్లుగా తెలుగు వారిని తాకాయి.





పరభాష అన్న తేడా లేకుండా తమిళ హీరోలను ఆదరిస్తారు తెలుగు ప్రేక్షకులు. అయితే ఈ ఏడు అక్కడి అనువాద చిత్రాలు కూడా మన వారికి మొహం చాటేసాయి. విశాల్ నటించిన 'రత్నం' మినహా సూర్య 'కంగువ', కమల్ 'ఇండియన్ 2' వంటి చిత్రాల విడుదలకు ఇంకా సమయం ఉందంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. ఈ తరుణంలో అల్లరి నరేశ్ నటించిన 'ఆ ఒక్కటి అడక్కు' (మే3), విశ్వక్‌సేన్ కథానాయకుడిగా తెరకెక్కిన 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' (మే 17) చిత్రాలు కొద్దో గొప్పో బాక్సాఫీస్ వద్ద సందడి చేయనున్నాయి. వీటితో పాటు నారా రోహిత్ 'ప్రతినిధి2', సత్యదేవ్ 'కృష్ణమ్మ' చిత్రాల పైనా కొంత ఆసక్తి ఉంది. ఇలాంటి మధ్యస్త, చిన్న స్థాయి సినిమాలు కథ బలంగా ఉంటే తప్ప అంతగా మెప్పించలేవు.



ఆ క్రమంలో ప్రస్తుతం ఈ లెక్కనంతటినీ సరిచేయ గలిగే సత్తా ఉన్నది కేవలం ప్రభాస్‌కే. నాగ్ అశ్విన్ రూపొందించిన ఈ భారీ చిత్రాన్ని మే 9న విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. అయితే సాంకేతిక పనులు, ఎన్నికల షెడ్యూల్ మూలంగా వాయిదా వేయదలచిన చిత్ర రూపకర్తలు, భారతీయ పురాణాల ఆధారంతో సైన్స్ ఫిక్షన్‌గా నిర్మితమైన 'కల్కి'ని మే నేలాఖరు లేదా జూన్ తొలి వారంలో తెరపైకి తీసుకురానున్నారట. ఇదే జరిగితే ఇన్నాళ్ళు మండుటెండల్లో మగ్గిపోతున్న ప్రేక్షకులకు మంచి మాకటైల్ దొరికనట్టే.



## పుష్ప–2 సరికొత్త రికార్డులు!

'పుష్ప' చిత్రంతో ప్రపంచవ్యాప్తంగా పాపులారిటీని సంపాందించుకున్న కథానాయకుడు అల్లు అర్జున్. ఆ చిత్రంలో అతని నటనకు అందరూ ఫిదా అయిపోయారు. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి ఇప్పుడు 'పుష్ప–2' ది రూల్ పేరుతో సీక్వెల్ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ కథానాయకుడిగా రూపొందుతున్న ఈ చిత్రంపై ఆకాశమే హద్దుగా అంచనాలున్నాయి. అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మాణం జరుపుకుంటున్న ఈ చిత్రం ఉత్తర భారతదేశ థియేట్రికల్ హక్కులు 200 కోట్లకు అమ్మారని తెలిసింది. ప్రముఖ నార్త్ ఇండియా పంపిణీదారుడు అనిల్ తందాని ఈ చిత్రం హక్కులు కొనుగోలు చేశారని సమాచారం. నార్త్ ఇండియాలో ఓ చిత్రానికి ఇదే అత్యంత పెద్ద డీల్‌గా అనుకుంటున్నారు. అంతేకాదు ఈ చిత్రం డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను 275 కోట్లకు నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకుందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇది కూడా ఓ చిత్రం హక్కులను పొందడానికి ఓటీటీ ఫ్లాట్‌ఫామ్ చెల్లించిన అత్యంత భారీ డీల్ అని తెలిసింది.

## జితేందర్ రెడ్డి కోసం మంగ్లీపాట

బాహుబలి, ఎవరికి చెప్పొద్దు చిత్రాలతో నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న రాకేష్ వర్రె కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'జితేందర్ రెడ్డి'.విరించి వర్మ దర్శకుడు. ముదుగంటి రవీందర్ రెడ్డి నిర్మాత. ఈ చిత్రం నుండి గురువారం 'లచ్చిమక్క' అనే పెళ్లి బ్యాక్‌డ్రాప్‌లో కొనసాగే లిరికల్ పాటను విడుదల చేశారు.ఈ పాటను ప్రముఖ గాయని మంగ్లీ ఆలపించారు. దర్శకుడు మాట్లాడుతూ '1980లో జరిగిన వాస్తవిక సంఘటనలు ఆధారంగా పొలిటికల్ డ్రామాగా ఈ చిత్రం తెరకెక్కుతుంది. 1980లో జరిగే కథలా, ఎంతో వాస్తవంగా చిత్రీకరిస్తున్నాం. ప్రతి పాత్ర కూడా ఎంతో సహజంగా వుంటుంది. చిత్రంలో వుండే ట్విస్టులు అందర్ని అలరిస్తాయి అన్నారు. వైశాలిరాజ్, రియా సుమన్, ఛత్రపతి శేఖర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: గోపీ సుందర్, డీఓపీ: జ్ఞానశేఖర్.



వైశాలిరాజ్



## వీర ధీర శూరన్

విలక్షణమైన సినిమాలు, వైవిధ్యమైన పాత్రలలో అలరించే కథానాయకుడు విక్రమ్. ఆయన నటిస్తున్న నూతన చిత్రానికి 'వీర ధీర శూరన్' అనే టైటిల్‌ని నిర్ణయించారు. ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ టీజర్‌ను ఆయన పుట్టినరోజు సందర్భంగా బుధవారం విడుదల చేశారు. ఎస్.జె.సూర్య, దుసరా విజయన్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి ఎస్.యు.అరుణ్ కుమార్ దర్శకుడు. దర్శకుడు మాట్లాడుతూ 'ఈ చిత్రంలో విక్రమ్ పక్కా మాస్ అవతార్‌లో కనిపించబోతున్నాడు. ఇప్పటి వరకు తన కెరీర్‌లో పోషించనటువంటి ఓ వైవిధ్యమైన పాత్రను ఈ చిత్రంలో చేస్తున్నారు. తప్పకుండా ఆయన మాస్ అవతార్ ప్రేక్షకులతో పాటు ఆయన అభిమానులను కూడా మెప్పిస్తుంది' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, సినిమాటోగ్రఫీ: తేని.



## కృష్ణ ఫ్రమ్ బృందావనం ప్రారంభం

ఆది సాయికుమార్ కథానాయకుడిగా నటిస్తున్న నూతన చిత్రం 'కృష్ణ ఫ్రమ్ బృందావనం'. వీరభద్రమ్ చౌదరి దర్శకుడు. తూము నరసింహా, జామి శ్రీనివాసరావు నిర్మాతలు. ఈ చిత్రం పూజా కార్యక్రమాలు గురువారం హైదరాబాద్‌లో జరిగాయి. పూజా కార్యక్రమానికి ప్రముఖ నిర్మాత దిల్ రాజు క్లాప్ నివ్వగా, దర్శకుడు అనిల్ రావిపూడి గౌరవ దర్శకత్వం వహించారు.స్క్రిప్ట్‌ను అందజేస్తూ కెమెరాను సాయికుమార్ సిచ్చాన్ చేశారు. హీరో ఆది మాట్లాడుతూ 'ఇన్ని రోజులకు మంచి కథ కుదిరింది. ఇది మంచి ఎంటర్‌టైన్‌మెంట్ ఇచ్చే సినిమా అవుతుంది. కుటుంబమంతా కలిసి చూసే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. జూన్ నుంచి చిత్రీకరణ ప్రారంభిస్తాం అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ చాలా కాలం విరామం తరువాత చేస్తున్న సినిమా ఇది. మంచి కథ కుదిరింది. ఈ చిత్రం అన్ని వర్గాల వారిని అలరించే విధంగా వుంటుంది' అన్నారు. దిగంగనా సూర్య వంశీ, మురళీధర్ గౌడ్, 30 ఇయర్స్ పృథ్వీ, రఘుబాబు, అవినాష్, రచ్చరవి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్ .



## నభా నటేశ్ వర్సెస్ ప్రియదర్శి

కథానాయిక నభా నటేశ్, నటుడు ప్రియదర్శి (బలగం ఫేమ్) మధ్య సోషల్ మీడియా వేదికగా జరిగిన వాడి వేడి చర్చ వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.. ఇస్మార్ట్ శంకర్ చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న నభా నటేశ్ సోషల్‌మీడియాలో చురుకుగా వుంటారు. ఇటీవల ఆమె 'హాయ్ డార్లింగ్స్ ఎలా వున్నారు' అంటూ ప్రభాస్ చిత్రంలోని డైలాగులతో ట్విట్టర్‌లో సరదాగా ఓ వీడియో పోస్ట్ చేశారు. అది సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ పోస్ట్‌పై నటుడు ప్రియదర్శి స్పందిస్తూ 'వావ్ డార్లింగ్.. కిర్రాక్ వున్నావు' అని రిప్లై ఇచ్చాడు. తనని డార్లింగ్ అని పిలవడంపై నభాకు కోపం వచ్చింది. 'ఐసీసీ సెక్షన్ 354ఎ ప్రకారం పరిచయం లేని అమ్మాయిని తనకు ఇష్టం లేకుండా డార్లింగ్ అని పిలవడం లైంగిక వేదింపులతో సమానం' అని రాసి వున్న ఓ ఇమేజ్‌ను షేర్ చేస్తూ 'మిస్టర్ కామెంట్ చేసే ముందు మాటలు జాగ్రత్త' అని సమాధానం ఇచ్చింది. 'మనకు పరిచయం లేని వ్యక్తులనే విషయం నాకు తెలియదు. మీరైతే డార్లింగ్ అని పిలవొచ్చు మేము అంటే మాత్రం సెక్సన్సా? లైట్ తీసుకో డార్లింగ్ అని ప్రియదర్శి కామెంట్ చేయగా, 'ఆహా హద్దు దాటి ప్రవర్తించకు. చూసుకుందాం ' అని నభా బదులిచ్చారు. నెట్టింట వైరల్‌గా మారిన ఈ వివాదం ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.



## విజువల్ వండర్ 'మిరాయ్'

హనుమాన్ చిత్రం సూపర్ సక్సెస్ సాధించిన తేజా సజ్జా కథానాయకుడిగా రూపొందుతున్న నూతన చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టంనేని దర్శకుడు. టీజీ విశ్వప్రసాద్ నిర్మాత. గురువారం ఈ చిత్రం టైటిల్ గ్లింప్స్‌ను నిర్మాత సురేష్ బాబు విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'మిరాయ్ అనేది అశోకుని కాలంలో రహస్యమైన శాసనం.దాన్ని కొందరు కాపాడుతుంటారు. ఇది సినిమా విడుదలయ్యాక మరింత బాగా అర్థమవుతుంది. ఈ కథ కోసం చాలా నేర్చుకుని సినిమా చేస్తున్నాను. హనుమాన్‌కు ముందే ఈ సినిమా కథను తేజకు చెప్పాను. పదేళ్లుగా తనతో జర్నీ చేస్తున్నా. ఇదొక అద్భుతమైన సినిమాగా వుండబోతుంది అన్నారు. పాన్ వరల్డ్ సినిమాగా ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నామని, ఈ సినిమాకు ఖర్చు పెట్టిన ప్రతి రూపాయి వెండితెరపై కనిపిస్తుంది. విజువల్ వండర్‌గా ఈ సినిమా వుంటుంది అని నిర్మాత తెలిపారు. ఆరు నెలల క్రితమే ఈ చిత్రం మొదలుపెట్టామని, ఈ చిత్రం తన కెరీర్‌లో మరో సంచలన విజయంగా నిలుస్తుందని హీరో తేజ తెలిపారు.



## నగరంలో నేడు...

1. ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క విద్యుత్, తాగు నీరు, ఆర్థికం అంశాలపై మీడియా తో ముఖాముఖి.

సమయం : ఉదయం 11 గంటలకు

వేదిక : బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్

2. హనుమాన్ జయంతి సందర్భంగా సరోజనం ప్రకటించాలని కోరుతూ విశ్వహిందు పరిషత్ మీడియా సమావేశం

సమయం : 11గంటలకు

వేధిక : సోమాజిగూడ ప్రెస్‌క్లబ్



## కన్నారావుపై మరోకేసు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 18 (విజయక్రాంతి) : భూవివాదం కేసులో ఇప్పటికే అరెస్ట్ అయ్యి జైలులో ఉన్న మాజీ సీఎం కేసీఆర్ సొదరుడి కుమారుడు కల్వకుంట్ల తేజేశ్వర్‌రావు అలియాస్ కన్నారావుపై మరో కేసు నమోదైంది. ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఫిర్యాదుతో ఆయనతో పాటు మరో ఐదుగురిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ సమస్య పరిష్కారం కోసం కన్నారావు వద్దకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి విజయవర్ధన్‌రావు వెళ్లాడు. ఈ క్రమంలో కన్నారావు స్నేహితురాలైన నందినితో విజయవర్ధన్‌కు పరిచయం ఏర్పడింది. ఈ పరిచయంతో ఒంటరిగా ఉంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఫ్లాట్‌కు నందిని అప్పుడప్పుడు వచ్చి వెళ్లేది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వద్ద భారీగా నగలు, డబ్బు ఉన్నాయని తెలుసుకున్న నందిని, శ్యామ్‌ప్రసాద్, కన్నారావుతో కలిసి డబ్బు కాజేయాలని ప్లాన్ వేసింది. ఈ క్రమంలో రంగంలోకి దిగిన కన్నారావు.. టాస్క్‌ఫోర్స్ అధికారి భుజంగరావు, ఏసీపీ కట్టా సుబ్బయ్య తమకు క్లోజ్ అంటూ బెదిరింపులకు దిగారు. ఓ గెస్ట్ హౌజ్‌లో నిర్భందించి విజయవర్ధన్‌ను భయభ్రంతులకు గురిచేసి అతని వద్ద ఉన్న రూ. 60 లక్షలు, 97తులాల బంగారం లాక్కున్నారు. ఎవరికైనా చెబితే చంపేస్తామంటూ హెచ్చరించారు. ఈ మధ్యకాలంలో కన్నారావు అరెస్ట్ అయ్యాడనే విషయం తెలుసుకొని, ధైర్యం తెచ్చుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో కన్నారావుతో సహా ఐదుగురిపై కేసు నమోదు చేశారు. అప్పటి ఏసీపీ భుజంగరావు సైతం కన్నారావుకు సహకరించాలని సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై ఒత్తిడి తెచ్చారు. లేకపోతే ఎన్‌కౌంటర్ చేస్తానని భుజంగరావు తనను బెదిరించినట్లు బాధితుడు తెలిపారు. కాగా, గతంలోనూ నందినిపై పలు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

# ఆవిరైన అందాలు





రంగనాయకసాగర్‌లో తగ్గిన నీటి నిల్వలు

- రంగనాయకసాగర్‌లో అడుగంటిన జలాలు
- 3 టీఎంసీలకు గాను ప్రస్తుతం 0.79టీఎంల నీటి నిల్వల
- వృథాగా అతిథిగృహాలు

సిద్దిపేట, ఏప్రిల్ 18 (విజయక్రాంతి) : గత ప్రభుత్వంలో నిండుకుండలా కనిపించిన సిద్దిపేట రంగనాయకసాగర్ రిజర్వాయర్ ప్రస్తుతం నీరులేక భూమి బీటలు వారి కనిపిస్తున్నది. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలోని రంగనాయక సాగర్ అందాలు ఆవిరైపోయాయి. 3 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో సాగు నీటి అవసరాల కోసం 2300ల ఎకరాల విస్తీర్ణంలో రూ. 3,300ల కోట్ల వ్యయంతో నిర్మించి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2020లో ప్రారంభించారు. 1,14000ల ఎకరాల ఆయకట్టుకు నీరందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును నిర్మించారు. సిద్దిపేట జిల్లా పరిధిలోని తిప్పాపూర్, అనంతగిరి వద్దనున్న అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం ఎల్లాయిపల్లి హెడ్‌రెగ్యులేటర్‌కు, అక్కడి నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా, ఆ తర్వాత సొరంగం ద్వారా రంగనాయకసాగర్ సర్జ్‌పూల్(చంద్లాపూర్)కు జలాలు వస్తాయి. చంద్లాపూర్ పంప్‌హౌజ్ నుంచి 490 మీటర్ల ఎత్తులో ఉన్న రంగనాయకసాగర్ జలాశయంలోకి గోదావరి జలాలు చేరుకుంటాయి. ఈ రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లోకి అన్నపూర్ణ రిజర్వాయర్‌లోంచి నీరు రావాల్సి ఉండగా ప్రస్తుతం అన్నపూర్ణ రిజర్వాయర్‌లోనూ నీటి నిల్వలు నామమాత్రంగానే ఉన్నాయి. సిద్దిపేట జిల్లాలోని పలు మండలాలతో పాటు సిరిసిల్ల జిల్లాలోని కొన్ని గ్రామాల పంటపొలాలు ఎండిపోతున్నాయని సాగుజలాలు అందించాలని గతంలో మాజీ మంత్రి హరీశ్‌రావు అధికారులను కోరారు. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి గత ఫిబ్రవరిలో రంగనాయకసాగర్‌లోకి అధికారులు 2.90 టీఎంసీల నీటిని నింపినా, వాటిని పంటపొలాలకు కాలువల ద్వారా విడుదల చేశారు. ప్రస్తుతం రంగనాయకసాగర్‌లో 0.79టీఎంసీల నీరు మాత్రమే ఉన్నది. ఓ వైపు పంటలకు నీరు విడుదల చేయడంతో పాటు మరోవైపు ఎండ తీవ్రతతో నీరు ఆవిరవుతుండడంతో రంగనాయకసాగర్ రాళ్లు తేలి, భూమి బీటలు వారి కనబడుతున్నది. ఒకప్పుడు గొప్ప పిక్నిక్ స్పాట్‌గా అందరికీ పరిచయం అయిన ఈ ప్రాంతం నీరు లేక వెలవెలబోతుంది. గడిచిన రెండుమూడేండ్లలో వానాకాలంతో పాటు మార్చి, ఏప్రిల్‌లోనూ వర్షాలు కురవడం వల్ల రిజర్వాయర్లలో నీటి సమస్యలు తలెత్తలేదు. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో పాటు అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి కూడా రంగనాయకసాగర్‌లోకి నీరు రాకపోవడంతో పూర్తిగా కళ తప్పినట్టయ్యింది. అన్నపూర్ణ రిజర్వాయర్‌లోనూ నీటి నిల్వలు నామమాత్రంగా ఉండడంతో రంగనాయక సాగర్‌లోకి జలాలను విడుదల చేయలేకపోతున్నట్లు అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి. పై ప్రాజెక్టు నుంచి నీళ్లు విడుదల చేయడమా లేదా వర్షాలు కురిస్తేనో గానీ రంగనాయకసాగర్‌కు మళ్లీ జలకళ సంతరించుకునేటట్టు లేదు.

### వృథాగా అతిథి గృహాలు

రంగనాయకసాగర్‌లో నీటి నిల్వలు తగ్గి కళాహీనంగా మారడంతో ఇక్కడి అతిథి గృహాలు వృథాగానే ఉంటున్నాయి. రంగనాయకసాగర్‌లో నీటినిల్వలు పుష్కలంగా ఉన్న సమయంలో ఇక్కడ బోటింగ్ నిర్వహించడంతో పాటు సందర్శకులు ఇక్కడే విడిది చేయడానికి రంగనాయకసాగర్ మధ్యలో ఇరిగేషన్ శాఖ కోట్ల రూపాయల వెచ్చించి అతిథిగృహాలు కూడా నిర్మించింది. ప్రస్తుతం ఇవన్నీ వృథాగా ఉండిపోయాయి. నీటి నిల్వలు లేకపోవడంతో దూరప్రాంత ప్రజలే కాకుండా పరిసరప్రాంతాల ప్రజలు కూడా ప్రాజెక్టును సందర్శించడానికి రావడం లేదు.



# కమాన్‌ల పునరుద్ధరణకు ప్రతిపాదనలు

- హెరిటేజ్ వాక్‌లో కమిషనర్ రోనాల్డ్ రోస్



హెరిటేజ్ వాక్‌లో పాల్గొన్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 18 (విజయక్రాంతి) : హైదరాబాద్ మహానగరంలో చారిత్రక వారసత్వ సంపదను పరిరక్షించుకోవడానికి మోజంజాహి మార్కెట్, మౌలాలి కామన్, క్లాక్ టవర్ భవనాలను రూ. 18.33 కోట్ల వ్యయంతో పునఃనిర్మాణం, సుందరీకరణ పనులు పూర్తి చేసినట్టు జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ తెలిపారు. చార్మినార్ చుట్టూ ఉన్న ఆరు కమాన్లను పునఃనిర్మాణ పనులకు ప్రతిపాదనలు చేసినట్టు ఆయన తెలిపారు. ప్రపంప వారసత్వ దినోత్సవం పురస్కరించుకొని జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో దారుల్ షిఫా నుంచి ఉస్మానియా దవాఖాన వరకు గురువారం హెరిటేజ్ వాక్ జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ హైదరాబాద్ మహానగరంలోని వారసత్వ సంపదను భావితరాలకు అందించాలనే సంకల్పంతో ప్రత్యక చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. అందులో భాగంగానే చార్మినార్ పెడెస్ట్రెయిన్ ప్రాజెక్టు అభివృద్ధి చేశామన్నారు. నగరంలోని ముర్గీ చౌక్, సర్దార్ మహల్ పనులు కూడా చేపట్టి పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. రాణిగంజ్ కమాన్, షేక్ ఫెయిజ్ కమాన్, బజార్ కమాన్, దీవాన్ డేవడి కమాన్, దబీర్‌పూర్ కమాన్, హుస్సేన్ ఆలం కమాన్‌లను అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. 1908లో వచ్చిన మూసీ వరదల సందర్భంగా నగరంలో చేపట్టిన అభివృద్ధిని స్ఫూర్తిగా తీసుకుని ఈ వాక్‌ను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు కోట శ్రీవాత్సవ, చంద్రకాంత్‌రెడ్డి, జోనల్ కమిషనర్లు రవికిరణ్, స్నేహ శబరిష్, అభిలాష అభినవ్ పంకజ, వెంకన్న, సీఎంఓహెచ్ డాక్టర్ పద్మజ, చీఫ్ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ అబ్దుల్ వాకిల్, చీఫ్ ఎంటమాలజిస్ట్ డాక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

### రెస్టారెంట్లు, హోటళ్లపై దాడులు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 18(విజయక్రాంతి): రాష్ట్ర ఫుడ్ సెఫ్టీ అధికారుల ఆదేశాల మేరకు నగరంలో పలు హోటళ్లు, రెస్టారెంట్లపై జీహెచ్‌ఎంసీ ఫుడ్ సెఫ్టీ అధికారులు గురువారం దాడులు చేశారు. సోమాజిగూడ నాగర్జున సర్కిల్ షాన్‌భాగ్ డీలక్స్ హోటల్, బంజారాహిల్స్ రోడ్ నంబరు 3లోని అట్లూరి ప్రైవేట్ లిమిటెడ్ చట్నీస్ కాఫీ హౌజ్ అండ్ వెజ్ రెస్టారెంట్, జూబ్లీహిల్స్ గౌరంగ్ డిజైన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లలో తనిఖీ చేశారు. గడువు ముగిసినట్టుగా గుర్తించిన ఆహార పదార్థాలను ఫుడ్ లాబరేటరీలో పరీక్షలు జరిపేందుకు శాంపిల్స్ సేకరించారు. అట్లూరి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన చట్నీస్ కాఫీ అండ్ వెజ్ రెస్టారెంట్‌లో రూ. 25వేల అన్‌లేబుల్, మిస్‌బ్రాండెడ్‌గా భావించిన 40కిలోల కాజు ప్యాకెట్‌లను సీజ్ చేసి, నోటీసులు జారీ చేశారు.

# ఎర్లీ బర్డ్ టార్గెట్ రూ. 800 కోట్లు

- 18 రోజుల్లో రూ. 310 కోట్లు వసూలు
- 5 శాతం రాయితీతో ఈనెల 30వరకు గడువు



హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 12 (విజయక్రాంతి) : బల్దియాలో ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు కొన్నేళ్లుగా ఎర్లీ బర్డ్ పథకాన్ని అమలు చేస్తున్నారు. ప్రతి ఆర్థిక సంవత్సరం చివరి నాటికి చెల్లించాల్సిన ఆస్తి పన్నును, ఈ ఏడాది ప్రారంభంలోనే చెల్లింపుదారుల నుంచి జీహెచ్‌ఎంసీ వసూలు చేస్తోంది. ట్యాక్స్ ముందస్తుగా చెల్లించిన వారికి ఆస్తి పన్నులో 5శాతం రాయితీ సౌకర్యాన్ని కల్పిస్తోంది. ఎర్లీబర్డ్ ద్వారా గతేడాది రూ. 700కోట్లు వసూలయ్యాయి. వీటి ద్వారా జీహెచ్‌ఎంసీ పాలక మండలి నిర్వహణ, ఉద్యోగుల, పెన్షనర్ల వేతనాలు, పలు అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయిస్తున్నారు. ఈ స్కీం బల్దియాకు ఆర్థిక కష్టాలను గట్టెక్కించేందుకు ఊరటనిస్తుండటంతో ఈ ఏడాది కూడా ఎర్లీ బర్డ్ ద్వారా ఆస్తిపన్ను వసూలు చేయాలని బల్దియా భావించింది. ఈ నెల 30వరకూ 5శాతం రాయితీ సదుపాయంతో జీహెచ్‌ఎంసీ గడువును విధించింది.

**ఈ ఏడాది రూ. 800 కోట్ల టార్గెట్**

గ్రేటర్ హైదరాబాద్‌లో దాదాపు 19లక్షల నిర్మాణదారుల నుంచి ఆస్తిపన్ను వసూలు అవుతోంది. గతేడాది 2022–23లో మొత్తం ఆస్తిపన్ను రూ. 1660.38కోట్లను వసూలు చేసింది. 2023–24 ఏడాది లో రూ. 2100కోట్ల వసూలును టార్గెట్ పెట్టుకోగా, రూ. 1947.87కోట్లు వసూలయ్యాయి. జీహెచ్ఎంసీ ఇప్పటి దాకా వసూలైన ఆస్తిపన్ను వసూళ్లలో ఇది రికార్డ్. అంతే కాకుండా, ఈ మొత్తం 2022–23లో వసూలైన రూ. 1660కోట్ల కంటే రూ. 254.49కోట్లు అదనం. 2023–24 ఆర్థిక ఏడాది ప్రారంభం (ఏప్రిల్ నెల)లోనే ఎర్లీ బర్డ్ ద్వారా రూ. 700కోట్లు వసూలు చేయగా, ఒక్క మార్చి నెలలోనే రూ. 500కోట్లు వసలు చేశారు. ఆర్థిక సంవత్సరం ఆఖరి రోజు 2024 మార్చి 31న రూ. 123కోట్లు కలెక్షన్ అయ్యాయి. వన్‌టైం సెటిల్మెంట్ ద్వారా మరో రూ. 319.59కోట్లు వసూలు అయ్యాయి. ఇదిలా ఉండగా, 2024–25సంవత్సరానికి రూ. 2500కోట్లను ఆస్తి పన్ను వసూలు చేయాలని జీహెచ్‌ఎంసీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మొత్తంలో కేవలం ఎర్లీబర్డ్ స్కీం ద్వారానే చెల్లింపుదారుల నుంచి ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే రూ. 800కోట్లు వసూళ్లు చేయాలని నిర్ధేశించుకుంది.

**18 రోజుల్లో రూ. 310 కోట్లు వసూలు**

బల్దియాలో ప్రతి ఏడాది 5శాతం రాయితీతో అమలు చేస్తున్న ఎర్లీబర్డ్ పథకంతో ఆశించిన ఫలితాలు వస్తున్నట్టుగా జీహెచ్ఎంసీ భావిస్తోంది. దీంతో ఎర్లీ బర్డ్ పథకాన్ని ఈ ఆర్థిక సంవత్సరం కూడా అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా గతేడాది ఎర్లీ బర్డ్ ద్వారా వసూలైన రూ. 700కోట్ల కంటే మరో రూ. 100కోట్లను అదనంగా చేర్చి మొత్తం రూ. 800కోట్లను వసూలు చేయాలని లక్ష్యంగా ఎంచుకున్నారు. దీంతో 2024–25 ఆర్థిక ఏడాది ప్రారంభమైన ఏప్రిల్ 1నుంచి 30వరకూ ఎర్లీబర్డ్ ద్వారా 5శాతం రాయితీ సదుపాయంతో ఆస్తిపన్ను సేకరిస్తున్నారు. ఇప్పటి వరకూ 18రోజుల్లో మొత్తం రూ. 3120కోట్లు ఆస్తిపన్ను వసూలైనట్టు అధికారులు చెబుతున్నారు. ఈసారి ఏప్రిల్ మాసంలో అత్యధిక ప్రభుత్వ సెలవులు రావడంతో ఈ పథకం ద్వారా నిర్దేశించిన లక్ష్యాన్ని జీహెచ్‌ఎంసీ చేరుతుందా లేదో చూడాల్సి ఉంది. ఇప్పటికే రూ. 310కోట్లు వసూలు చేసిన జీహెచ్‌ఎంసీకి మిగతా రూ. 490కోట్లు వసూలు చేయడానికి ఇంకా 11రోజుల గడువు మాత్రమే ఉంది. ఈ 11రోజుల్లోనూ 4సెలవులు ఉన్నాయి. దీంతో ఈ ఏడాది ఎర్లీ బర్డ్ టార్గెట్‌ను బల్దియా రీచ్ అవుతోందా లేదా చూడాల్సి ఉంది. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని 5శాతం పన్ను రాయితీని చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ కోరుతోంది.

# 25 నుంచి సమ్మర్ క్యాంపు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 18 (విజయక్రాంతి) : హైదరాబాద్ మహానగరంలో ఈ నెల 25నుంచి మే 30వరకు స్పోర్ట్స్ సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. ఈ మేరకు అన్ని జోన్లలో తగిన ఏర్పాట్లను పూర్తి చేయాలని జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, హార్టికల్చర్, గేమ్స్ విభాగం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మే 6న అమీర్‌పేట్ ప్లే గ్రౌండ్, 7న గౌలిపురా ప్లే గ్రౌండ్, 8న సికింద్రాబాద్ స్విమ్మింగ్ పూల్, 9న చందానగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, 10న ఉప్పల్ స్టేడియంలో స్పోర్ట్స్‌లో క్విజ్ తదితర పోటీలు ఉంటాయన్నారు. మే 11న అమీర్‌పేట ప్లే గ్రౌండ్‌లో ఫైనల్ పోటీలు ఉంటాయన్నారు. మే 15నుంచి 19 వరకు బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, క్రికెట్, చెస్, క్యారమ్స్, పుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హాకీ, కబాడీ, రోలర్ స్కేటింగ్, సెపక్‌టక్రా, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, టెన్నీకాయిట్, వాలీబాల్ తదితర గేమ్స్‌లలో ఇంటర్, ఎస్సెస్సీ సెంటర్ టోర్నమెంట్స్ జరుగుతాయన్నారు. స్పోర్ట్స్ సమ్మర్ క్యాంపులో శిక్షణ పొందే వారికి, కోచ్‌లకు కావాల్సిన సౌకర్యాలను కల్పించాలని జోనల్ కమిషనర్లకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.







# అడుగంటిన నాగార్జునసాగర్

- 508 అడుగులకు పడిపోయిన నీటిమట్టం
- ఎమర్జెన్సీ పంపింగ్‌ను ప్రారంభించిన అధికారులు
- 2017 నాటి పరిస్థితులు పునరావృతం



హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 18(విజయక్రాంతి): వేసవి నేపథ్యంలో నగరంలో తాగునీటి డిమాండ్ పెరుగుతోంది. కానీ జలాశయాల్లో నీటి మట్టాలు అడుగంటుతున్నాయి. ముఖ్యంగా నాగార్జునసాగర్‌లో నీటిమట్టాలు రోజురోజుకు దిగజారుతున్నాయి. నగర ప్రజలకు ప్రధాన తాగునీటి వనరు అయిన సాగర్ డెడ్ స్టోరేజీకి చేరింది. అయితే సమీప కాలంలో వర్షాలు పడకపోతే పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే జలమండలి అధికారులు ప్రత్యామ్నయ ఏర్పాట్లపైనా దృష్టి సారించారు. ఇప్పటికే సాగర్‌లో అధికారులు అత్యవసర పంపింగ్‌ను ప్రారంభించారు.

**గతేడాదితో పోలిస్తే...**

మహానగరానికి నాగార్జునసాగర్ నుంచే ఎక్కువగా మంచినీటి సరఫరా జరుగుతుంది. కొన్నేళ్లుగా ఎలాంటి సమస్య లేకపోయినా ప్రస్తుతం 2017 నాటి పరిస్థితులను పునరావృతం చేస్తోంది. సాగర్ జలాశయం గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 508 అడుగులకు తగ్గింది. నిత్యం 577 మిలియన్ గ్యాలన్స్ ఫర్ డే(ఎంజీడీలు)ను జలమండలి సరఫరా చేస్తుంది. ఇందులో అత్యధికంగా 276 ఎంజీడీల సరఫరాను సాగర్ నుంచి తీసుకొస్తున్నారు. ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా స్థిరమైన నీటి సరఫరాకు వాటర్ బోర్డు చర్యలు చేపట్టింది. నాగార్జునసాగర్ నుంచి నీటిని వెలికితీసేందుకు ఈ నెల 15 ఎమర్జెన్సీ పంపింగ్‌ను చేపట్టింది. ఎల్లంపల్లి (గోదావరి) నుంచి ఇప్పటికే ఎమర్జెన్సీ పంపింగ్‌ను ప్రారంభించిన సంగతి తెలిసిందే.

**కృష్ణా నుంచే అధికం..**

జీహెచ్‌ఎంసీలోని అత్యధిక ప్రాంతాలకు కృష్ణా జలాల నుంచే అధిక వాటా వస్తోంది. సాగర్ సమీపంలోని ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు నుంచి పుట్టంగండి పంప్‌హౌజ్, అక్కడ నుంచి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారానే నీటిని సేకరిస్తున్నారు. ప్రస్తుతం సాగర్‌లో నీటి మట్టం 510 అడుగుల కంటే తక్కువగా ఉండటంతో అక్కంపల్లి రిజర్వాయర్‌లోకి గ్రావిటీ ద్వారా నీళ్లు తరలించే పరిస్థితి ఉండదు. దీంతో సాగర్ నుంచి హైదరాబాద్‌కు అత్యధిక వాటాను సాగర్ నుంచి ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా సరఫరా చేస్తుండటం గమనార్హం. గత 7 సంవత్సరాల కిందట ఎమర్జెన్సీ పంపింగ్‌ను చేపట్టగా మళ్లీ ప్రస్తుతం ఆ పరిస్థితులు ఏర్పడ్డాయి.

**డివిజన్ల వారీగా సరఫరా..**

హైదరాబాద్ వాటర్‌బోర్డు పరిధిలో ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్‌కు సంబంధించి 25 డివిజన్లు ఉన్నాయి. నిత్యం ఈ డివిజన్లకు 577 ఎంజీడీల నీరు సరఫరా అవుతోంది. సాగర్ నుంచి 276 ఎంజీడీలు, మిగతా నీటిని ఇతర జలాశయాల సరఫరా చేస్తున్నారు.

### తాగునీటి కొరతపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రవ్యాప్తంగా రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఫలితంగా పలు ప్రాంతాల్లో చెరువులు, జలశయాల్లోని నీటి మట్టాలు తగ్గిపోతున్నాయి. భూగర్భ జలాలు కూడా అడుగంటుతున్నాయి. దీంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించారు. ముఖ్యంగా తాగునీటికి ఎటువంటి ఇబ్బంది రాకుండా ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ కూడా ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా ఎప్పటికప్పుడు ఈ అంశంపై సమీక్షలు సమావేశాలు, నిర్వహించి నీటి ఎద్దడి నివారణకు అధికారులు తీసుకుంటున్న చర్యలను ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్షలు సమావేశాలు నిర్వహించి తదనుగుణంగా ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఉన్నతాధికారులు సైతం క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నారు. స్థానిక రిజర్వాయర్లలో నీటి మట్టం ఎన్ని రోజులకు సరిపడా ఉంది? అన్ని ఇంటెక్ వెల్ వద్ద మోటార్లు నడుస్తున్నాయా? అనే వివరాలను మిషన్ భగీరథ అధికారులను అడిగి తెలుసుకుంటున్నారు. అత్యవసర పరిస్థితి ఉంటే ప్రత్యామ్నాయ మార్గాలైన బోరు మోటార్ల ద్వారా సరఫరా చేసేలా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. మిషన్ భగీరథ అధికారులు అందుబాటులోని జలశయాల్లో నీటిని క్రమం తప్పకుండా పంపింగ్ చేయడంపై దృష్టి సారిస్తున్నారు. తాగునీటి సరఫరాలో ఏ ఒక్క హాబిటేషన్ ఎల్లో, ఆరెంజ్ లేదా రెడ్ కేటగిరిలో ఉండకుండా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి ఇంటికి 100 శాతం తాగునీరు అందించడమే మిషన్ భగీరథ లక్ష్యంగా అధికారులు పని చేస్తున్నారు. ఎక్కడైనా చిన్న సమస్య వచ్చి ఒక రోజు నీటి సరఫరాలో ఇబ్బందులు వస్తే ప్రజల ఆందోళనకు గురికాకుండా వెంటనే ప్రత్యామ్నాయ మార్గం ద్వారా నీటిని అందించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అంతేకాకుండా క్షేత్రస్థాయిలో పరిష్కారం కాని సమస్యలను కలెక్టర్ల దృష్టికి తీసుకువెళుతున్నారు.

# సీతక్క పేరిట అక్రమ వసూళ్లు

### మంత్రికి బహిరంగ లేఖ రాసిన ఎమ్మెల్యే పాల్వాయి



మంత్రి సీతక్కకు రాసిన లేఖను మీడియాకు చూపుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కుమ్రంభీం ఆసిఫాబాద్, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): మంత్రి సీతక్క పేరు చెప్పి కాంగ్రెస్ నాయకులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అరోపించారు. గురువారం కాగజ్‌నగర్‌లో ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. పట్టణంలోని స్త్రీ వైద్య నిపుణురాలిని బెదిరించి రూ.10 లక్షలు ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేసినట్టు ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు కోనేరు కోనప్ప, రావి శ్రీనివాస్‌పై విచారణకు అదేశించాలని డిమాండ్ చేశారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న నాయకులపై చర్యలు తీసుకోవాలని సీతక్కకు బహిరంగ లేఖ రాశారు. సమావేశంలో బీజేపీ నాయకులు వెంకటేశ్, అసెంబ్లీ కన్వీనర్ వీరభద్ర, ఆరుణ్ లోయ, సింధం శ్రీనివాస్, విశ్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ, బీఆర్‌ఎస్‌లను చిత్తుగా ఓడించాలి

### రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



కామారెడ్డి సమావేశంలో మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

కామారెడ్డి, ఏప్రిల్ 18 (విజయక్రాంతి) : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను చిత్తుగా ఓడించాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ప్రజలకు పిలుపునిచ్చారు. కామారెడ్డిలో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. జహీరాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఇంటింటి ప్రచారం చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సందర్భంగా వివిధ మండలాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, నాయకులు పండ్ల రాజు, ఆనంద్‌రావు, రాజాగౌడ్, మోహన్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, భీంరెడ్డి, నర్సింహులు, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# నేడు పాలమూరుకు సీఎం రేవంత్‌రెడ్డి

### వంశీచంద్ రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి హాజరు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం మహబూబ్‌నగర్ రానున్నారని ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి గురువారం తెలిపారు. మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా వంశీచంద్ రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో సీఎం పాల్గొంటారని చెప్పారు. ఉమ్మడి పాలమూరు పరిధిలోని రెండు పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు.

# ఏనుమాములలో సిండికేటు

- తూతూమంత్రంగా జెండా పాట
- వ్యాపారులు చెప్పిందే ఫైనల్ 'రేటు'
- అడుగడుగునా దగా పడుతున్న మిర్చి రైతులు
- పట్టించుకోని అధికారులు

ఏనుమాముల మార్కెట్‌లో వ్యాపారుల సిండి'కేటు' వ్యాపారం యథేచ్ఛగా సాగుతున్నది. సుమారు 700 మంది వ్యాపారులంతా ఒక్కటై రైతు కష్టాన్ని దోచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తూతు మంత్రంగా జెండా పాట నిర్వహించి, నాణ్యమైన పంటకు వంకలు చూపి ధర తగ్గించి ఇస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వరంగల్ ఏనుమాముల మార్కెట్‌కు వచ్చిన మిర్చిబస్తాలు(ఫైల్)

వరంగల్, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): గతేడాది మార్కెట్‌లో మిర్చికి మంచి ధర పలకడంతో రైతులు ఈఏడాది గతంలో కంటే ఎక్కువ విస్తీర్ణంలో పంటను పండించారు. దిగుబడి బాగానే వచ్చినప్పటికీ మార్కెట్ ధరలు అంతంతమాత్రంగా ఉండడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. వరంగల్ శివారులోని ఎనుమాముల మార్కెట్‌లోనూ ఇదే దుస్థితి నెలకొన్నది. మార్కెట్‌కు ఉమ్మడి జిల్లా వరంగల్ జిల్లాతో పాటు పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి కూడా మిర్చి తరలివస్తుంది. తదుపరి రోజు ఉదయం 7:30 నుంచి 8 గంటలలోపే జెండా పాట ముగుస్తుంది. మార్కెట్ అధికారుల సమక్షంలో వ్యాపారులు ఒక కూటును ఎంచుకుని 'ధర' నిర్ణయిస్తారు. ఆ తర్వాత నిర్ణయించిన ధర ప్రకారం క్రయ విక్రయాలు ప్రారంభమవుతాయి. నిబంధనల ప్రకారం వ్యాపారులు పంట నాణ్యతను బట్టి ధర నిర్ణయించాల్సి ఉండగా, ఒకటి రెండు కూటులు చూసి ధర నిర్ణయిస్తుండడం, ఆ తర్వా వంకలు చూపి ధర తగ్గిస్తుండడం గమనార్హం. ఉదాహరణకు తేజా మిర్చి ధర క్వింటా రూ.19 వేలకు జెండా పాట పూర్తయితే పలికితే, వ్యాపారులు ఏదో వంక చెప్తూ క్వింటా మిర్చికి రూ.12 వేలు చెల్లిస్తున్నారని ఆరోపిన్నారు.

### విధి లేక విక్రయం..

విధి లేని పరిస్థితుల్లో వ్యాపారులు చెప్పిన రేటుకు రైతులు విక్రయిస్తున్నారు. అప్పులు తెచ్చి పెట్టుబడి పెడితే తీరా పంట చేతికొచ్చాక ధరలు పడిపోయాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్ ధరల ప్రకారం పెట్టిన పెట్టుబడి కూడా చేతికొచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలీల కొరత కారణంగా ఎక్కువ సొమ్ము వెచ్చించి మిర్చి తీయించామని, పంట ను విక్రయిస్తే వచ్చే సొమ్ము దానికి సరిపోవట్లేదని వాపోతున్నారు.

### దడవాయిల దోపిడీ...

మిర్చికి ధర నిర్ణయించిన తర్వాత ఖరీదుదారులు పంటను పరిశీలించే క్రమంలో బస్తాలు కోసి కొంత మిర్చిని బయటకు తీస్తారు. ఈ లోపు కాంటాకు కొంత సమయం పడుతుండటంతో దడవాయిలు బస్తాల్లోని మిర్చిని మాయం చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

### విధి లేక పంట అమ్ముతున్నం..



పోయిన సంవత్సరం మిర్చికి మంచి ధర ఉండడంతో నేను మిర్చి సాగు చేసిన. గతేడాది మిర్చి ఒక క్వింటాకు రూ.21 వేల ధర పలికింది. ఇప్పుడు క్వింటా కేవలం రూ.10 వేలు మాత్రమే పలుకుతున్నది. పంట దిగుబడి మంచిగ రావాలని లక్షల రూపాయిలు పెట్టుబడి పెట్టిన. తీరా పంట చేతికొచ్చాక మార్కెట్‌లో ధరలు పడిపోయాయి. కోల్డ్‌స్టోరేజీలో పంటలను దాచుకుందామన్నా, అవి ఖాళీగా లేవంటున్నారు. **– పెండ్లి సంజీవయ్య, రైతు, పోచారం**

### రైతులను దోచుకుంటున్నారు..



సేట్లు రైతులను దోచుకుంటున్నరు. నిరుటికి ఈ ఏడాది ధరలో చాలా తేడా ఉంది. నాడు తాలుకాయకు పెట్టిన ధర కూడా ఇప్పుడు మేలు కాయలకు పెడుతలేరు. బస్తాలు కోసినప్పుడు దడ్వాయిలు కిలోల కొద్దీ సరుకు తీసుకుంటున్నారు. ఇదేమిటంటే గొడవకు దిగుతున్నారు. రైతుల బాధలు ఎవరు పట్టించుకుంటలేరు. **– ముంద్రాతి సదానందం, రైతు, పులుకుర్తి**


# హనుమాన్ భక్తుల ఆందోళన

జగిత్యాల, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): హనుమాన్ భక్తుడిని అవమానించేలా దూషించాడని ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం జిల్లా కేంద్రంలోని ఓ షోరూం ఎదుట జగిత్యాల–కరీంనగర్ ప్రధాన రహదారిపై హనుమాన్ మాలదారులు, వీహెచ్‌పీ నాయకులు బైటాయించారు. సమాచారం తెలుసుకున్న పట్టణ సీఐ వేణుగోపాల్, ఎస్సై నరేశ్ ఘటన స్థలానికి చేరుకున్నారు. నవీన్ అనే ఉద్యోగి హనుమాన్ దీక్షతీసుకొని కార్యాలయానికి రావడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ మేనేజర్ సురేశ్ అసభ్య పదజాలంతో దూషించి, ఉద్యోగం నుంచి తొలగించడంతో వివాదం మొదలైంది. జాతీయ రహదారిపై ఆందోళన కారులు బైఠాయించడంతో రెండు గంటలు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. మేనేజర్‌తో క్షమాపణ చెప్పించి తిరిగి నవీన్‌ను విధుల్లోకి తీసుకోవడంతో హనుమాన్ భక్తులు శాంతించారు.



### కాంగ్రెస్‌లో చేరికలు

సదాశివనగర్ మండలంలోని కుప్రియల్‌కు చెందిన పలు పార్టీల నాయకులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో రాజయ్య, సుధాకర్ రెడ్డి, హరినారయణ్, రాజు తదితరులు పాల్గొన్నారు. –కామారెడ్డి



సమావేశంలో పాల్గొన్న జేఏసీ నాయకులు

# వస్త్ర పరిశ్రమ సమస్యలను పరిష్కరించాలి

### 22న జేఏసీ ఆధ్వర్యంలో దీక్ష

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఐకాస నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సిరిసిల్లలో జేఏసీ సమావేశం నిర్వహించారు. కన్వీనర్ మూశం రమేశ్ మాట్లాడుతూ.. వస్త్ర పరిశ్రమలో సంక్షోభంతో 3 నెలల నుంచి కార్మికులు ఉపాధి కోల్పోయారని చెప్పారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయడంతో.. వారం రోజుల్లో సమస్యలు తీరుస్తామని మంత్రి పొన్నం హామీ ఇచ్చారన్నారు. నేటికీ అమలు చేయలేదని చెప్పారు. ప్రభు త్వం హామీలను వెంటనే అమలు చేయా లని డిమాండ్‌చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 22న దీక్ష చేపట్టనున్నట్టు ప్రకటించారు. నాయకులు రవీందర్, రవి, సత్యం, దామోదర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ రైల్వే స్టేషన్ ఆవరణలో మంటలు

వరంగల్ తూర్పు, ఏప్రిల్ 18 : వరంగల్ రైల్వేస్టేషన్ ఆవరణలో గురువారం సాయంత్రం మంట లు చెలరేగాయి. గూడ్స్ షెడ్ లోకి ప్రవేశించే ప్రధాన మార్గానికి ఆనుకుని ఉన్న టేకు వనంలో ఒక్కసారిగా మంటలు వచ్చాయి. గమనించిన సిబ్బంది అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అంది ంచారు. అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశా రు. ఘటనా స్థలానికి సమీపంలోనే తాత్కాలిక బస్టాండ్, కొద్ది దూరంలో ఉత్తర తెలంగాణకు సంబంధించిన పెట్రోల్ సరఫరా కేంద్రం ఉండడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మంటలు చెలరేగిన ఘటనపై రైల్వే అధికారులు విచారణకు ఆదేశించారు.

# వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. బిజినేపల్లి మండలం పాలెం గ్రామ పరిధిలోజరిగిన ప్రమాదంలో మహబూబ్‌నగర్ వీరన్నపేటకు చెందిన బద్రినాథ్ (40) దుర్మరణం చెందాడు. ముందు వెళ్తున్న ఖానాపూర్ గ్రామానికి చెందిన శ్రీశైలం ఒక్కసారిగా యూటర్న్ తీసుకోవడంతో బద్రినాథ్ బైక్ అదుపుతప్పి ఢీకొంది. తలకు బలమైన గాయాలు కావడంతో బద్రినాథ్ అక్కడికక్కడే మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం పెద్దకార్పాముల శివారులో జరిగిన మరో ఘటనలో ముందుగా వెళ్తున్న ఆటోను కోళ్ల వ్యాన్ వెనకనుండి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో పెద్దకార్పాములకు చెందిన ఆటోడ్రైవర్ గువ్వల నర్సయ్య (28) మృతిచెందాడు.

# కీచక ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 18 (విజయక్రాంతి) : విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయుడు దారితప్పాడు. ఓ మానసిక దివ్యాంగురాలిపై అత్యాచారయత్నానికి ప్రయత్నించాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లిలో గురువారం వెలుగుచూసింది. సీఐ కనకయ్య వివరాల ప్రకారం.. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు మాసయ్య తాను నివాసం ఉంటున్న కాలనీకి చెందిన 19 ఏళ్ల మానసిన దివ్యాంగురాలితో అసభ్యంగా ప్రవర్తించాడు. వరుసగా 3 రోజులపాటు ఇలా జరగడంతో యువతి ప్రవర్తనలో మార్పు వచ్చింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆరాతీయగా విషయం బయటపడింది. దీంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మాసయ్య గతంలో నూ యువతులు, తోటి ఉపాధ్యాయినిలతో అసభ్యంగా ప్రవర్తించేవాడని ప్రచారం జరుగుతోంది.

# నోరు అదుపులో ఉంచుకోండి

- కోమటిరెడ్డి బ్రదర్స్‌కు మాజీ మంత్రి జగదీశ్ హితవు
- 20 వేల కోట్లతో బీజేపీని మోసం చేసిన నాయకుడు ఒకరు
- కాంగ్రెస్‌లో ఉండి బీజేపీకి ఓటెయ్యాలని చెప్పింది మరొకరు



నల్లగొండలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

నల్లగొండ, ఏప్రిల్ 18(విజయక్రాంతి): కోమటిరెడ్డి బ్రదర్స్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని, నోరు అదుపులో పెట్టుకోవాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి హితవు పలికారు. ఇటీవల కేసీఆర్, జగదీశ్‌రెడ్డిపై కోమటిరెడ్డి ఆరోపణలు చేసిన నేపథ్యంలో నల్లగొండలో జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కోమటిరెడ్డి బ్రదర్స్‌లో ఒకరు పదవి కాపాడుకోవడానికి, మరొకరు మంత్రి పదవి కోసం పాకులాడుతున్నారని విమర్శించారు. కేసీఆర్‌ను ఎవరు ఎక్కువ తిడితే వారికి పదవులు దక్కుతయని వారుభావిస్తున్నారని అన్నారు. రాజకీయాలను వ్యాపారమయంగా చేశారని ఆరోపించారు. దళారుల్లాగా పార్టీలకు అమ్ముడుపోయి కేసీఆర్‌పై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రచార కమిటీ కన్వీనర్‌గా ఉంటూ బీజేపీకి ఓటు వేసి, తమ్ముడిని గెలిపించాలని కోరిన వెంకట్‌రెడ్డి.. కేసీఆర్ కాలుగోటికి కూడా సరిపోడు అని దుయ్యబట్టారు. కేసీఆర్ విజ్ఞతతో సరళమైన పదాలతో మాట్లాడుతున్నారని స్పష్టంచేశారు. కేసీఆర్‌తో పొల్చుకున్నప్పుడు సీఎం రేవంత్ రెడ్డి వందశాతం లిల్లిపుట్ అని ఉద్ఘాటించారు. ప్రజలపై కేసీఆర్‌కు ఉండే నిబద్ధత, తపన ప్రజలపై ఉన్న అభిమానం కాంగ్రెస్ వారికి లేదని చెప్పారు. కేసీఆర్ ఒక వైట్ పేపర్ లాంటి వారని స్పష్టంచేశారు. రాహుల్ గాంధీ మోదీ ప్రభుత్వాన్ని విమర్శిస్తే .. రేవంత్ బడేభాయ్ అంటూ పొగుడుతున్నాడని విమర్శించారు. రాహుల్‌ను అరెస్టు చేసే సమయంలో కూడా ముఖ్యమంత్రి రేవంత్ మోదీని ఒక్కసారి కూడా విమర్శించలేదని గుర్తుచేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జైలుకు వెళ్లడం తప్పు కాదని, జగదీశ్‌రెడ్డికి జైళ్లు కొత్తేమీ కాదని చెప్పారు. వ్యాపారాల కోసం బ్యాంకుల నుంచి కోట్లు తీసుకొని ఎగవేసిన వారు కచ్చితంగా జైలుకు వెళ్తారని అన్నారు. రూ.20 వేల కోట్లు తీసుకొని ఒకరు ఒక పార్టీని మోసం చేశారని, వారికి త్వరలో ప్రజలే సరైన బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. రాజకీయాలతో నల్లగొండ నీరు అమ్మి, ప్రజల రక్తం తాగి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వేసిన భిక్షతో బతికిన నాయకులు అంటూ కోమటిరెడ్డి బ్రదర్స్‌పై విరుచుకుపడ్డారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు సంధినేని జనార్దన్ రావు పార్థీవ దేహనికి జగదీశ్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

# హామీలు నెరవేర్చాలని పోస్టుకార్డు ఉద్యమం



ముఖ్యమంత్రికి రాసిన పోస్టుకార్డులతో కిష్టంపేట రైతులు

మంచిర్యాల, ఏప్రిల్ 18(విజయక్రాంతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చాలని కోరుతూ చెన్నూర్ నియోజకవర్గంలోని రైతులు గురువారం పోస్టుకార్డు ఉద్యమానికి తెరలేపారు. అధికారంలోకి రాగానే రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చుతానని చెప్పి ఇంతవరకు ఆ ఊసే ఎత్తడం లేదని, ముఖ్యమంత్రికి గుర్తు చేయాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టామని చెన్నూర్ మండలంలోని కిష్టంపేట రైతులు తెలిపారు. వరి ధాన్యానికి బోనస్, రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు, రైతు రుణమాఫీ తదితర హామీలను అమలు చేయాలని కోరారు. అలాగే నీరు లేక ఎండిపోయిన పంటలకు నష్టపరిహారంగా ఎకరాకు రూ. 25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

# పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

కామారెడ్డి, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌళిక వసతులు కల్పించి ఆదర్శంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ జితేష్ వీ పాటిల్ అధికారులకు సూచించారు. కామారెడ్డి జిల్లా గాందారి మండలంలోని పోతంగల్ అమ్మ ఆదర్శ పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని చెప్పారు. ఇంజినీరింగ్ అధికారులు నిధుల అంచనా వేసి పనులు పూర్తి చేయాలని వివరించారు. పాఠశాల ఆవరణలోని నాలుగు మరుగుదొడ్లకు మరమ్మతులు చేయడంతో పాటు కొత్తగా రెండు మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో రాజ్‌కిరణ్, హెచ్ఎం రంగారావు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.









# రోడ్డు విస్తరణ జరిగేనా?

## అప్రోచ్ రోడ్డు లేక వాహనదారుల ఇబ్బందులు

- ఇరుకు రోడ్డు గుండానే భారీవాహనాల ప్రయాణం
- గుంతలమయంగా మారిన గుండి రోడ్డు
- ఇరువైపుల రోడ్డును విస్తరించాలని డిమాండ్


కుమ్రంభీం ఆసిఫాబాద్, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి అనుకొని నేషనల్ హైవే రోడ్డును ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోకి ప్రవేశించేందుకు మాత్రం అప్రోచ్ రోడ్డు వేయక పోవడంతో వాహనదారులు హైవే వైపు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఉన్న రోడ్డు గుండా మంచిర్యాల వైపు వెళ్లాలంటే రోడ్డు క్రాస్ చేయాల్సిన పరిస్థితి ఉండేది. దీంతో వాహనాలు హైవేపైన రోడ్డు క్రాస్ చేసే సమయంలో రోడ్డు ప్రమాదాలు జరుగుతుండటంతో పోలీసులు, సంబంధిత అధికారులు యూ టర్న్ మూసివేశారు. గుండి రోడ్డు మార్గం గుండా వెళ్లే ఫ్లై ఓవర్ క్రింది నుంచి మంచిర్యాల వైపుగా వెళ్లేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. హైవేకు వెళ్లేందుకు రోడ్డు వెడల్పు లేక పోవడంతోపాటు మూలమలుపు వద్ద ఇరుకుగా ఉండటం ఇబ్బందికరంగా మారింది. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే రోడ్డు వెడల్పు పనులు ప్రారంభించాలని ప్రజలు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.



ఆసిఫాబాద్‌లోని ఓ మూలమలుపు వద్ద ప్రమాదకరంగా విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్

### మార్కింగ్ చేసి మర్చిపోయారు

ఆసిఫాబాద్ జిల్లాగా ఏర్పాటైన తరువాత రోజురోజుకు జిల్లా కేంద్రంలో రద్దీ పెరుగుతున్నది. గతంలో ఇక్కడ అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహించిన వరుణ్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిని 132 ఫీట్లకు పెంచేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులు రోడ్డుకు ఇరువైపుల మార్కింగ్ చేశారు. మార్కింగ్ చేసి రెండేండ్లు గడుస్తున్నా రోడ్డు వెడల్పు పనులు ప్రారంభానికి నోచుకోలేదు. పాత అటవీశాఖ చెక్‌పోస్టు నుంచి జన్కాపూర్ మీదుగా అదిలాబాద్ క్రాస్ రోడ్డు వరకు రోడ్డు విస్తరణ చేయాలని నిర్ణయించారు. గతంలో జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనుల కోసం



కుమ్రంభీం ఆసిఫాబాద్

తీర్మానాలు చేయడం తప్ప పనులకు కార్యరూపం దాల్చడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుత ఎమ్మెల్యే కోవ లక్ష్మి నివాసం నుంచి కుమ్రంభీం చౌక్ వరకు మాత్రమే డివైడర్లను ఏర్పాటు చేశారు. ఇంకా రెండు కిలో మీటర్ల వరకు డివైడర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నది. గుండి మార్గం గుండా ప్రస్తుతం హైవే వైపు వాహనాలను మళ్లించారు. కానీ, రోడ్డు పనులు చేపట్టకపోవడంతో వాహనదారులు, కాలనీ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

### ఒత్తిళ్లతో అభివృద్ధికి అటంకం

జిల్లా కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు చేపడితే.. కొన్ని చోట్ల భవనాలను కుల్చాల్సి ఉంది. దీంతో పెద్ద వ్యాపారులు రాజకీయ నాయకుల వద్దకు వెళ్లి రోడ్డు విస్తరణ పనులు జరుగకుండా ఒత్తిళ్లు తీసుకొస్తున్నట్టు సమాచారం. అభివృద్ధి జరగాలంటే కొంత నష్టం జరుగుకతప్పదు అన్న విషయం అందరికి తెలిసిందే. ప్రస్తుతం ఉన్న భవనాలు సైతం ఏజెన్సీ పరిధిలోకి వస్తాయి. అధికారులకు సర్వాధికారాలు ఉన్నప్పటికి రోడ్డు విస్తరణపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

**రోడ్డు విస్తరణ చేపట్టాలి**

నేషనల్ హైవేకు వెళ్లేందుకు అప్రోచ్ రోడ్డును ఏర్పాటు చేయాలి. ప్రసుత్తం గుండి రోడ్డు గుండా భారీ వాహనాలు వెళ్తుండటంతో దుమ్ము ధూళీతో ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు వెడల్పు పనులు చేపట్టడంతో పాటు యూనియన్ బ్యాంక్ ఎదురుగా ఉన్న మూలమలుపును పెంచాలి. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు చేపట్టాలి.

**– దుర్గం దినకర్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, కుమ్రం భీం ఆసిఫాబాద్**



### ఏబీవీపీ X ఎస్ఎఫ్ఐ

- హెచ్‌సీయూలో విద్యార్థి సంఘాల ఘర్షణ

హైదరాబాద్, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ (హెచ్‌సీయూ)లో విద్యార్థి సంఘాల మధ్య ఘర్షణ చోటుచేసుకున్నది. ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ విద్యార్థి సంఘాల నేతలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులకు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విద్యార్థులకు సర్దిచెప్పారు. కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. ఇదిలా ఉంటే వరుసగా విద్యార్థులపై ఏబీవీపీ దాడులు చేస్తూ క్యాంపస్‌లో విధ్వంసం సృష్టిస్తున్నారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు ఆర్ ఎల్.మూర్తి, టి.నాగరాజు గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. విద్యార్థినులనూ చూడకుండా దాడులు చేశారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులను ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు.

# నగల కోసమే గొంతు కోసి హత్య

- ఆర్మూర్ గృహిణి హత్య కేసు ఛేదన
- పోలీసుల అదుపులో పాత నేరస్థుడు
- వివరాలు వెల్లడించిన నిజామాబాద్ సీపీ

నిజామాబాద్, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): ఆర్మూర్ పట్టణంలో గత నెలలో జరిగిన గృహిణీ దారుణ హత్య కేసును పోలీసులు చేధించారు. నగల కోసమే మహిళను ఓ పాత నేరస్థుడు దారుణంగా హత్య చేసినట్టు గుర్తించారు. నిజామాబాద్ పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ సింగేనవార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సంతోష్‌నగర్ కాలోనిలో గత నెల 23న రాసూరి లాస్య(22) అనే మహిళ దారుణ హత్యకు గురయ్యింది, గుర్తుతెలియని వ్యక్తులు కొడవలితో మహిళ గొంతు కోసి హత్యచేసి, ఆమె ఒంటిపై ఉన్న బంగారు, వెండి నగలు అపహరించారు. కేసును చాలెంజ్‌గా తీసుకున్న నిజామాబాద్ పోలీసు కమిషనర్ విచారణ వేగిరం చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి, సీఐ రవికుమార్ సీసీ కెమెరా ఫుటేజ్ సహాయంతో కేసును ఛేదించారు. నిందితుడిని పాత నేరస్థుడు అల్లెపు మల్లయ్యగా గుర్తించారు. నిందితుడిని నిజామాబాద్ నగరంలోని నాగారంలో బీడీ వర్కర్స్ కాలోనిలో గురువారం ఉదయం అరెస్ట్ చేశారు. అతనిపై మూడు హత్యకేసులు, 11 దోపిడీ కేసులు ఉన్నాయని సీపీ తెలిపారు. గతంలో ఇతను లాస్య ఇంట్లో అద్దెకు ఉండేవాడని, ఆమెతో పరిచయం కారణంగా అప్పుడప్పుడు ఇంటికి వచ్చేవాడని వెల్లడించారు. ఈ క్రమంలో లాస్య నగలపై దృష్టిపడిన నిందితుడు.. మార్చి 23న మధ్యాహ్న సమయంలో లాస్య ఇంటికి వచ్చాడు. కొడవలితో లాస్యపై దాడిచేసి గొంతు కోశాడు. ఆమె మెడలో ఉన్న 20 గ్రాముల పుస్తెలతాడు, 5 గ్రాముల బంగారు చైను, 71.5 గ్రాముల వెండి పట్టగొలుసులు అపహరించాడు. నిందితుడి నుంచి నగలు, హత్యకు వినియోగించిన కొడవలిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హత్య కేసు విచారణంలో కీలకంగా వ్యవహరించిన ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి, ఇన్స్‌పెక్టర్ వీ రవికుమార్, ఎర్గట్ల ఎస్సై మచ్చేందర్‌రెడ్డి, పోలీసు సిబ్బందిని సీపీ అభినందించి, రివార్డు ప్రకటించారు.



మృతదేహాన్ని వెలికి తీయిస్తున్న పోలీసులు

# వివాదంగా మారిన బాలుడి మృతి

- పోస్టుమార్టం కోసం మృతదేహం వెలికితీత
- కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఘటన

కుమ్రంభీం ఆసిఫాబాద్, ఏప్రిల్18 (విజయక్రాంతి) : కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం పాసిగామలో మూడేళ్ల క్రితం మరణించిన బాలుడి మృతదేహాన్ని పోలీసులు గురువారం వెలికితీయడం చర్చనీయాంశంగా మారింది.

మృతుడి కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెబ్బెన మండలంలోని నంబలా గ్రామానికి చెందిన మల్లీశ్వరి, శ్రీనివాస్ దంపతుల పెద్ద కుమారుడు రిషి(11)కి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో పాసిగాంలోని భీమ్‌రావ్ బాబా ఆశ్రమంలో వైద్యం కోసం ఉంచారు. బాబా పూజలు నిర్వహిస్తూ, నూనెతో మర్ధన చేస్తూ బాలుడికి వైద్యం జరిపేవాడు. కొంతకాలానికి తన కుమారుడిని చూపించమని బాలుడి తల్లి బాబాను అడగగా చూపించకుండా మాయ మాటలు చెప్పేవాడు. ఈ క్రమంలోనే బాలుడి తల్లిని లోబర్చుకోవాలన్న ఆలోచనతో ఆమెకు ఫోన్ చేసి వేధింపులకు పాల్పడ్డాడు. అంతేకాకుండా బాలుడిని చిత్రహింసలకు గురి చేసేవాడు. ఈ విషయాన్ని మల్లీశ్వరి తన భర్త శ్రీనివాస్‌కు చెప్పినప్పటికీ వినకుండా కుమారుడిని అక్కడే ఉంచి వైద్యం అందించాడు. ఈ క్రమంలోనే బాలుడి ఆరోగ్యం క్షీణించి మృతిచెందాడు. అయితే ఈ విషయాన్ని భీమ్‌రావు బాబా బాలుడి తండ్రికి తెలియజేశాడు. విషయం బయటకు పొక్కితే తన ఆశ్రమానికి ఎవరూ రారనే ఉద్దేశంతో మృతదేహాన్ని ఆశ్రమం వెనుక పాతిపెట్టాడు. ఆ తర్వాత బాలుడి తల్లి ఎన్నిసార్లు తన కుమారుడిని చూపించమన్నా చూపించేవాడు కాదు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. మృతదేహాన్ని పాతపెట్టినట్లుగా బాబా నేరం ఒప్పుకున్నాడు. తహసీల్దార్, ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించగా అస్థిపంజరం బయటపడింది. పోస్ట్ మార్టం చేయించి బాబాతో పాటు బాలుడి తండ్రిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరచనున్నట్లు వెల్లడించారు. డీఎస్పీ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

# సరిహద్దులో టెన్షన్.. టెన్షన్

- కలవరపరుస్తున్న వరుస ఎదురుకాల్పులు
- తాజాగా 'కాంకేర్'లో పెద్ద ఎన్‌కౌంటర్
- ఘటనకు వ్యతిరేకంగా వెలిసిన మావోయిస్టు పోస్టర్లు
- మరోవైపు దండకారణ్యాన్ని జల్లెడ పడుతున్న జవాన్లు
- ఎప్పుడు జరుగుతుందోనని ప్రజల్లో ఆందోళన

ఖమ్మం, ఏప్రిల్ 18 (విజయ క్రాంతి): చత్తీస్‌గఢ్ దండకారణ్యంలో యుద్ధమేఘాలు అలుముకున్నాయి. పార్లమెంట్ ఎన్నికల వరుసగా ఎన్‌కౌంటర్లు చోటుచేసుకోవడం, పదుల సంఖ్యలో మావోయిస్టులు మృతిచెందడం ఏజెన్సీవాసులను కలవరపెడుతున్నది. మావోయిస్టులు ప్రతికార చర్యల్లో భాగంగా ఎలాంటి విధ్వంసాలకు పాల్పడురోనని ఆదివాసీలు భీతిల్లుతున్నారు. మావోయిస్టు కేంద్ర కమిటీ ఎలా స్పందిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య వారు నలిగిపోతున్నారు. ఇదే భయానక వాతావరణం భద్రాద్రి జిల్లాలోని రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లోనూ నెలకొన్నది. తాజాగా ఈనెల 16న బస్తర్ ప్రాంతంలోని కాంకేర్ జిల్లాలో భద్రతా బలగాలు జరిపిన ఎన్‌కౌంటర్‌లో 29 మంది మావోయిస్టులు మృతిచెందారు. ఘటనలో శంకర్రావు అనే కీలక నేత కూడా మృత్యువాత పడ్డాడు.

ఈ ఘటన తర్వాత కూడా భద్రతా బలగాలు మావోయిస్టుల కోసం దండకారణ్యాన్ని జల్లెడ పడుతున్నాయి. ఇలా గడిచిన ఆరునెలల్లో భద్రతా బలగాలు 80 మంది మావోయిస్టులు కన్నుమూశారు. ఇలాంటి నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికలు నిర్వహించడం అక్కడ ప్రభుత్వానికి పెద్ద సవాలు అనే చెప్పాలి.

### మావోయిస్టు బ్యానర్ల కలకలం..

బస్తర్ ఎన్‌కౌంటర్‌పై నారాయణపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్‌కు వ్యతిరేకంగా బ్యానర్లు వెలిశాయి. లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించాలని మావోయిస్టులు బ్యానర్లలో ఆదివాసీలకు పిలుపునిచ్చారు. బ్యానర్లలో పలువురు రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులను టార్గెట్ చేశారని అక్కడి పోలీస్ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే పోలీస్ ఉన్నతాధికారులు జవాన్లతో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించారు. మావోయిస్టులు ఏర్పాటు చేసిన బ్యానర్లను తొలగించారు. మరోవైపు మావోయిస్టు కదలికలపై కేంద్రం సీరియస్‌గా ఉన్నది. మావోయిస్టులు లేని భారత్‌ను చూడడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఇటీవల కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సైతం ప్రకటించారు.








# మేఘారెడ్డి X చిన్నారెడ్డి

- వనపర్తి 'కాంగ్రెస్'లో కుంపటి
- పార్టీ నేతల మధ్య భగ్గుమంటున్న విభేదాలు
- పార్టీలో బీఆర్ఎస్ నాయకుల చేరికపై చిన్నారెడ్డి వర్గం అభ్యంతరం
- చేర్చుకోవద్దంటూ ఎమ్మెల్యే ఇంటి ఎదుట కాంగ్రెస్ మండల అధ్యక్షుడి ఆత్మహత్యాయత్నం

వనపర్తి, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): 'వనపర్తి' కాంగ్రెస్ పార్టీలో రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోన్నది. అసెంబ్లీ ఎన్నికల ముందు నుంచే చిన్నారెడ్డి, మేఘారెడ్డి మధ్య విభేదాలు ఉన్నాయి. అవి రోజురోజుకూ పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. ఎప్పటికప్పుడు ఒకరిపై ఒకరు పరోక్షంగా విమర్శలు చేసుకుంటూ అభాసుపాలవుతున్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న విషయమై రెండు వర్గాల మధ్య విభేదాలు తలెత్తుతున్నాయి. ఇదే విషయమై గత నెల 2న ఎమ్మెల్యే మేఘారెడ్డికి తెలియకుండా ఇతర పార్టీలకు చెందిన నాయకులను కాంగ్రెస్‌లోకి ఎలా చేర్చుకుంటారంటూ ఆయన వర్గీయులు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై మండిపడ్డారు. మర్నాడు చిన్నారెడ్డి వర్గీయులు విలేకర్ల సమావేశం పెట్టి ఎమ్మెల్యేపై పలు అంశాలపై విమర్శించారు. ఇవి చల్లారక ముందే తాజాగా గురువారం మరో ఘటన చోటుచేసుకున్నది. గోపాల్‌పేట మండలానికి చెందిన ఇద్దరు బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే విషయమై ఎమ్మెల్యేతో సంప్రదింపులు జరిపారు. ఈ విషయం తెలుసు



చిన్నారెడ్డి వర్గీయుడు గుంప్రాతి గణేష్ గౌడ్

కున్న చిన్నారెడ్డి వర్గీయుడు, కాంగ్రెస్ పార్టీ గోపాల్‌పేట మండల అధ్యక్షుడు గుంప్రాతి గణేష్ గౌడ్ తన అనుచరులతో కలిసి సరాసరి ఎమ్మెల్యే ఇంటికి వెళ్లాడు. బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దని ఆందోళన చేపట్టారు. ఒకదశలో గణేష్ గౌడ్ తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని అంటించుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఎమ్మెల్యే మేఘారెడ్డి, మరోనేత చిన్నారెడ్డి వర్గీయుల మధ్య తోపులాట జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు కలుగజేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకుని వచ్చారు. ఇది ఇలా ఉంటే చిన్నారెడ్డి వర్గీయులు ఎమ్మెల్యే మేఘారెడ్డిపై దాడి చేసేందుకే ఆయన ఇంటికి వెళ్లారని ఎమ్మెల్యే వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆత్మహత్యాయత్న ఘటనపై వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లును వివరణ కోరగా.. ఎమ్మెల్యే మేఘారెడ్డి పీఏ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# 'బండి'ని ఓడించేందుకు బీఆర్ఎస్, పొన్నం కుమ్మక్కు

- బీజేపీ నేతలు ఎస్ కుమార్, సంగప్ప, గుగ్గిళ్ల

కరీంనగర్, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌ని ఓడించేందుకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బీఆర్ఎస్‌తో కుమ్మక్కు అవుతున్నారని బీజేపీ నేతలు ఎస్ కుమార్, గుగ్గిళ్ల రమేశ్, జే సంగప్ప ఆరోపించారు. కరీంనగర్‌లోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నేతలు చేతలో అధికారం ఉంది కదా అని అడ్డగోలుగా మాట్లాడుతున్నాని మండిపడ్డారు. బీజేపీకి లిక్కర్ స్కాం నిందితుడు వ్యాపారవేత్త శరత్ చంద్రారెడ్డి రూ.500 కోట్ల విలువైన ఎలక్ట్రోరల్ బాండ్స్ ఇవ్వగానే బెయిల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ కుమార్, సంగప్ప

వచ్చిందని మంత్రి పొన్నం వ్యాఖ్యలు చేయడం కేవలం అవివేకమని అభిప్రాయపడ్డారు. ఎలక్ట్రోరల్ బాండ్స్‌కు, బెయిల్‌కు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా తమ పార్టీ అభ్యర్థి బండి సంజయ్ భారీ మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు కుమ్మరి శంకర్, కరండ్ల మధుకర్, రమణారెడ్డి, అజయ్‌వర్మ పాల్గొన్నారు.

# పార్టీ మారిన నేతలే దిక్కా!

(మొదటి పేజీ తరువాయి)

అన్న తేడా లేకుండా ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికే టికెట్లు ఇచ్చారు. ఐదేండ్ల పాటు ప్రజలను పరిపాలించే నేతలుగా.. ఒక పార్టీ.. ఒక సిద్ధాంతం అంటూ లేకుండా కేవలం పార్టీ మారడం.. టికెట్లు తెచ్చుకోవడం.. లేదా ముందే టికెట్టుపై హామీ తీసుకుని పార్టీ మారడం.. ఆఖరికి రాత్రిపూట పార్టీ మారి.. తెల్లవారిసరికల్లా టికెట్టు సంపాదించుకుంటున్న నేతలు ఉండటం గమనార్హం. ఆదిలాబాద్ మొదలుకుని.. నాగర్‌కర్నూల్ వరకు.. ఖమ్మం నుంచి మెదక్ వరకు పరిశీలిస్తే ఇదే అర్థమవుతుంది. ఆదిలాబాద్‌లో బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ మొదట్లో టీడీపీ, తరువాత బీఆర్ఎస్‌లో చేరారు. అక్కడ కూడా పదవులు అనుభవించి.. తాజాగా బీజేపీలో చేరి టికెట్టు పట్టారు. ఇక బీఆర్ఎస్ నుంచి బరిలో ఉన్న ఆత్రం సక్కు మొదట్లో కాంగ్రెస్‌లో ఎమ్మెల్యేగా ఉంటూ.. బీఆర్ఎస్‌లో చేరారు. ఇప్పుడు బీఆర్ఎస్ ఎంపీగా పోటీలో ఉన్నారు.

### వరంగల్ రసవత్తరం..

మొన్నటి వరకు రసవత్తరంగా కొనసాగిన వరంగల్ అభ్యర్థుల ఎంపికను చూసినా ఇదే అవగతం అవుతోంది. మొన్నటి వరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగిన అరూరి రమేశ్ చివరి క్షణంలో బీజేపీలో చేరి టికెట్టును తెచ్చుకున్నారు. అలాగే సీనియర్ నాయకుడు కడియం శ్రీహరి టీడీపీ నుంచి రాజకీయ ప్రస్తానం మొదలుపెట్టి.. బీఆర్ఎస్‌లో చేరారు. డిప్యూటీ సీఎంగా పదవులను అనుభవించారు. తన కూతురు కావ్యకు ఎంపీ టిక్కెట్టు కావాలని పట్టుబట్టి సాధించుకున్నారు. చివరకు అధికార కాంగ్రెస్ పార్టీలో చేసి అక్కడ కావ్యకు ఎంపీ టిక్కెట్ దక్కించుకున్నారు. జహీరాబాద్‌లో ఎంపీగా కొనసాగుతున్న బీఆర్ఎస్ నేత బీబీ పాటిల్.. ఒక రోజు ముందు బీజేపీలో చేరి తెల్లవారేసరికల్లా టికెట్టు దక్కించుకున్నారు. నల్లగొండలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూ ఓడిపోయిన సైదిరెడ్డి.. పార్టీ మారిన వెంటనే బీజేపీ నుంచి లోక్‌సభ అభ్యర్థిగా బరిలో నిలిచారు. గతంలో టీడీపీలో ఉంటూ బీఆర్ఎస్‌లోకి మారిన కృష్ణారెడ్డికి బీఆర్ఎస్ టిక్కెట్టు ఇచ్చింది. నాగర్‌కర్నూల్‌లో చూసుకుంటే మొన్నటి వరకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకుని ఎంపీగా బరిలో దిగారు. బీఆర్ఎస్ జడ్పీటీసీగా ఉన్న భరత్.. ఆయన తండ్రి ప్రస్తుత ఎంపీ రాములుతో కలిసి బీజేపీలో చేరి ఎంపీ టిక్కెట్టును చేజిక్కించుకున్నారు. ఇలా ఎక్కడ చూసినా.. పార్టీ మారిన వారికే టిక్కెట్లు ఇస్తున్నారు. ఇలా రాష్ట్రంలోని అత్యధిక నియోజకవర్గాల్లో పార్టీలు మారిన నేతలకే టిక్కెట్లు రావడం గమనార్హం.

**కొంతలో కొంత..**

పార్టీలు మారడం అనే అంశాన్నే పరిగణలోకి తీసుకుంటే.. గంజాయి వనంలో తులసి మొక్కల్లా చెప్పుకోదగిన రాజకీయ నేతలు కూడా ఉండటం కొంతలో కొంత నయం అనే భావాన్ని కల్గిస్తున్నది. ఒకే పార్టీలో ఉంటూ సిద్ధాంతాలకు కట్టుబడి ఓడినా.. గెలిచినా అదే పార్టీలో కొందరు నేతలు కొనసాగుతుండటాన్ని మాత్రం ప్రజలు గమనిస్తున్నారు. ఇలాంటి వారు ఒకసారి ఓడిపోవచ్చు.. కానీ ఆ నేతల విలువలకు మాత్రం ఎప్పటికైనా గుర్తింపు ఉంటుందని రాజకీయ విశ్లేషకులు సైతం కితాబిస్తున్నారు. అలాంటి వారిలో బీజేపీ నుంచి కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ధర్మపురి అర్వింద్ లాంటినేతలను చెప్పవచ్చు. కాంగ్రెస్ విషయానికి వస్తే సురేశ్ షెట్కార్, వంశీచంద్, మల్లురవి, బలరాం నాయక్, టీ జీవన్‌రెడ్డి మొదటి నుంచి అదే పార్టీ తరఫున బరిలో నిలుస్తున్నారు. బీఆర్ఎస్‌లో కొప్పుల ఈశ్వర్ (పార్టీ పెట్టినప్పటి నుంచి), బీ వినోద్‌కుమార్, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, పద్మారావుగౌడ్ గులాబీ సిద్ధాంతానికే కట్టుబడి ఉంటూ వస్తున్నారు. ఏదేమైనా ఎన్నికలు వస్తున్నాయంటేనే.. కప్పలతో పోటీ పడుతూ పార్టీలు మారుతున్న నేటి కాలంలో ఒకే పార్టీలో కొనసాగడం గొప్ప విషయమనే చెప్పాలి.





కావాలని ఆరోగ్యాన్ని పాడు చేసుకోవాలని ఎవరమూ అనుకోం. కానీ, అసలు వాస్తవాలు వేరే వున్నాయి. చాలావరకు మార్కెట్లలో లభ్యమయ్యే కూరగాయలు, పండ్లు చూడటానికి ఎంతో తాజాగానే కనిపిస్తాయి. దేశీయ ఉత్పత్తులకు తోడు సంకర, విదేశీ జాతులు. ఆకుకూరలు సైతం వెంటనే వండుకోవాలన్నంతగా మురిపిస్తాయి. ఒక దశలో అసలు సహజమైన వాటిని సైతం 'ఇవి' మించి పోతున్నాయంటే ఆశ్చర్యమే మరి.

వికృత దుష్ఫలితాలతో విజృంభిస్తున్న పెస్టిసైడ్స్

'డర్టీ ఫుడ్' మాయలో జనం అయోమయం

బెంబేలెత్తిస్తున్న బెండకాయలు

మొదటి స్థానంలో స్ట్రాబెర్రీ, రెండోస్థానంలో పాలకూర

పదేండ్లుగా యాపిళ్లలో తీపి శూన్యం

*సాగు సమయంలో పురుగుమందుల (పెస్టిసైడ్స్) బారిన పడని పంట, అలాగే వాటి అవశేషాలుగల పండ్లు, కూరగాయాలను (ఎంతో కొంతమేర, ఏదోలా) తినని మనిషి భూమ్మీద ప్రస్తుతానికి లేనట్టేనని పలు శాస్త్రీయ అధ్యయనాలు నిర్ధారిస్తున్నాయి. ఇవాళ పరిస్థితి ఎక్కడిదాకా వచ్చిందంటే, కూరగాయలు, పండ్లనుండి తృణధాన్యాలు, తిండిగింజల వరకు ఏదైనా రసాయన రహితమంటే నిజంగానే నమ్మబుద్ధి కావడం లేదు. అంటే, దాదాపు అందరమూ అంతగా 'డర్టీ ఫుడ్' మార్కెట్ మాయాజాలంలో నిండా మునిగిపోయాం. కాకపోతే, 'ఒకరు తక్కువ, మరొకరు ఎక్కువ' అంతే. పూర్తి సేంద్రియ విధానంలో పండిన ఆహార ఉత్పత్తులు ఎక్కడైనా, ఎవరికైనా లభ్యమైతే వారికంటే అదృష్టవంతులు మరొకరు వుండరు. కానీ, ఒకవైపు పెరుగుతున్న జనాభా అవసరాలు, మరోవైపు శ్రుతి మించుతున్న వ్యాపారకాంక్షలు సామాన్యులకు ఇప్పట్లో ఈ సేంద్రియ భాగ్యాన్ని కలిగిస్తాయా అంటే, అనుమానమే. ఇంతటి దుస్థితిలో ఏమిటి మన కర్తవ్యం?*

హైదరాబాద్, ఏప్రిల్ 18 (విజయక్రాంతి) : తృణధాన్యాలు, తిండిగింజల విషయం కాసేపు పక్కనపెట్టి, పండ్లు, కూరగాయలను మాత్రమే ఇప్పుడు పరిశీలిస్తే, అవి ఎంత తాజాగా కనిపించినా నిజంగానే తినడానికే కాదు, కొనడానికి కూడా భయపడవలసి వస్తున్నది. ఎందులో ఎంత శాతం 'పెస్టిసైడ్స్' (పురుగు మందుల రసాయనాలు) అవశేషాలు వున్నాయో దేవుడికే తెలియాలి. పొరపాటున తెలుసుకొనే ప్రయత్నం చేస్తే మాత్రం వాటిని ముట్టడానికే మనకు చేతులు రావుకాక రావు. కంటికి ఆనకుండా మనం తిన్న ఆహార పదార్థాలలో నిక్షిప్తమై వున్న ఆ పురుగుమందుల రసాయనాలు కడుపులోకి వెళ్లి ఏం చేస్తాయో వేరే చెప్పాలా!

హరిత విప్లవం పేరిట అధిక దిగుబడి కోసం ఎప్పుడైతే పరుగు మొదలైందో అప్పుడే మనం తినే ఆహారగింజలు, కాయలు, పండ్ల ఉత్పత్తులు కలుషితమవడం మొదలైంది. సాగులో వినియోగించే ఎరువులనుంచి పురుగుమందుల వరకు ప్రతిదీ రసాయనాల రూపుదాల్చిన దుష్ఫలిత విశ్వరూపం మామూలుది కాదు. తమ చేతులతో పిచికారి చేసే రైతు కార్మికులు, పర్యవసానాలలో పనులు చేసుకుంటున్న వారి నుంచి తత్ సంబంధ ఆహారం తినే ప్రతీ ఒక్కరి ఒంట్లోకి అవశేషాలు ప్రవేశించి దీర్ఘకాలం పాటు తిష్ట వేస్తాయని నిపుణులు చాలాకాలంగా హెచ్చరిస్తున్నారు. ఈ బృహత్ దృశ్యం ఎంత భయానకమో తెలిస్తే ఒళ్లు జలదరిస్తుంది.

కావాలని ఆరోగ్యాన్ని పాడు చేసుకోవాలని ఎవరమూ అనుకోం. కానీ, అసలు వాస్తవాలు వేరే వున్నాయి. చాలావరకు మార్కెట్లలో లభ్యమయ్యే కూరగాయలు, పండ్లు చూడటానికి ఎంతో తాజాగానే కనిపిస్తాయి. దేశీయ ఉత్పత్తులకు తోడు సంకర, విదేశీ జాతులు. ఆకుకూరలు సైతం వెంటనే వండుకోవాలన్నంతగా మురిపిస్తాయి. ఒక దశలో అసలు సహజమైన వాటిని సైతం 'ఇవి' మించి పోతున్నాయంటే ఆశ్చర్యమే మరి. ఏ కూరగాయనైనా, మరే పండునైనా ఎట్టి పరిస్థితుల్లో తొక్కలతో తినకూడదని, బాగా కడిగి వాడుకుంటేనే (కొంతలో కొంతయినా) ఆరోగ్యానికి మంచిదని శాస్త్రవేత్తలు చాలాకాలంగా సలహాలైతే ఇస్తున్నారు. వాటిని పాటిస్తున్న వారు ఎందరు? దాదాపు అందరం సాధ్యమైనంతలో అందుబాటులో వున్నవాటినే, శుచి శుభ్రతతో కూడినవే, ఏరి కోరి ఎంచుకొని, కడిగి మరీ తింటుంటాం. అయినా, వాటిలోని అవశేషాలు పూర్తిగా పోవడం లేదని, వాటి వాడకాన్ని నిషేధించడం తప్ప మరో మార్గమే వద్దని నిపుణులు సూచిస్తున్నారు. పంటలకు పట్టిన తెగుళ్లను చంపబోయి మనల్ని మనమే చంపేసుకుంటున్నామా అంటే అవుననే అనవలసి వస్తుంది. మనం కూచున్న కొమ్మను మనమే పనికట్టుకొని, విధిలేక నరుక్కుంటున్న చందం ఇది. పెస్టిసైడ్స్ అస్సలుకే వాడకుండా పంటలు పండించలేమా? అంటే అదేం లేదు, నిక్షేపంగా పండించుకోవచ్చు. కానీ, అంత ఓపిక, సౌకర్యాలు, పరిస్థితులకు రైతులు దూరమై చాలాకాలమే గడుస్తున్నది.

పూర్తిగా ఏది ప్రకృతి సిద్ధం? ఏది రసాయన మిళితమో తెలియని గందరగోళ పరిస్థితి. కంటికి కనిపించని విషాణువులు తొడిమెలు, తొక్కలనుండి గుజ్జు, రసాల వరకూ సర్వత్రా (ఎంతో కొంత) వ్యాపించి వుంటున్నట్టు అనేక ప్రామాణిక పరిశోధనల్లో తేటతెల్లమైంది. ప్రజలు ఎక్కువగా వాడుతున్న పాలకూర, బెండకాయ పంటలు అత్యధికంగా పెస్టిసైడ్స్ బారిన పడుతున్నట్టు పరిశోధకులు చెబుతున్నారు.

**– దోర్బల బాలశేఖరశర్మ**

## బాబోయ్ బెండకాయలు!

**బెం**డకాయ పంటలపై పురుగుమందుల వాడకం అత్యధిక స్థాయిలో జరుగుతున్నట్టు ఇటీవలి పరిశోధనల్లో వెల్లడైంది. సుమారు పద్దెనిమిది రకాల పెస్టిసైడ్స్ అవశేషాలు అంతర్జాతీయ స్థాయిలో వివిధ బెండకాయల నమూనాల్లో బయటపడ్డట్టు చెబుతున్నారు. తెగుళ్ల నివారణకు అధిక దిగుబడి లక్ష్యంగాగల ఆయా ప్రాంతాల రైతులు రకరకాల పెస్టిసైడ్స్‌ను చల్లుతున్నట్టు వ్యవసాయ పరిశోధకులు గుర్తించారు. బెండపంటపై ప్రధానంగా ఆర్గనో క్లోరిన్, ఆర్గనోఫాస్ఫేట్, కార్బమేట్, పైరెథ్రాయిడ్, నియో–నికోటినాయిడ్ పురుగు మందు గ్రూపులను వాడుతున్నట్టు వారు తెలిపారు. బెండకాయను పొట్టు తీసి వండే అవకాశమే లేదు. కనీసం కడగడం కూడా సాధ్యపడదు. వాటిని నీళ్లలో వేస్తే జిగటగా మారుతుంది. ఒక వస్త్రంతో తుడిచి, తరిగి పొయ్యిమీద వేయడమే చాలామంది చేస్తారు. ఫ్రై (వేపుడు కూర) అనగానే మొట్టమొదట గుర్తొచ్చేది బెండకాయనే.

### సహజ రుచులు కనుమరుగు

లేత బెండకాయలు వండాక వచ్చే కమ్మటి వాసన ఎలా వుంటుందో ప్రస్తుతం అరవై ఏళ్ల పైబడిన వారికి బాగా తెలుసు. ఆ రుచి ఇప్పుడు వాటిలో కనుమరుగైంది. బారెడుగా పెరిగిన బీరకాయలను తరిగితే కరకర ముదురు చప్పుడు వస్తుంది. టమాటలో గట్టి గుజ్జు తప్ప రసం రావడం లేదు. యాపిల్ పండ్లలో అయితే నునుపుగుజ్జు తప్ప తియ్యదనమే కొరవడింది. ఇలా చెబుతూ పోతే, ప్రతీ పండు, కాయకూర పరిస్థితి ఇంచుమించు ఇలాగే తయారైంది. చాలామంది ఆశగా ఎదురుచూసే పన్నీర్ కర్రీ కోసం వినియోగించే పాలకూర సైతం ఇప్పుడు రసాయనాల బారిన పడినట్టు వార్తలు వింటున్నాం.



## ఉద్యమ ఊపు ఎక్కడ?

పంటకు తెగుళ్లు సోకడం సహజం. 'ఆ పురుగులను ఎలా నాశనం చేయాలి?' అన్నదే ఇక్కడ ప్రధానం. సేంద్రియ పద్ధతిలో తయారైన మందులను తయారుచేసి వాడే ఓపిక ఎందరు రైతులకు ఉంటున్నది? ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు, పర్యావరణ ప్రేమికులు, ప్రకృతి వ్యవసాయదారులు అందరూ పని కట్టుకొని గత రెండు దశాబ్దాలుగా జరుపుతున్న 'సేంద్రియ సాగు ఉద్యమం' ఒకవైపు ఊపందుకుంటున్నప్పటికీ, భారతదేశం వంటి పలు అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆయా ప్రభుత్వాలు ఈ బృహత్ కార్యాన్ని తమ సామాజిక, గురుతర బాధ్యతగా భుజానికెత్తుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అమెరికా వంటి అగ్రదేశాల్లో పెరుగుతున్నంత 'సేంద్రియ సాగు స్పృహ' బడుగు దేశాలలో కొరవడుతున్నది. దీంతో నిషేధిత పెస్టిసైడ్స్ వాడకం అన్ని దేశాలలోనూ అమలు కావడం లేదు.

ఇందుకు ఉదాహరణ మన దేశమే. 'కొన్ని రకాల పురుగుమందుల వాడకంపై అంతర్జాతీయంగా పలు దేశాలలో నిషేధం విధించినప్పటికీ మన దేశంలో వాటిలో కొన్నింటిని వినియోగించడానికి అనుమతిస్తున్నారని, ఇది ప్రజలకు తీవ్ర అనారోగ్యదాయకమని' చెబుతూ ఈ పరిస్థితిపై నివేదిక (స్టేటస్ రిపోర్ట్) ఇవ్వవలసిందిగా కిందటేడాది (2023) జనవరిలోనే సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మరోవైపు, యూరోపియన్ వ్యవసాయ విధానాలపై జరిగిన ఒక అధ్యయనం ప్రకారం మొత్తం మీద పెస్టిసైడ్స్‌ను వదిలేసుకోవడం ద్వారా పంట దిగుబడి పండ్ల ఉత్పత్తిలో 78 శాతాన్ని, కూరగాయలలో 54 శాతాన్ని, ధాన్యం గింజలలో 32 శాతాన్ని నష్టపోవలసి వస్తున్నట్టు తేలింది.

# ఏం తినాలి?

## డర్టీ డజన్ ఫుడ్స్–2023 జాబితా

- స్ట్రాబెర్రీ
- పాలకూర
- ఆవాలు, క్యాబేజీ వంటివి
- పీచుపండు
- బేరి (నేరేడు రకం) పండు
- నెక్టరైన్స్ మకరందపు ఫలాలు
- యాపిల్
- ద్రాక్ష
- కూర మిరప
- చెర్రీ
- బ్లూబెర్రీ
- ఆకుపచ్చ చిక్కుడు



### పదేళ్లుగా యాపిల్ పండ్లు బ్యాడ్!

ఒకప్పుడు యాపిల్ పండ్లు అక్కడక్కడ మాత్రమే అమ్మకానికి కనిపించేవి. కానీ, ఇప్పుడు ఎక్కడ చూసినా, చిన్న పెద్ద సైజుల్లో తేలికపాటి ధరల్లోనే లభ్యమవుతున్నాయి. ఇదెలా సాధ్యమైంది? అసలు అవి అంతగా ఎలా పండుతున్నాయి?? ఆలోచిస్తే భయమేస్తుంది మరి. అంతర్జాతీయ స్థాయిలో లాభాపేక్ష రహిత సంస్థగా పేరొందిన 'ఎన్విరాన్‌మెంటల్ వర్కింగ్ గ్రూప్' (ఈడబ్లుజి) ప్రజాబాగు కోసం ఏటా పరిశోధనాత్మకంగా ప్రకటించే 'అత్యంత అధమ స్థాయి ఆహార ఉత్పత్తుల'లలో గత పదేళ్లుగా యాపిల్ పళ్లు టాప్‌లో నిలిచాయంటే వాటి దుస్థితిని ఊహించుకోవచ్చు.


# ఎలా బతకాలి?

## కూరగాయలు, పండ్లు, ఆహార ఉత్పత్తులలో పురుగుమందుల అవశేషాలు

### బతికినన్నాళ్లు అవి మనతోనే!

**అటు** పర్యావరణాన్ని, ఇటు జంతువులు, పశువులతో సహా మనుషుల శరీర ధర్మాలను పురుగుమందుల రసాయనాలు, వాటి అవశేషాల ఆహారం పెద్ద ఎత్తున నిర్వీర్యం చేస్తున్న తీరు అత్యంత బాధాకరం. ఆహార ప్రక్రియ పరిణామ క్రమం(ఫుడ్ సైకిల్)లోకి పెస్టిసైడ్స్ విషాలు 'పెద్దర్వాజ' (అధికారికంగానే) గుండానే చొరబడటాన్ని శాస్త్రవేత్తలు 'బయోఅక్యుములేషన్' అంటున్నారు. మిగిలిన పశు, వృక్ష, పక్షి, జంతు జీవజాతుల మాట దేవుడెరుగు, మనుషులకు దీనివల్ల జరుగుతున్న 'ఆరోగ్య నష్టం' పూడ్చుకోలేనంత స్థాయిలో వుంటున్నట్టు నిపుణులు అంటున్నారు. మన దేహాలలోకి వెళ్లిన ఈ రసాయన విషకణాలు జీర్ణం కాకపోగా, కొవ్వులో పేరుకు పోయి, అలా బతికివున్నంత కాలం హాని చేస్తూ, మనలను మరణానికి చేరువ చేస్తున్నట్టు వారు చాలా కటువుగానే కుండబద్దలు కొడుతున్నారు. ఈ విపరీత పరిణామం ఎంత హానికరమో తెలుసుకుంటే మన మానసిక ఆందోళన రెట్టింపు అవుతుంది.

ఒక ప్రామాణిక అంచనా ప్రకారం ప్రపంచవ్యాప్తంగా విషతుల్యమైన పురుగుమందుల రసాయనాల బారిన (అనుకోకుండానే) పడుతున్న వ్యవసాయ కార్మికుల సంఖ్య ఏడాదికి 38.5 కోట్ల వరకు వుంటున్నది. ఈ మందులను పిచికారి చేసే రైతు కార్మికులు తమకు తెలియకుండానే ఆ అణువులను గాలితో పీల్చేస్తారు. పర్యవసానంగా కొన్నాళ్లకు దాని దుష్పరిణామాలు బయటపడతాయి. తలనొప్పి, మైకం, వికారం, వాంతులు, చర్మంపై మంటలు పుట్టడం వంటి అనేక అనారోగ్య లక్షణాలు వారిలో పొడసూపుతాయి. పెస్టిసైడ్స్ అవశేషాలతో పండిన ఆహార ఉత్పత్తులను తెలిసో, తెలియకో తీసుకోవడం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర, దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడతున్నారు. ఈ దుష్ప్రభావం నెలలు, సంవత్సరాల పాటు వుంటున్నట్లు వైద్య నిపుణులు తేల్చారు. అతిసార నుంచి మరణం వరకూ పరిస్థితి దారితీయవచ్చుననీ వారంటున్నారు. రోగనిరోధక శక్తి నుంచి పునరుత్పాదక శక్తి వరకు, శిశుజనన హాని మొదలు హార్మోన్లకు కీడు జరగడం వరకు, డయేరియా నుంచి క్యాన్సర్ వరకు, ఇంకా ఎన్నో మొండి వ్యాధులకు ఆస్కారం వుంటున్నది. శిశువులు, పిల్లలపై అయితే, ఇది మరింత అత్యధిక ప్రభావం చూపుతుంది.



### క్యాబేజీనుంచి కూరమిరప వరకు!

**ఎప్పటిలా** 2023 సంవత్సరంలో 'ఈడబ్లుజి' సంస్థ ప్రజా ప్రయోజనార్థం 'డర్టీ డజన్ ఫుడ్స్' జాబితాలోని పండ్లు, కూరగాయలను తాజాగా ప్రకటించింది. ఇందులో 'స్ట్రాబెర్రీ' ప్రథమస్థాయిలో నిలవగా, పాలకూర రెండో స్థానాన్ని పొందడం గమనార్హం. అధ్యయనానికి వాడిన వాటిలో సుమారు 30 శాతం స్ట్రాబెర్రీ నమూనాలలో పది, అంతకు మించిన సంఖ్యలో వివిధ రకాల పెస్టిసైడ్స్ అవశేషాలు లభ్యమైనట్టు 'ఈడబ్లుజి' పరిశోధకులు తెలిపారు. 'డర్టీ డజన్ ఫుడ్స్–2023' జాబితాలో ఈసారి చిట్టచివరి స్థానం యాపిల్ పండుది. మూడునుంచి తర్వాతి స్థానాలను వరుసగా 'కాలే', ఆవాలు, క్యాబేజీ వంటి ఆకుకూరలు, పీచుపండు, బేరి (నేరేడు రకం) పండు, నెక్టరైన్స్ (మకరందపు) ఫలాలు, యాపిల్, ద్రాక్ష, కూర మిరప, చెర్రీ (నేరేడు రకానికి చెందిన ఎర్రరంగు పండ్లు), బ్లూబెర్రీ, ఆకుపచ్చ చిక్కుడు వున్నాయి. చాలావరకు సంప్రదాయ పండ్లు, కూరగాయలలో పెద్ద మొత్తంలో పురుగుమందుల అవశేషాలు వుంటున్నట్టు 'ఈడబ్ల్యూజి' వెల్లడించింది.




### పొంచివున్న మరింత పెద్ద ముప్పు

**ప్రపంచవ్యాప్తంగా** సుమారు 1,000 రకాలకు పైగా పెస్టిసైడ్స్ వినియోగం జరుగుతున్నట్టు 'డబ్లుహెచ్ఓ' (వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్) నివేదిక చెబుతున్నది. అత్యంత సర్వసాధారణ పెస్టిసైడ్స్‌లలో హెర్బిసైడ్స్ (49 శాతం), ఫంగిసైడ్స్, బ్యాక్టీరియాసైడ్స్ (27 శాతం), ఇన్‌సెక్టిసైడ్స్ (19 శాతం) వున్నాయి. ప్రపంచ స్థాయిలో పురుగుమందుల వినియోగం 1990లో 3.72 బిలియన్ పౌండ్లు (169 కోట్ల కిలోలు) వుండగా, రెండు దశాబ్దాల (2020) నాటికి 57 శాతం పెరుగుదలతో 5.86 బిలియన్ పౌండ్ల (266 కోట్ల కిలోలు)కు చేరింది. మున్ముందు ఇది ఒక దగ్గర ఆగేలా కనిపించడం లేదు. 2050 నాటికి ప్రపంచ జనాభా 9.5 బిలియన్ (950 కోట్లు)లకు చేరుకొంటున్న తరుణంలో సుమారు 60 శాతం మేర ఆహార ఉత్పత్తిని పెంచుకోవలసి వుంటుంది. ఈ డిమాండ్ నుండి గట్టెక్కడానికి (లేదా అవసరాన్ని అధిగమించడానికి) రైతులు మరింత ఎక్కువ పాళ్లలో పెస్టిసైడ్స్‌ను వినియోగించక తప్పదని పరిశోధకులు భావిస్తున్నారు.



### రైతులే మూల బాధితులు



ప్రపంచవ్యాప్తంగా సుమారు మూడో వంతుమేర వ్యవసాయ ఉత్పత్తులు పురుగుమందుల అవశేషాలను కలిగి వుంటున్నట్టు పలు అధ్యయనాలు చెబుతున్నాయి. వీటి బాధితుల్లో ఎక్కువగా రైతులే వుంటున్నారు. సుమారు 49 శాతం మేర బాధితులు వాసన శక్తిని సైతం కోల్పోతున్నట్టు శాస్త్రవేత్తలు తెలిపారు. ఏటికేడు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పాలనుంచి పండ్లవరకు, కూరగాయల నుంచి తృణధాన్యాలు, తిండిగింజల దాకా ఏవీ 'రేషన్' (నియంత్రణ) అన్నదే లేకుండా బహిరంగ మార్కెట్లలో (ఎంతోకొంత ధరకు) ఎలా లభ్యమవుతున్నాయి? అధిక ఉత్పత్తి లేదా కనీస దిగుబడి కోసం సగటునుంచి మోతుబరు రైతులవరకు అందరూ రసాయనిక పోషకాలు, పెస్టిసైడ్స్ వాడక తప్పని పరిస్థితిలో ఫలితాలు దయనీయంగా వుంటున్నాయి.

### ..ఇంకా వుంది!

*__మనం__ నిత్యం వినియోగించే పండ్లు, కూరగాయలలో ఏది మంచిది, ఏది చెడ్డది? దేనిలో ఎంతమేర పురుగుమందుల (పెస్టిసైడ్స్) అవశేషాలు వున్నాయి? తెలిసో, తెలియకో మనం తింటున్న వాటిలో ఎంతమేర నష్టకారకాలు వుంటున్నట్టు? వీటివల్ల ఆయుష్షు ఎక్కడికి తగ్గిపోతున్నది? సాగులో విష రసాయనాలు వాడకుండా పూర్తిగా సేంద్రియ పద్ధతిలో పండించే పళ్లు, కూరగాయలు లభ్యమయ్యే పరిస్థితి అసలు వుందా? 'ఆర్గానిక్' పేరుతో మార్కెట్లలో అత్యధిక ధరలకు అమ్మే ఆహార ఉత్పత్తులు సామాన్యులకు అందివచ్చే అవకాశమే లేనప్పుడు ఏమిటి ప్రత్యామ్నాయం? ఇలాంటివన్నీ విపులంగా తెలుసుకోవాల్సి వుంది.*

# 4 రోజుల్లో రూ.9 లక్షల కోట్లు

## వరుస పతనంతో ఇన్వెస్టర్లు కోల్పోయిన సంపద

- సెన్సెక్స్ మరో 455 పాయింట్లు డౌన్
- 22,000 పాయింట్ల దిగువకు నిఫ్టీ



ముంబై, ఏప్రిల్ 18: ఒక వైపు మధ్యప్రాచ్యంలో యుద్ధ ఉద్రిక్తతలు, మరోవైపు అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోతలపై అంచనాలు ఆవిరైపోవడంతో ఇన్వెస్టర్లు స్వల్పకాలంలో భారీ సంపదను కోల్పోయారు. ఏప్రిల్ 12 నుంచి కేవలం నాలుగు ట్రేడింగ్ రోజుల్లో బీఎస్ఈలో లిస్టయిన మొత్తం కంపెనీల మార్కెట్ విలువ రూ.402.2 లక్షల కోట్ల నుంచి రూ.393.2 లక్షల కోట్లకు పడిపోయింది. దీంతో రూ.9 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద హరించుకుపోయింది. గురువారం వరుసగా నాలుగో రోజూ స్టాక్స్ పతనం కొనసాగింది. బీఎస్ఈ సెన్సెక్స్ మరో 455 పాయింట్ల మేర క్షీణించి 72,489 పాయింట్ల వద్ద నిలిచింది. నాలుగు రోజుల్లో 2,500 పాయింట్లకు పైగా సూచీ పతనమయ్యింది. ఇదే బాటలో ఎన్ఎస్ఈ నిఫ్టీ తాజాగా మరో 152 పాయింట్ల నష్టంతో కీలకమైన 22,000 పాయింట్ల దిగువన 21,996 పాయింట్ల వద్ద నిలిచింది. నాలుగు రోజుల్లో ఈ సూచి 750 పాయింట్లకుపైగా పడిపోయింది. యుద్ధ భయాలకు ప్రపంచ మార్కెట్లన్నీ కునారిల్లిన సమయంలోనే బుల్స్‌ను నిరుత్సాహపర్చే రెండు వార్తలు అమెరికా నుంచి వెలువడ్డాయి. మార్చి నెలలో ద్రవ్యోల్బణం అంచనాల్ని మించి 3.5 శాతం పెరగడం, రిటైల్ అమ్మకాలు 0.7 శాతం వృద్ధిచెందడంతో యూఎస్ ఫెడ్ ఈ జూన్ నెలలో వడ్డీ రేట్లు తగ్గించదంటూ మార్కెట్లు డీలా పడ్డాయి. జూన్‌తో మొదలుపెట్టి ఈ ఏడాది కనీసం మూడు దఫాలు వడ్డీ రేట్ల కోతలుంటాయన్న అంచనాలు ఇప్పటివరకూ ఉండగా, అమెరికాలో వెలువడిన తాజా గణాంకాలు ఆ అంచనాల్ని నీరుకార్చాయని మార్కెట్ నిపుణులు వివరించారు. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోతల్ని జాప్యం చేస్తుందన్న అంచనాలతో విదేశీ ఫండ్స్ విక్రయాలు జరుపుతున్నట్టు ట్రేడర్లు చెప్పారు.

### రేట్ల తగ్గింపు ఆశలు ఆవిరి

మధ్యప్రాచ్య ఉద్రిక్తతలకు తోడు యూఎస్ రేట్ల తగ్గింపు ఆశలు ఆవిరైపోవడంతో స్టాక్ సూచీల పతనం కొనసాగుతున్నదని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ వంటి హెవీవెయిట్ రంగాలు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయన్నారు. యూఎస్‌లో అంచనాల్ని మించి యూఎస్ ద్రవ్యోల్బణం పెరగడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయని వినోద్ నాయర్ వివరించారు. ఫిబ్రవరికంటే మార్చిలో యూఎస్ ఇన్‌ఫ్లేషన్ మరింత పెరగడంతో ట్రెజరీ ఈల్డ్స్ ఎగిసాయని, దీంతో ఈ ఏడాది మూడు రేట్ల కోతలు ఉంటాయన్న ఇన్వెస్టర్ల ఆశలు అడుగంటాయని క్రూడాయిల్ ధరలు పెరగడం కూడా దేశీయ మార్కెట్లో అమ్మకాలకు పురికొల్పిందని వివరించారు. అధిక విలువలు, క్యూ4 లాభాల వృద్ధిపై అంచనాలు తగ్గడంతో మిడ్, స్మాల్ క్యాప్ షేర్లలో అమ్మకాలు భారీగా జరిగాయన్నారు.

### సాంకేతిక మద్దతు 21,900

నిఫ్టీ కీలకమైన 21ఈఎంఏ దిగువన క్రమేపీ బలహీనపడిందని, అయితే హవర్లీ చార్టుల్లో బుల్లిష్ హరామీ ప్యాట్రన్ ఏర్పడటం సమీప భవిష్యత్తులో బుల్లిష్ రివర్సల్‌ను సూచిస్తున్నదని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ సీనియర్ టెక్నికల్ అనలిస్ట్ రూపక్ డే తెలిపారు. ఈ కారణంగా వచ్చే ఒకటి, రెండు సెషన్లలో 22,200–22,300 దిశగా కదిలే అవకాశం ఉందని, 21,900 స్థాయి మద్దతు అందించవచ్చని వివరించారు.

## నెస్లే టాప్ లూజర్

సెన్సెక్స్ బాస్కెట్‌లో అన్నింటికంటే అధికంగా నెస్లే 3 శాతం పడిపోయింది. బోర్నవిటాలో చక్కెర స్థాయిపై నెలకొన్న వివాదం నేపథ్యంలో ఈ షేరును ఇన్వెస్టర్లు విక్రయించారు. టైటాన్, యాక్సిస్ బ్యాంక్, ఎన్టీపీసీ, టాటా మోటార్స్, ఐటీసీ, టెక్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్‌లు 1–3 శాతం మధ్య క్షీణించాయి. మరోవైపు భారతి ఎయిర్‌టెల్, పవర్ గ్రిడ్, ఇన్ఫోసిస్, లార్సన్ అండ్ టూబ్రోలు లాభపడ్డాయి. వివిధ రంగాల సూచీల్లో అన్నింటికంటే అధికంగా కన్స్యూమర్ డ్యూరబుల్స్ ఇండెక్స్ 1.52 శాతం తగ్గగా, ఆయిల్ అండ్ గ్యాస్ సూచి 0.96 శాతం, ఆటో ఇండెక్స్ 0.73 శాతం, రియల్టీ ఇండెక్స్ 0.70 శాతం, కన్స్యూమర్ డిస్క్రీషనరీ 0.54 శాతం, కమోడిటీస్ ఇండెక్స్ 0.39 శాతం చొప్పున తగ్గాయి. టెలికమ్యూనికేషన్, టెక్నాలజీ సూచీలు పెరిగాయి.

## విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాల వెల్లువ

- రూ. 20 వేల కోట్లు వెనక్కి

ఏప్రిల్ తొలివారంలో వరుసగా పెట్టుబడులు చేసిన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) హఠాత్తుగా మార్కెట్ నుంచి నిధులు వెనక్కు తీసుకుంటున్నారు. వరుసగా నాలుగు ట్రేడింగ్ రోజుల్లో దాదాపు రూ. 20,000 కోట్ల అమ్మకాలు జరిపారు. శుక్రవారం రూ. 8,000 కోట్లకుపైగా నికర విక్రయాలు జరిపిన ఎఫ్‌పీఐలు సోమవారం మరో రూ. 3,268 కోట్లు, మంగళవారం రూ.4,468 కోట్లు వెనక్కు తీసుకోగా, గురువారం రూ.4,260 కోట్ల విలువైన షేర్లను నికరంగా విక్రయించినట్టు స్టాక్ ఎక్స్ఛేంజీల తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అమెరికాలో వడ్డీరేట్లు ఇప్పట్లో తగ్గవన్న సంకేతాలతో భారత్‌తో సహా వర్ధమాన దేశాల్లో ఎఫ్‌పీఐలు నిధుల్ని వెనక్కి తీసుకుంటున్నారు.

## వచ్చే వారం నిఫ్టీ నెక్స్ట్ 50 ఇండెక్స్ ట్రేడింగ్

ముంబై, ఏప్రిల్ 18: ఇప్పటివరకూ ఎన్ఎస్ఈ ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ వో) విభాగంలో ప్రధాన సూచి నిఫ్టీ–50 ట్రేడవుతుండగా, వచ్చే వారం నుంచి నిఫ్టీ నెక్స్ట్ 50 కాంట్రాక్టులు సైతం ట్రేడర్లకు అందుబాటులోకి వస్తాయి. ఈ సూచి ఫ్యూచర్స్, ఆప్షన్స్ మంత్లీ కాంట్రాక్టుల ట్రేడింగ్‌కు మార్కెట్ రెగ్యులేటర్ సెబీ నుంచి అనుమతి లభించిందని గురువారం ఎన్ఎస్ఈ తెలిపింది. ఈ కాంట్రాక్టుల ట్రేడింగ్‌ను ఏప్రిల్ 24, బుధవారం నుంచి ఆరంభించనున్నట్టు ఎక్స్ఛేంజ్ వెల్లడించింది. వీటి ఎక్స్‌పైరీ ప్రతీ నెల చివరి శుక్రవారం ఉంటుందని, ఆ రోజు సెలవుదినం అయితే అంతకు ముందు రోజున ఎక్స్‌పైరీ జరుగుతుందని తెలిపింది.

## బజాజ్ ఆటో లాభం 2,011 కోట్లు


ముంబై, ఏప్రిల్ 18: బజాజ్ ఆటో నికరలాభం 2024 ఆర్థిక సంవత్సరం క్యూ4లో 18 శాతం వృద్ధిచెంది రూ. 2,011 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదేకాలంలో కంపెనీ రూ. 1,704 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. బజాజ్ ఆటో అమ్మకాల ఆదాయం 30 శాతం వృద్ధితో రూ. 8,660.9 కోట్ల నుంచి రూ. 11,250 కోట్లకు చేరింది.

## 23.5 లక్షల కోట్లకు ఫండ్స్ ఆస్తులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: మదుపరులు వారి బ్యాంక్ ఖాతాల్లో డిపాజిట్లను మ్యూచువల్ ఫండ్స్‌లోకి మళ్లిస్తున్న నేపథ్యంలో ఫండ్స్ నిర్వహణలోని ఆస్తులు జోరుగా పెరుగుతున్నాయి. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మ్యూచువల్ ఫండ్ ఆస్తులు 35 శాతం వృద్ధిచెందినట్టు అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ తెలిపింది. 2021 ఆర్థిక సంవత్సరంలో పరిశ్రమ సాధించిన 41 శాతం వృద్ధి తర్వాత ఇదే అత్యుత్తమ వృద్ధిగా అసోసియేషన్ పేర్కొంది. మెరుగైన రాబడి వస్తుందన్న భావనతో కస్టమర్లు వారి కరెంట్, సేవింగ్స్ ఖాతాల్లో డిపాజిట్లను ఫండ్స్‌లోకి మళ్లిస్తున్నందున ఫండ్స్ ఆస్తులు పెరుగుతున్నాయని యాంఫి చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ చలసాని చెప్పారు.

# వడ్డీ రేట్ల కోత.. ఆశలు గల్లంతు

ఫెడ్ చైర్మన్ సంకేతాలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లు, రుణగ్రస్తులు వడ్డీ రేట్ల తగ్గుదలపై ఎంతగానో పెట్టుకున్న ఆశలు గల్లంతయ్యాయి. యూఎస్ కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పొవెల్ ఈ అంశమై సంకేతాలిచ్చారు. ఈ ఏడాది జూన్ నెలలో తొలుత ఒక దఫా రేట్లను తగ్గిస్తుందన్న అంచనాలపై నీళ్లు చల్లుతూ తమ ద్రవ్య విధానాన్ని దీర్ఘకాలంపాటు కఠినంగానే ఉంచాల్సిన అవసరం కనపడుతున్నదని తాజాగా వాషింగ్టన్‌లో జరిగిన ఒక సదస్సులో పొవెల్ చెప్పారు. 'ఇటీవలి డేటా మాకు విశ్వాసాన్ని (రేట్లు తగ్గించేందుకు) ఇవ్వడం లేదు. ఈ విశ్వాసం పెంపొందడానికి దీర్ఘకాలం పట్టేరీతిలోనే ఆర్థిక గణాంకాలు వెలువడుతున్నాయి' అని వ్యాఖ్యానించారు. ప్రస్తుతానికి ద్రవ్యోల్బణం పెరుగుదల, జాబ్ మార్కెట్ పటిష్టత కఠిన ద్రవ్య విధానాన్ని మరింతకాలం కొనసాగించేలా చేస్తున్నాయని పొవెల్ చెప్పారు. ఐదు వారాల క్రితం వడ్డీ రేట్లను తగ్గించడానికి మరెంతో సమయం అవసరం లేదన్న పొవెల్ తాజా ఆర్థిక గణాంకాలతో ఇన్వెస్టర్లకు షాకిచ్చారు. ఫెడ్ రేట్ల కోత తర్వాత భారత్‌లో రిజర్వ్‌బ్యాంక్ సైతం వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న అంచనాలు ఉన్నాయి.

# ఇన్ఫోసిస్ నికరలాభం 30% జంప్

- రూ.37,923 కోట్లకు ఆదాయం
- షేర్‌హోల్డర్లకు డివిడెండ్ నజరానా
- వచ్చే ఏడాది రెవిన్యూ గైడెన్స్ 1–3 శాతం



బెంగళూరు, ఏప్రిల్ 18: ఐటీ సర్వీసుల దిగ్గజం ఇన్ఫోసిస్ నికరలాభం 2024 మార్చితో ముగిసిన నాల్గవ త్రైమాసికంలో 30 శాతం వృద్ధిచెంది రూ.7,969 కోట్లకు పెరిగింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో కంపెనీ రూ. 6,128 కోట్ల లాభాన్ని ఆర్జించింది. తాజాగా ముగిసిన క్యూ4లో ఇన్ఫోసిస్ ఆదాయం 1 శాతం వృద్ధితో రూ. 37,441 కోట్ల నుంచి రూ.37,923 కోట్లకు పెరిగింది.అయితే 2023 డిసెంబర్ త్రైమాసికంతో పోలిస్తే ఆదాయం 2.2 శాతం క్షీణించింది. పూర్తి ఆర్థిక సంవత్సరంలో కంపెనీ నికరలాభం 8.9 శాతం వృద్ధితో రూ.26,233 కోట్లకు, ఆదాయం 4.7 శాతం పెరిగి రూ.1,53,670 కోట్లకు చేరింది. క్యూ4లో 20.1 శాతం, ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 20.7 శాతం ఆపరేటింగ్ మార్జిన్లను కనపర్చింది. గురువారం సమావేశమైన కంపెనీ డైరెక్టర్ల బోర్డు షేర్‌హోల్డర్లకు డివిడెండ్ నజరానాను సిఫార్సుచేసింది. షేరుకు రూ.20 తుది డివిడెండుకు అదనంగా రూ.8 స్పెషల్ డివిడెండును కంపెనీ బోర్డు సిఫార్సుచేసింది. షేర్‌హోల్డర్లకు భవిష్యత్తులో తగిన రాబడుల్ని ఇచ్చేలా క్యాపిటల్ అలకేషన్ పాలసీని బోర్డు ఆమోదించింది. ఈ పాలసీ ప్రకారం వచ్చే ఐదేండ్లలో 85 శాతం రాబడుల్ని అందించాలని నిర్ణయించింది. ఇందుకోసం వార్షిక డివిడెండు చెల్లింపుల్ని కంపెనీ పెంచుతూపోతుంది.

### 4.5 బిలియన్ డాలర్ల డీల్స్

ఈ జనవరి–మార్చి క్వార్టర్లో 4.5 బిలియన్ డాలర్ల విలువైన డీల్స్ సాధించినట్టు ఇన్ఫోసిస్ వెల్లడించింది. ఇందులో 44 శాతం కొత్త డీల్సేనని, 2023–24 పూర్తి ఆర్థిక సంవత్సరంలో 17.7 బిలియన్ డాలర్ల విలువైన డీల్స్ వచ్చాయని, ఇది భవిష్యత్ వృద్ధికి పునాదిలాంటిదని కంపెనీ వివరించింది. తాజాగా ముగిసిన త్రైమాసికంలో 848 మిలియన్ డాలర్ల క్యాష్‌ఫ్లో వచ్చిందని, గత 11 త్రైమాసికల్లో ఇదే అధికమని, దీంతో వర్కింగ్ క్యాపిటల్ సైకిల్ మెరుగుపడుతుందని ఇన్ఫోసిస్ తెలిపింది.

### రెవిన్యూ గైడెన్స్ 1–3 శాతం

2024–25 ఆర్థిక సంవత్సరంలో తమ ఆదాయ వృద్ధి 1–3 శాతం మధ్య ఉంటుందంటూ ఇన్ఫీ గైడెన్స్‌ను ప్రకటించింది. ఆపరేటింగ్ మార్జిన్లు 20–22 శాతం మేర ఉంటాయని అంచనా వేసింది. మధ్యకాలికంగా ఆపరేటింగ్ మార్జిన్లను పెంచుకోవడం, క్యాష్ జనరేషన్‌ను మెరుగుపర్చుకోవడం తన ప్రాధాన్యతలుగా ఇన్ఫోసిస్ ప్రకటించింది.

### జర్మనీ కంపెనీ కొనుగోలు

జర్మనీ కంపెనీ ఇన్‌టెక్‌లో నూరుశాతం వాటాను 450 మిలియన్ యూరోలకు (రూ. 4,000 కోట్లు) కొనుగోలు చేస్తున్నట్టు ఇన్ఫోసిస్ ప్రకటించింది. ఈమొబిలిటీ, ఆటారమస్ డ్రైవింగ్, ఎలక్ట్రిక్ వెహికిల్స్ తదితరాలకు ఇన్‌టెక్ సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేస్తున్నది. ఇండియాతో పాటు పలు దేశాల్లో 2,200 మంది ఉద్యోగులు కంపెనీకి ఉన్నారు.

### తగ్గిన వలసలు, ఉద్యోగులు

మార్చి త్రైమాసికంలో ఉద్యోగుల వలసల రేటు 12.6 శాతానికి తగ్గినట్టు ఇన్ఫీ వెల్లడించింది. డిసెంబర్ క్వార్టర్లో ఇది 12.9 శాతం ఉండగా, ఏడాది క్రితం ఈ రేటు 20.9 శాతంగా నమోదయ్యింది. కంపెనీ ఉద్యోగుల సంఖ్య గత ఏడాదితో పోలిస్తే 7.5 శాతం తగ్గింది. 2023 మార్చి చివరినాటికి 3,43,234 మంది ఉద్యోగులు ఉండగా, 2024 మార్చి 31నాటికి ఇన్ఫోసిస్ రోల్స్‌లో 3,17,240 మంది ఉద్యోగులు ఉన్నారు.



'ఈ ఏడాది మేము సాధించిన వృద్ధికంటే వచ్చే సంవత్సరానికి గైడెన్స్ ఎక్కువే. వ్యయాల్ని నియంత్రణ, కన్సాలిడేషన్ ద్వారా ఆ వృద్ధి గైడెన్స్‌ను సాధిస్తాం. ఫైనాన్షియల్ సర్వీసుల రంగం గత ఏడాదికంటే వచ్చే ఏడాది మెరుగ్గా ఉంటుంది. జనరేటివ్ ఏఐలో మా సామర్థ్యాన్ని పెంచుకుంటున్నాం'

**– సలీల్ పరేఖ్**
ఎండీ, సీఈవో, ఇన్ఫోసిస్

# ఎఫ్‌డీలపై 7 శాతం వడ్డీ

## ఆఫర్ చేస్తున్న బ్యాంకులివే

సురక్షితమైన మదుపు సాధనంగా చూసే ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) వేసే ముందు కాస్త ఎక్కువ వడ్డీ ఎక్కడ వస్తుందో చూసుకోవడం సహజం. అన్ని బ్యాంక్‌ల్లోనూ వడ్డీ రేట్లు దాదాపు ఒకే శ్రేణిలో ఉన్నా, కొద్దిపాటి తేడాలుంటాయి. రేటు కాస్త అధికం ఉంటే చాలు..దీర్ఘకాలంలో మనకు కలిసొచ్చేది చాలా ఉంటుంది. మరి.. ఫిక్స్‌డ్‌పై 7 శాతంపైన వడ్డీ రేటును ఆఫర్ చేసే బ్యాంకులే మిటో చూద్దామా!

### స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

వివిధ కాలపరిమితుల ఫిక్స్‌డ్ డిపాజిట్లకు ఎస్‌బీఐ ఆఫర్ చేస్తున్న వడ్డీ రేట్లు 3.50 శాతం నుంచి 7 శాతం శ్రేణిలో ఉన్నాయి. 2 నుంచి 3 ఏండ్ల కాలపరిమితిలో గల ఎఫ్‌డీలకు 7 శాతం గరిష్ఠ వడ్డీ రేటు లభిస్తున్నది. 1–2 ఏండ్ల ఎఫ్‌డీలపై 6.80 శాతం వడ్డీ రేటు ఉన్నది. 2023 డిసెంబర్ 27 నుంచి ఈ రేట్లు అమలవుతున్నాయి.

### హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

ఈ బ్యాంక్‌లో వేసే కొన్ని కాలపరిమితుల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 7.25 శాతం వరకూ వడ్డీ రేటు అందిస్తున్నది. 18 నెలల 21 రోజుల టెర్మ్ డిపాజిట్‌పై 7.25 శాతం గరిష్ఠ వడ్డీ రేటు ఆఫర్ చేస్తున్నది. ఈ బ్యాంక్‌లో చేసే ఎఫ్‌డీలకు 4 ఏండ్ల 7 నెలల నుంచి 55 నెలల డిపాజిట్లకు 7.20 శాతం, 2 ఏండ్ల 11 నెలల నుంచి 35 నెలల వరకూ 7.15 శాతం చొప్పున వడ్డీ రాబడి లభిస్తుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 24 నుంచి ఈ రేట్లు అమల్లోకి వచ్చాయి.

### ఐసీఐసీఐ బ్యాంక్

వివిధ కాలపరిమితుల ఎఫ్‌డీలకు ఐసీఐసీఐ బ్యాంక్ 3 శాతం నుంచి 7.20 శాతం వరకూ వడ్డీ రేటు ఆఫర్ చేస్తున్నది. 15 నెలల నుంచి 2 ఏండ్ల కాలపరిమితిగల డిపాజిట్‌పై అధికంగా 7.20 శాతం వడ్డీ ఇస్తుంది. 2 నుంచి 5 ఏండ్ల ఎఫ్‌డీకి 7 శాతం వడ్డీ రేటును ఆఫర్ చేస్తుండగా, 5 ఏండ్లకుపైబడి చేసే డిపాజిట్‌కు మాత్రం వడ్డీ రేటును 6.90 శాతమే ఇస్తున్నది. ఈ ఏడాది ఫిబ్రవరి 17 నుంచి ఈ రేట్లు అమలవుతున్నాయి.

### బ్యాంక్ ఆఫ్ బరోడా

ఈ బ్యాంక్ వివిధ కాలపరిమితులుగల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 4.25 శాతం 7.25 శాతం మధ్య వడ్డీ రేటు ఇస్తున్నది. 7.25 శాతం గరిష్ఠ వడ్డీ రేటు 2–3 ఏండ్ల మధ్య కాలపరిమితికి చేసే ఎఫ్‌డీపై లభిస్తుంది. 399 రోజుల బరోడా తిరంగా ప్లస్ డిపాజిట్ స్కీమ్ 7.15 శాతం వార్షిక వడ్డీని అందిస్తుంది. తాజా వడ్డీ రేట్లు 2024 జనవరి 15 నుంచి అమల్లోకి వచ్చాయి.

### కొటక్ మహీంద్రా బ్యాంక్

ఈ బ్యాంక్ వివిధ కాలపరిమితుల ఎఫ్‌డీలపై అందించే వడ్డీ రేట్లు 2.75 శాతం నుంచి 7.40 శాతం శ్రేణిలో ఉన్నాయి. 7.40 శాతం గరిష్ఠవడ్డీ రేటు 390 రోజుల నుంచి 23 నెలల లోపు డిపాజిట్‌పై లభిస్తుంది. 23 నెలల నుంచి 2 ఏండ్ల లోపు డిపాజిట్‌పై 7.30 శాతం వడ్డీ వస్తుంది. 2024 ఫిబ్రవరి 27 నుంచి ఈ రేట్లు అమల్లోకి వచ్చాయి.

# ఈ గోల్డ్ బాండ్స్ రిడంప్షన్లకు సిద్ధం

## 140 శాతం వరకూ పెరిగిన విలువ



ముంబై, ఏప్రిల్ 16: ఎనిమిదేండ్ల క్రితం జారీచేసిన పలు సావరిన్ గోల్డ్ బాండ్లు ఈ ఆర్థిక సంవత్సరంలో తుది రిడంప్షన్‌కు సిద్ధమవుతున్నాయి. ప్రతీ ఆర్థిక సంవత్సరంలో రిజర్వ్‌బ్యాంక్ ఆ ఏడాది జారీచేయబోయే వివిధ విడతల సావరిన్ గోల్డ్ బాండ్ల (ఎస్‌జీబీలు) విడుదల తేదీలు, వాటి రిడంప్షన్ (నగదుగా మార్చుకోవడం) తేదీలను వెల్లడిస్తుంది. ఎస్‌జీబీల కాలపరిమితి ఎనిమిదేండ్లు. జారీచేసిన తేది నుంచి ఐదేండ్ల తర్వాత ముందస్తు రిడంప్షన్‌ను కూడా అనుతిస్తారు. 2016లో జారీచేసిన రెండు విడతల ఎస్‌జీబీలు ఈ ఏడాది ఇప్పటికే తుది రిడంప్షన్‌కు వచ్చాయి. వీటికి జారీచేసిన విలువతో పోలిస్తే 140 శాతం వరకూ అధిక విలువను ఆర్బీఐ ఆఫర్ చేసింది. ఈ నేపథ్యంలో 2024లో తుది రిడంప్షన్‌కు వచ్చిన, రాబోతున్న ఎస్‌జీబీల వివరాలివే..

### సావరిన్ గోల్డ్ బాండ్స్ 2016– సిరీస్ 1

ఈ సిరీస్ ఎస్‌జీబీ 2024 ఫిబ్రవరి 8న మెచ్యూర్ అయ్యింది. 2016లో దీనిని గ్రాముకు రూ. 2,600 ధరను నిర్ణయించారు. తుది రిడంప్షన్ సమయంలో ప్రతీ ఒక్క ఎస్‌సీబీ యూనిట్‌కు రూ.6,271 ధర ఇచ్చారు.

### ఎస్‌సీబీ 2016– సిరీస్ 2

ఈ మార్చి 22న రిజర్వ్‌బ్యాంక్ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం 2016 ఎస్‌జీబీ–సిరీస్ 2 మార్చి 28 రిడంప్షన్ తేదీగా నిర్ణయించారు. తుది రిడంప్షన్‌లో ప్రతీ ఎస్‌జీబీ యూనిట్‌కు రూ.6,601 ధర చెల్లించనున్నట్టు ప్రకటించారు. ఈ సిరీస్ ఎస్‌సీబీలను రూ.3,119 ధరతో జారీచేశారు.

### ఎస్‌జీబీ 2016-17 సిరీస్ 1

2016 ఆగస్టు 5న ఈ సిరీస్ బాండును రూ.3,119 ధరతో జారీచేశారు. ఈ కారణంగా 2024 ఆగస్టు తొలివారంలో ఇది తుది రిడంప్షన్‌కు వస్తుంది. ఈ బాండ్లలో చేసిన పెట్టుబడిపై 2.75 శాతం చొప్పున వార్షిక వడ్డీ సైతం లభిస్తుంది. వడ్డీని ఆరునెలలకోసారి చెల్లిస్తారు. చివరి వడ్డీ వాయిదాను మాత్రం రిడంప్షన్ సమయంలో బాండ్‌కు నిర్ణయించిన ధరతో పాటు చెల్లిస్తారు.

### ఎస్‌జీబీ 2016–17–సిరీస్ 2

2016 సెప్టెంబర్ 30న ఈ సిరీస్ బాండును రూ.3,150 ధరతో జారీచేశారు. దీంతో ఇది 2024 సెప్టెంబర్ చివరివారంలో తుది రిడంప్షన్‌కు వస్తుంది.

### ఎస్‌జీబీ 2016–17–సిరీస్ 3

2016 నవంబర్ 17న ఈ సిరీస్ బాండును రూ.3,007 ధరతో జారీ చేశారు. దీంతో ఇది 2024 నవంబర్ 17న తుది రిడంప్షన్‌కు వస్తుంది. ఈ బాండ్‌పై 2.50 శాతం వడ్డీని ఆఫర్ చేశారు.

### మదుపుదారులు తెలుసుకోవాల్సిన వివరాలు

- బ్యాంకు పనిదినాలకు అనుగుణంగా తుది రిడంప్షన్ తేదీలు మారే అవకాశం ఉంటుంది. –రిడంప్షన్ తేదీకి నెలరోజుల ముందుగా ఎస్‌జీబీ మదుపుదారులకు ఆర్బీఐ ఈమెయిల్, ఎస్ఎంఎస్‌ల ద్వారా నోటిఫికేషన్స్ పంపుతుంది.
- ఇండియన్ బులియన్ జ్యువెలర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) ప్రకటించే 999 స్వచ్ఛత గల బంగారం ధర ఐదు పనిదినాల సగటు ఆధారంగా ఎస్‌జీబీల రిడంప్షన్ ధరను ఆర్బీఐ నిర్ణయిస్తుంది.
- వ్యక్తిగత మదుపుదారులకు ఎస్‌జీబీలపై మూలధన లాభాల పన్ను మినహాయింపు ఉంటుంది.

# లెక్క మారింది!



పంథా మార్చిన రైజర్స్

బాదుడే పరమావధిగా ముందుకు

హడలెత్తుతున్న ప్రత్యర్థులు



'కొడితే కొట్టాలిరా.. సిక్స్ కొట్టాలి' అన్న చందంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు చెలరేగిపోతున్నారు. మొన్న మొన్నటి వరకు మంచి బౌలింగ్ జట్టుగా పేరున్న రైజర్స్.. ఇప్పుడు ఆ గుర్తింపును తుడిపేసుకొని.. ప్రత్యర్థి బౌలర్లపై పంజా విసురుతోంది. గతంలో రైజర్స్ బౌలింగ్ చూసి భయపడ్డ ప్రత్యర్థులు ఇప్పుడు హైదరాబాద్ బ్యాటింగ్‌కు దిగుతోందంటే జడిసిపోతున్నారు.

పదేండ్లుగా పదిలంగా ఉన్న అత్యధిక పరుగుల రికార్డును ఈ సీజన్‌లో బద్దలు కొట్టిన రైజర్స్.. ఇరవై రోజుల్లోపే మరోసారి తమ రికార్డును బ్రేక్ చేసింది. ముంబై బౌలర్లను ఊచకోత కోసిన మనవాళ్లు.. బెంగళూరు బౌలర్లపై సునామీలా విరుచుకుపడ్డారు. ఈ దెబ్బకు అత్యధిక సిక్సర్ల రికార్డు సైతం రైజర్స్ ఖాతాలో చేరింది. గ్రౌండ్‌లో అడుగుపెట్టడానికి ముందే ప్రత్యర్థులను భయపెడుతున్న రైజర్స్ బ్యాటింగ్ బోల్డ్‌నెస్‌పై ప్రత్యేక కథనం..

విజయక్రాంతి, ఖేల్ విభాగం

ఐపీఎల్లో అత్యుత్తమ బౌలింగ్ దళమనే పేరు సంపాదించుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ పంథా మార్చుకుంది. ఒకప్పుడు రైజర్స్‌తో మ్యాచ్ అంటే మన బౌలింగ్ దాడిని చూసి ప్రత్యర్థులు భయపడేవారు. బౌలర్లను ఎదుర్కోవడం కోసం ప్రత్యేకంగా ప్రణాళికలు రచించుకొని బరిలోకి దిగేవారు. కానీ ఇప్పుడు లెక్క మారింది. హైదరాబాద్‌తో మ్యాచ్ అంటే.. ముందు బ్యాటర్లను ఎలా అడ్డుకోవాలా అని ప్రతి జట్టు జుట్టు పీక్కుంటుంది. అవును నిజమే.. తాజా సీజన్‌లో హైదరాబాద్ జోరు చూస్తే ఈ వాఖ్యల్లో తప్పులేదనిపించడం ఖయామే. సాధారణంగా సన్‌రైజర్స్ మొదట బ్యాటింగ్ చేస్తే.. 140 పరుగులు చేయడమే పెద్ద గొప్ప అని గతంలో అనుకునే వాళ్లు. కానీ ఇప్పుడు ఆ జట్టు మొదట బ్యాటింగ్ చేయకపోతే బాగుండు అని భావిస్తున్నారు. తాజాగా ఢిల్లీ క్యాపిటల్స్ బౌలింగ్ కోచ్ జేమ్స్ హోప్ మాట్లాడుతూ.. 'సీజన్‌లో బ్రేకుల్లేని రైలులా దూసుకెళ్తున్న హైదరాబాద్‌తో మ్యాచ్‌కు సిద్ధమయ్యాం. వారి బ్యాటర్ల కోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం' అని అన్నాడంటే.. రైజర్స్ బ్యాటింగ్ ప్రత్యర్థుల్లో ఎంతలా దడపుట్టిస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఐపీఎల్ 17వ సీజన్‌లో ఇప్పటి వరకు ఆరు మ్యాచ్‌లు ఆడిన హైదరాబాద్ అందులో మూడు సార్లు అలవోకగా రెండొందల పైచిలుకు పరుగులు చేయడం విశేషం. అందులో రెండు మ్యాచ్‌ల్లో అయితే 250 మార్క్ దాటింది. ఉప్పల్‌లో పరుగుల ఉప్పెన సృష్టిస్తూ ఐపీఎల్లో అత్యధిక పరుగుల రికార్డును తమ పేరిట లిఖించుకున్న కమిన్స్ సేన.. పది రోజుల్లోనే తిరిగి ఆ రికార్డును బద్దలుకొట్టింది. ఈ సారి బెంగళూరు బౌలర్ల భరతం పడుతూ చెలరేగిపోయింది. అయితే ఇక్కడ చెప్పుకోవాల్సిన విషయం ఏంటంటే.. తాజా సీజన్‌లో హైదరాబాద్ విజయాల్లో ఏ ఒక్కరి పాత్రో ప్రధానంగా ఉందనుకుంటే పొరబాటే. అవకాశం వచ్చిన ప్రతి ఒక్కరూ జట్టుకు అవసరమైనప్పుడు రాణిస్తుండటంతోనే రైజర్స్ రికార్డులు బ్రేక్ చేయగలుగుతున్నది. క్లాసెన్, హెడ్, మార్క్‌రమ్ వంటి అంతర్జాతీయ స్టార్లతో పాటు.. అభిషేక్ శర్మ, అబ్దుల్ సమద్, నితీశ్ కుమార్ రెడ్డి వంటి యువ ఆటగాళ్లు దంచికొట్టడంతోనే ఇది సాధ్యపడింది.

## క్లాసెన్ క్లాసిక్ స్టార్ట్

ఈ సీజన్‌లో హైదరాబాద్ తొలి మ్యాచ్ కోల్‌కతాతో ఆడింది. టాస్ గెలిచిన సన్‌రైజర్స్ ప్రత్యర్థికి బ్యాటింగ్ అప్పగించగా.. నైట్‌రైడర్స్ బ్యాటర్లు 7 వికెట్ల నష్టానికి 208 పరుగులు చేశారు. సాల్ట్ (54), రస్సెల్ (64) మెరిశారు. లక్ష్యాన్ని చూసిన విశ్లేషకులు ఇక హైదరాబాద్ పనైపోయినట్లే అనే నిర్ణయానికి వచ్చేశారు. రైజర్స్ ఇన్నింగ్స్ కూడా అందుకు తగ్గట్లే సాగింది. కానీ ఆశలే లేని స్థితిలో క్లాసెన్ రెచ్చిపోయాడు. కోల్‌కతా బౌలింగ్‌ను చీల్చి చెండాడుతూ.. ఈడెన్ గార్డెన్స్‌లో సిక్సర్ల సునామీ సృష్టించాడు. కేవలం 29 బంతుల్లోనే 63 పరుగులు చేసి తొలి మ్యాచ్‌తోనే ప్రత్యర్థులకు గట్టి హెచ్చరికలు పంపాడు. ఆ ఇన్నింగ్స్‌లో ఎనిమిది సిక్సర్లు కొట్టిన క్లాసెన్.. జట్టు విజయానికి 4 పరుగుల దూరంలో ఔటయ్యాడు. ఫలితం రైజర్స్‌కు అనుకూలంగా రాకపోయినా.. ఆ స్ఫూర్తి సీజన్ మొత్తం కొనసాగుతోంది.

### ఈ సీజన్‌లో రైజర్స్ ప్రదర్శన

కోల్‌కతా చేతిలో 4 వికెట్ల తేడాతో ఓటమి
ముంబైపై 31 పరుగుల తేడాతో జయభేరి
గుజరాత్ చేతిలో 7 వికెట్ల తేడాతో పరాజయం
చెన్నైపై 6 వికెట్ల తేడాతో గెలుపు
పంజాబ్‌పై 2 పరుగుల తేడాతో జయకేతనం
బెంగళూరుపై 25 పరుగుల తేడాతో విక్టరీ

## చిన్నస్వామిలో అరాచకం

అప్పటికే లీగ్‌లో అత్యధిక స్కోరు తమ పేరిట రాసుకున్న సన్‌రైజర్స్.. ఇరవై రోజులు తిరగకముందే దాన్ని బద్దలుకొట్టింది. ముంబై బౌలర్లను చెడుగుడాడుకున్న రైజర్స్ బ్యాటర్లు.. బెంగళూరు బౌలర్లపై దండయాత్ర ప్రకటించారు. ఒకరిని మించి ఒకరు రెచ్చిపోవడంతో రైజర్స్ అత్యధిక పరుగుల జాబితాలో తొలి రెండు స్థానాలు హస్తగతం చేసుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన రైజర్స్ 3 వికెట్ల నష్టానికి 287 పరుగులు చేసింది. ట్రావిస్ హెడ్ (41 బంతుల్లో 102; 9 ఫోర్లు, 8 సిక్సర్లు) రికార్డు సెంచరీ బాదితే.. క్లాసెన్ (67; 2 ఫోర్లు, 7 సిక్సర్లు) మరోసారి తన సిక్సర్ల పవర్ చాటాడు. చివర్లో అబ్దుల్ సమద్ (10 బంతుల్లో 37 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) ఫినిషింగ్ టచ్ ఇవ్వడంతో రైజర్స్ కొండంత స్కోరు చేసింది.ఛేదనలో బెంగళూరు పోరాడినా ఫలితం లేకపోయింది.



## ఉప్పల్‌లో ఊచకోత

*తొలి మ్యాచ్‌లో త్రుటిలో పరాజయం పాలైన హైదరాబాద్.. రెండో మ్యాచ్‌లో విశ్వరూపం చూపింది. సొంతగడ్డ అయిన ఉప్పల్ స్టేడియంలో ఊహకందని విధ్వంసాన్ని సృష్టించింది. క్రీజులో అడుగుపెట్టిన ప్రతి ప్లేయర్ బాదుడే పరమావధిగా చెలరేగిపోవడంతో ముంబై బౌలర్లు చేష్టలుడిగి చూస్తుండిపోయారు. హెడ్ (24 బంతుల్లో 62; 9 ఫోర్లు, 3 సిక్సర్లు), అభిషేక్ శర్మ (23 బంతుల్లో 63; 3 ఫోర్లు, 7 సిక్సర్లు), క్లాసెన్ (34 బంతుల్లో 80 నాటౌట్; 4 ఫోర్లు, 7 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా రెచ్చిపోవడంతో ఐపీఎల్ చరిత్రలో అత్యధిక స్కోరు (277/3) నమోదు చేసుకుంది. రైజర్స్ దెబ్బతో దశాబ్దానికిపైగా బెంగళూరు పేరిట ఉన్న అత్యధిక పరుగుల రికార్డు బద్దలైంది. మనవాళ్ల ధాటికి బుమ్రా మినహా మిగిలిన బౌలర్లంతా భారీగా పరుగులు సమర్పించుకున్నారు.*

## రజనీ శాసించాడు.. కావ్య పాటించింది






'మంచి ఆటగాళ్లను తీసుకోండి.. కావ్య బాధపడటం చూడలేకపోతున్నా' అని సూపర్ స్టార్ రజనీకాంత్ ఇచ్చిన సలహాలను పక్కాగా పాటించిన రైజర్స్.. మినీ వేలంలో ఆచి తూచి ఆటగాళ్లను ఎంపిక చేసుకుంది. ఆస్ట్రేలియాకు వన్డే ప్రపంచకప్ అందించిన స్టార్ పేసర్ ప్యాట్ కమిన్స్‌ను 20 కోట్లకు పైగా వెచ్చించి కొనుగోలు చేసుకుంది. ఇక కంగారూ ఓపెనర్ ట్రావిస్ హెడ్‌ను మాత్రం తక్కువలోనే కొట్టేసింది. మార్క్‌రమ్ మీద నుంచి కెప్టెన్సీ భారం తొలగించి సారథ్య బాధ్యతలు కమిన్స్‌కు అప్పచెప్పగా.. అతడు కూడా దంచికొడుతున్నాడు. ఇక సిక్సర్లు తప్ప బౌండ్రీలు వద్దే వద్దు అన్నట్లు చెలరేగుతున్న క్లాసెన్.. ఈ సీజన్‌లో రైజర్స్‌కు ట్రంప్ కార్డ్‌లా మారాడు. ఫలితంగా సన్‌రైజర్స్ లీగ్‌లో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో నాలుగు విజయాలు సాధించగా.. డగౌట్‌లో రైజర్స్ యజమాని కావ్య ఆనందంగా కనిపిస్తోంది. గత సీజన్‌లో హైదరాబాద్ వరుస ఓటములు పాలవుతున్న సమయంలో రజనీ.. కావ్యకు మంచి ఆటగాళ్లను ఎంపిక చేసుకోమని సలహా ఇచ్చిన విషయం తెలిసిందే.

### ఆరెంజ్ క్యాప్



361 విరాట్ కోహ్లీ బెంగళూరు

### పర్పుల్ క్యాప్



13 బుమ్రా ముంబై

### ఐపీఎల్‌లో నేటి మ్యాచ్

వేదిక: లక్నో
సమయం: రా.7.30

### పాయింట్ల పట్టిక 2024

| జట్టు | మ్యా | గె | ఓ | ర.రే | పా |
|---|---|---|---|---|---|
| రాజస్థాన్ | 7 | 6 | 1 | 0.67 | 12 |
| కోల్‌కతా | 6 | 4 | 2 | 1.39 | 8 |
| చెన్నై | 6 | 4 | 2 | 0.72 | 8 |
| హైదరాబాద్ | 6 | 4 | 2 | 0.50 | 8 |
| లక్నో | 6 | 3 | 3 | 0.03 | 6 |
| ఢిల్లీ | 7 | 3 | 4 | -0.07 | 6 |
| ముంబై | 7 | 3 | 4 | -0.19 | 6 |
| గుజరాత్ | 7 | 3 | 4 | -1.30 | 6 |
| పంజాబ్ | 7 | 2 | 5 | -0.19 | 4 |
| బెంగళూరు | 7 | 1 | 6 | -1.18 | 2 |

నోట్: మ్యా-మ్యాచ్‌లు, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర.రే-రన్‌రేట్, పా-పాయింట్లు

# లక్నో X చెన్నై | రాత్రి 7.30 నుంచి..



లక్నో, ఏప్రిల్ 18: వరుస విజయాలతో జోరు మీదున్న చెన్నై సూపర్ కింగ్స్.. శుక్రవారం లక్నో సూపర్ జెయింట్స్‌తో తలపడనుంది. తాజా సీజన్‌లో చెన్నై ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో నాలుగు విజయాలు, రెండు ఓటములతో పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో ఉంది. మరోవైపు లక్నో మాత్రం సీజన్‌లో పడుతూ లేస్తూ తమ ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. లక్నో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో మూడు విజయాలతో ఐదో స్థానంలో ఉంది. అన్ని రంగాల్లో పటిష్టంగా కనిపిస్తున్న చెన్నైను తట్టుకొని లక్నో ఏ మేరకు నిలబడుతుందనేది ఆసక్తికరం. చెన్నై జట్టు బ్యాటింగ్ సమతుల్యంగా ఉంది. అజింక్యా రహానే, రచిన్ రవీంద్రలు ఆరంభాలను ఇస్తున్నప్పటికి భారీ స్కోర్లు చేయడంలో విఫలమవుతున్నారు. ఇక కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, శివమ్ ధూబే, డారిల్ మిచెల్‌లతో మిడిలార్డర్ పటిష్టంగా కనిపిస్తోంది. ఆల్‌రౌండర్ జడేజా తన పాత్రను సమర్థంగా పోషిస్తున్నాడు. ఇక ఫినిషర్‌గా ధోని అదరగొడుతున్నాడు. మరోవైపు లక్నో బ్యాటింగ్ సమస్యలతో సతమతమవుతున్నది.



# పాక్‌తో సిరీస్‌కు సిద్ధం: రోహిత్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో టెస్టు సిరీస్ ఆడేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ పేర్కొన్నాడు. అయితే ఈ మ్యాచ్ తటస్థ వేదికపై జరిగితే మంచిదని అభిప్రాయపడ్డాడు. పాడ్‌కాస్ట్ కు ఇంటర్వ్యూ ఇచ్చిన రోహిత్ మాట్లాడుతూ.. 'పాక్‌తో ఆడడం నాకు చాలా ఇష్టం. రెండు జట్ల మధ్య మ్యాచ్ అంటే ఎప్పుడు హోరాహోరీగానే ఉంటుంది. రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతినడంతో ఐసీసీ ట్రోఫీల్లో మాత్రమే వారితో మ్యాచ్‌లు ఆడుతున్నాం. తటస్థ వేదికల్లో భారత్, పాక్ మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు నిర్వహిస్తే మేము ఆడేందుకు సిద్ధం. పాకిస్థాన్ బౌలింగ్ బాగుంటుంది. వారి బౌలింగ్‌లో ఆడుతుంటే ఆ మజా వేరుగా ఉంటుంది. నాకు తెలిసి 2007-08లో చివరి సారి పాకిస్థాన్‌తో టెస్టు మ్యాచ్ ఆడానుకుంటా. అదే (భారత్-పాక్ సిరీస్) జరిగితే మాత్రం మీరు ఒక మంచి ఆటను చూస్తారు" అంటూ చెప్పుకొచ్చాడు. మరోవైపు టీ20 ప్రపంచకప్‌కు సంబంధించి జట్టు ఎంపికపై తాను బీసీసీఐ సెలక్టర్ అజిత్ అగార్కర్‌ను కలిసినట్లు వస్తున్న వార్తలపై కూడా రోహిత్ స్పందించాడు. 'ఆ వార్త నిజం కాదు. నేనెవరిని కలవలేదు. నేను ఐపీఎల్‌లో బిజీగా ఉన్నా.. అగార్కర్ దుబాయ్‌లో గోల్ఫ్ ఆడుతూ బిజీగా ఉన్నాడు. ఇక కోచ్ రాహుల్ భాయ్ కుటుంబంతో గడుపుతున్నాడు. ఏదైనా కీలక సమాచారం ఇవ్వాలనుకుంటే మా ముగ్గురిలో ఎవరో ఒకరం అందరికి తెలిసేలా వెల్లడిస్తాం' అని వెల్లడించాడు.



## మహీ భాయ్‌ని ఒప్పించడం కష్టం..

*ఇక మహీ భాయ్ (ఎంఎస్ ధోని)ని టీ20 ప్రపంచకప్ కోసం వెస్టిండీస్‌కు వచ్చేలా ఒప్పించడం కష్టమని పేర్కొన్నాడు. ప్రస్తుతం ఐపీఎల్‌లో బిజీగా ఉన్న ధోని మ్యాచ్‌లు ఆడి అలసిపోతాడు. టీ20 ప్రపంచకప్ కోసం ధోనిని విండీస్ కు రప్పించలేమని.. అయితే గోల్ఫ్ ఆడేందుకు అతను అమెరికా వచ్చే అవకాశాలున్నాయన్నాడు. ఇక 2021 టీ20 ప్రపంచకప్ సమయంలో ధోని భారత జట్టుకు మెంటార్‌గా వ్యవహరించిన సంగతి తెలిసిందే. రోహిత్ ఇంకా మాట్లాడుతూ.. ఐపీఎల్‌లో అమలు చేస్తోన్న 'ఇంపాక్ట్ ప్లేయర్' రూల్ తనకు నచ్చలేదని పేర్కొన్నాడు. ఇంపాక్ట్ నిబంధన వల్ల వాషింగ్టన్ సుందర్, శివమ్ దూబే లాంటి ఆల్‌రౌండర్లు బౌలింగ్ చేయలేకపోతున్నారని అభిప్రాయపడ్డాడు.*


## కాన్వే ఔట్..

చెన్నై: న్యూజిలాండ్ స్టార్ ఓపెనర్ డ్వేన్ కాన్వే ఐపీఎల్ 17వ సీజన్‌కు పూర్తిగా దూరమయ్యాడు. అతడి స్థానంలో చెన్నై జట్టు రిచర్డ్ గ్లీసన్‌ను ఎంపిక చేసుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. కాన్వే ఐపీఎల్‌కు ముందు ఆసీస్‌తో టీ20 మ్యాచ్ సందర్భంగా ఫీల్డింగ్ చేస్తూ గాయపడ్డాడు. సర్జరీ జరిగినప్పటికి అతను కోలుకునేందుకు సమయం పట్టనుండడంతో ఈ సీజన్ నుంచి పూర్తిగా తప్పుకున్నాడు. కాగా 2023లో చెన్నై టైటిల్ సాధించడంలో కాన్వే కీలకపాత్ర పోషించాడు. గత సీజన్‌లో కాన్వే 15 ఇన్నింగ్స్‌ల్లో 140 స్ట్రైక్ రేట్‌తో 672 పరుగులు సాధించాడు.



## వినేశ్ పైనే ఆశలు..

బిష్కెక్ (కిర్గిస్థాన్): పారిస్ ఒలింపిక్స్ బెర్త్ సంపాదించడమే లక్ష్యంగా భారత రెజ్లర్లు సమాయత్తమవుతున్నారు. శుక్రవారం నుంచి కిర్గిస్థాన్ వేదికగా జరగనున్న ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్ టోర్నీలో భారత్ నుంచి 16 మంది రెజ్లర్లు పోటీపడుతున్నారు. స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌పైనే అందరి దృష్టి ఉంది. మొత్తం 36 కోటాలకు గానూ 18 వెయిట్ కేటగిరీల్లో ఈ పోటీలు జరగనున్నాయి. ఇప్పటికే మహిళల 53 కేజీల విభాగంలో అంతిమ్ పంగల్ పారిస్ ఒలింపిక్స్ బెర్తు ఖరారు చేసుకుంది.



## కోహ్లీకి అరుదైన గౌరవం..

న్యూఢిల్లీ: భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీకి అరుదైన గౌరవం దక్కింది. ఏప్రిల్ 18.. ప్రపంచ వారసత్వ సంపద దినోత్సవం సందర్భంగా జైపూర్‌లోని వాక్స్ మ్యూజియంలో కోహ్లి మైనపు విగ్రహాన్ని ఆవిష్కరించారు. 35 కేజీల బరువున్న మైనపు విగ్రహాన్ని తయారు చేసేందుకు దాదాపు రెండు నెలలు పట్టిందంటూ మ్యూజియం డైరెక్టర్ అనూప్ శ్రీవాస్తవ వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ.. ఏడాదిగా మ్యూజియానికి వస్తున్న పర్యాటకులు కోహ్లి మైనపు విగ్రహాన్ని పెట్టాలంటూ డిమాండ్ చేయడంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా ఈ మ్యూజియంలో ఇప్పటికే 44 మైనపు విగ్రహాలను ఏర్పాటు చేయగా.. వారిలో క్రికెటర్లు సచిన్ టెండూల్కర్, ఎంఎస్ ధోని ఉన్నారు. తాజాగా వీరి సరసన కోహ్లి చేరాడు.

# సూర్య ప్రతాపం



ఉత్కంఠ ఊపేసిన పోరులో ముంబైని విజయం వరించింది. మొదట బ్యాటర్లు సమష్టిగా సత్తాచాటడంతో భారీ స్కోరు చేసిన పాండ్యా సేన.. ఆనక బౌలర్లు కూడా బాధ్యత పంచుకోవడంతో లీగ్‌లో మూడో విజయం నమోదు చేసుకుంది. టాపార్డర్ విఫలమైన చోట శశాంక్, అశుతోష్ సిక్సర్లతో భయపెట్టినా ఒత్తిడిని జయించిన ముంబై ఎట్టకేలకు గట్టెక్కింది. బుమ్రా, కోట్జీ చెరో మూడు వికెట్లతో విజయంలో కీలక పాత్ర పోషించారు.

### ముంబైకి మూడో విజయం • పోరాడి ఓడిన పంజాబ్

ముల్లాన్‌పూర్: ఐపీఎల్లో పడుతూ లేస్తూ సాగుతున్న ముంబై ఇండియన్స్ మూడో విజయం ఖాతాలో వేసుకుంది. బ్యాటర్ల జోరుకు బౌలర్ల సహకారం తోడవడంతో.. గురువారం జరిగిన పోరులో ముంబై 9 పరుగుల తేడాతో పంజాబ్ కింగ్స్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. సూర్యకుమార్ యాదవ్ (53 బంతుల్లో 78; 7 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధశతకంతో రాణించగా.. హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ (36; 2 ఫోర్లు, 3 సిక్సర్లు), హైదరాబాదీ తిలక్ వర్మ (18 బంతుల్లో 34 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) ఆకట్టుకున్నారు. ఇషాన్ కిషన్ (8), కెప్టెన్ హార్దిక్ పాండ్యా (10) విఫలమయ్యారు. పంజాబ్ బౌలర్లలో హర్షల్ పటేల్ 3, సామ్ కరన్ రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో పంజాబ్ 19.1 ఓవర్లలో 183 పరుగులకు ఆలౌటైంది. యువ ఆటగాళ్లు అశుతోష్ శర్మ (28 బంతుల్లో 61; 2 ఫోర్లు, 7 సిక్సర్లు), శశాంక్ సింగ్ (25 బంతుల్లో 41; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) పోరాడారు. శిఖర్ ధవన్ స్థానంలో ఈ మ్యాచ్‌లో పంజాబ్‌కు సామ్ కరన్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. సాధారణంగా లోయర్ మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కు వచ్చే కరన్ (6) ఓపెనర్‌గా వచ్చి విఫలం కాగా.. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (0), రిలీ రొసో (1), లివింగ్‌స్టోన్ (1), హర్‌ప్రీత్ (13) ఇలా వచ్చి అలా వెళ్లారు. ముంబై బౌలర్లలో బుమ్రా, కోట్జీ చెరో మూడు వికెట్లు పడగొట్టారు.

### సంక్షిప్త స్కోర్లు

**ముంబై:** 192/7 (సూర్యకుమార్ 78, రోహిత్ 36; హర్షల్ 3/31, సామ్ కరన్ 2/41), **పంజాబ్:** 19.1 ఓవర్లలో 193 ఆలౌట్ (అశుతోష్ 61, శశాంక్ 41; బుమ్రా 3/21, కోట్జీ 3/32).



అశుతోష్ (61)

## భయపెట్టిన అశుతోష్..

ముంబై బౌలర్ల ధాటికి 77 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డ పంజాబ్‌ను యువ ఆటగాళ్లు ఆదుకున్నారు. అసాధ్యమనిపించిన లక్ష్యాన్ని ఛేదించాలనే కసితో అందిన బంతిని అందినట్లు బౌండ్రీ దాటించారు. వేగంగా పరుగులు రాబట్టే క్రమంలో శశాంక్ ఔటైనా.. అశుతోష్ మాత్రం అదరగొట్టాడు. ముంబై బౌలర్ల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తూ భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. చూస్తుండగానే లక్ష్యం కరిగిపోగా.. 18 బంతుల్లో 25 పరుగులు చేయాల్సిన దశలో అశుతోష్ ఔటవడంతో పంజాబ్ విజయానికి దూరమైంది.



# స్టాండ్ ఫ్యాన్.. వేడి పారాహుషార్!

రాష్ట్రవ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. బయటకు వద్దామంటే మాడు పగిలే ఎండలు.. ఇంట్లో ఉందామంటే ఉక్కపోత.. ఏసీలు, కూలర్లు ఉంటే కానీ ఇంట్లో గడిపే పరిస్థితి లేదు. అందుకే ఏసీలు, కూలర్లు కొనుక్కోలేని వారు ఫ్యాన్లతో టేబుల్ ఫ్యాన్లతో సరిపెట్టుకుంటున్నారు. గురువారం హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో ఓ వృద్ధురాలు స్టాండ్ ఫ్యాన్ కొనుక్కొని వెళ్తుండగా 'విజయ క్రాంతి' కెమెరాకు చిక్కింది.

# సర్కారు బడులకు కొత్త సొబగులు!

- వేసవి సెలవుల్లో పాఠశాలలకు మరమ్మతులు
- మౌలికవసతులు కల్పనకు ప్రభుత్వం పెద్దపీట
- జూన్ 11 కల్లా పనులు పూర్తి చేసేలా టార్గెట్

హైదరాబాద్, ఏప్రిల్ 18 (విజయ క్రాంతి): కార్పొరేట్ స్కూళ్లకు ఏమాత్రం తీసిపోకుండా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దేందుకు విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. పదో తరగతి పరీక్షలు ఇటీవల పూర్తి కాగా ఈ నెల 15 నుంచి ఒకటి నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఎస్ఏ–2 (సమ్మేటివ్ అసెస్‌మెంట్) పరీక్షలు జరుగుతున్నాయి. ఈ విద్యాసంవత్సరానికి ఈనెల 23వ తేదీ చివరి పనిదినం కాగా 24వ తేదీ నుంచి జూన్ 11 వరకు విద్యార్థులందరికీ వేసవి సెలవులను ప్రకటించనున్నారు. మళ్లీ కొత్త విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి ప్రారంభం కానుంది. అయితే ఈ వేసవి సెలవుల్లో ఆయా పాఠశాలల్లో ఉన్న చిన్న, పెద్ద మరమ్మతు పనులను పూర్తి చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. పెండింగ్ పనులతో పాటు పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతలను మహిళా సంఘాలతో




ఏర్పాటు చేసే అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు ప్రభుత్వం ఇటీవల అప్పగించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఈ కమిటీలను ఏర్పాటు చేసి, వారిచేత బ్యాంక్ ఖాతాలను తెరిపించడం, ఇంజినీరింగ్ అధికారులతో పనుల అంచనాలు, అనుమతులు, ఇన్‌స్పెక్షన్ తదితర పనులు అధికారులు చేపడుతున్నారు.

### 10 రకాల పనులు...

పాఠశాలల్లో మొత్తం 10 రకాల పనులను అధికారులు చేపట్టనున్నారు. స్కూళ్లలో మౌలిక వసతుల కల్పన, టాయిలెట్స్ నిర్మాణం, ప్రహరీ గోడలు, తరగతి గదులు, తలుపులు, మంచినీటి వసతి, విద్యుద్దీకరణ పనులు, శానిటేషన్ సహా సివిల్స్ వర్క్స్ పనులతోపాటు మేజర్, మైనర్ మరమ్మతులు కొంత కాలంగా పేరుకుపోయాయి. వీటన్నింటిని వేసవి సెలవుల్లో పూర్తి చేయనున్నారు. రాష్ట్రంలో 30,023 పాఠశాలలుండగా, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మన ఊరు–మన బడి, మన బస్తీ కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో 9,153 పాఠశాలల్లో పనులను ప్రారంభించారు. ఇందులో 1,200 వరకు పాఠశాలల పనులు పూర్తవడంతో వాటిని గత సంవత్సరంలోనే ప్రారంభించారు. మరి కొన్ని పాఠశాలల్లో పనులు జరుగుతున్న క్రమంలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడం, ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో ఆ పనులు పెండింగ్‌లో పడ్డాయి. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన తర్వాత కొద్ది రోజుల క్రితం విద్యాశాఖపై సమీక్ష చేసిన ఆయన పాఠశాల్లోని మౌలికవసతుల కల్పనపై దృష్టి సారించారు. అయితే కొత్తగా ఏర్పడ్డ రేవంత్ సర్కార్ మన ఊరు–మన బడి, మన బస్తీ పేరును ఉపయోగించకుండా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పేరుతోనే పనులను చేపడుతోంది. ఇప్పటికే పాఠశాలల్లో పనులు చేపట్టేందుకు రూ.1,100 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటితో పనులను చేపట్టేందుకు అధికారులు అంచనాలను రూపొందిస్తున్నారు.

### తూతూమంత్రంగానే అమ్మ ఆదర్శ కమిటీల ఏర్పాటు

హైదరాబాద్‌తోపాటు మరికొన్ని జిల్లాలోని పాఠశాల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను వేయకుండానే బ్యాంక్ ఖాతాలు ఓపెన్ చేయాలని విద్యాశాఖాధికారులు ఒత్తిడి చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. అధికారుల ఒత్తిడిని తట్టుకోలేకనే కొందరు హెచ్‌ఎంలు ఎలాంటి సమావేశాలు నిర్వహించకుండానే తూతూమంత్రంగా కమిటీల సభ్యుల పేర్లు రాసి బ్యాంకు ఖాతాలను ఓపెన్ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు అధికారులు ఈ రకంగా ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగార్చుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# ఎండలు మరింత తీవ్రతరం

- 2 నుంచి 3 డిగ్రీలు పెరుగుతాయని అంచనా
- కొన్ని జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం
- వాతావరణ శాఖ నివేదిక

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ బ్యూరో, ఏప్రిల్ 18 (విజయక్రాంతి): రాష్ట్రంలో శుక్రవారం అక్కడక్కడ వడగాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. కొన్ని జిల్లాల్లో 3 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు పెరిగే సూచనలు ఉన్నాయని వెల్లడించింది. రాగల మూడు రోజులు కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. శనివారం ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడవచ్చని వాతావరణ కేంద్రం వివరించింది. బుధవారం మన్నార్ గల్ఫ్ నుంచి దక్షిణ తెలంగాణ వరకు సముద్ర మట్టానికి 1.5 కిమీ ఎత్తున కొనసాగిన ద్రోణి గురువారం కోమరిన్ ప్రాంతం నుంచి అంతర్గత తమిళనాడు, రాయలసీమ మీదుగా దక్షిణ తెలంగాణ వరకు విస్తరించనున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం సముద్ర మట్టాలనికి 0.9 కిలో మీటర్ల ఎత్తున కొనసాగుతుందని వెల్లడించింది.

### నగరంలో రోడ్లన్నీ ఖాళీగా..

హైదరాబాద్ నగరంలోనూ ఎండలు తీవ్రరూపం దాలుస్తున్నాయి. కనీస ఉష్ణోగ్రతలు 42 నుంచి 45 డిగ్రీల సెంటిగ్రేడ్ నమోదవుతున్నాయి. సాధారణం కంటే 3 నుంచి 6 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో జనం భయటకు రావడానికి బెంబేలెత్తిపోతున్నారు. పగటిపూట ఉష్ణోగ్రతల కారణంగా నగరంలోని రోడ్లన్నీ ఖాళీగా కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు ఇంట్లోనే ఉండాలని హైదరాబాద్ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ జి.వెంకటి విజయక్రాంతితో గురువారం ప్రత్యేకంగా చెప్పారు. హైదరాబాద్ జిల్లాలోని వైద్యారోగ్యశాఖ పరిధిలోని 14 క్లస్టర్స్‌లోని 90 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 168 బస్తీ దవాఖానాల్లో మొత్తంగా 8.04 లక్షలకుపైగా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు సరఫరా చేశామని అధికాకరులు తెలిపారు. ఇందులో ఆర్టీసీ బస్టాండ్, బస్‌డిపోలు, పోలీసులకు 1.20 లక్షల అందించినట్లు వెల్లడించారు.

**అత్యధికంగా నమోదైన ఉష్ణోగ్రతలు ఇలా ఉన్నాయి..**

| | |
|---|---|
| మాడుగులపల్లి (నల్గొండ) | 45.2 |
| హాజీపూర్ (మంచిర్యాల) | 45.2 |
| మేడారం (ములుగు) | 45.1 |
| గొర్రెకుంట (వరంగల్) | 45.1 |
| వెల్గొండ (వనపర్తి) | 45.1 |
| వెల్గటూర్ (జగిత్యాల) | 45.0 |
| తాడిచర్ల (భూపాలపల్లి) | 44.9 |
| బుట్టాపూర్ (నిర్మల్ ) | 44.9 |
| పెనుబల్లి (ఖమ్మం) | 44.9 |
| అయ్యగారి పల్లి (మహబూబాబాద్) | 44.9 |
| కల్వచర్ల (పెద్దపల్లి) | 44.9 |
| చిట్యాల (సిద్దిపేట) | 44.8 |



## విజయవంతంగా క్రూయిజ్ క్షిపణి ప్రయోగం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: స్వదేశీ పరిజ్ఞానంతో భారత రక్షణ పరిశోధన సంస్థ డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన క్షిపణి (ఐటీసీఎం)ని శాస్త్రవేత్తలు విజయవంతంగా ప్రయోగించారు. ఒడిశాలోని చండీపూర్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ సెంటర్ నుంచి ఈ ప్రయోగాన్ని నిర్వహించారు. ఈ క్షిపణిని శాస్త్రవేత్తలు పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించారు. ఈ క్షిపణిని బెంగళూరులోని డీఆర్‌డీవోకి చెందిన ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం అభివృద్ధిపరిచింది. ఇందులో ప్రొపల్షన్ వ్యవస్థను బెంగళూరులోని గ్యాస్ టర్బైన్ రీసెర్చ్ సంస్థ తయారుచేసింది. ప్రయోగం సందర్భంగా క్షిపణిలోని అన్ని వ్యవస్థలు అంచనాల మేరకు పనిచేశాయని డీఆర్‌డీవో ఓ ప్రకటనలో తెలిపింది. క్షిపణి పనితీరును, వెళ్తున్న మార్గాన్ని ఎస్‌యూ–30–ఎంకే 1 విమానం నుంచి పరిశీలించారు. విజయవంతంగా క్షిపణిని ప్రయోగించినందుకు డీఆర్‌డీవో శాస్త్రవేత్తలకు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుభాకాంక్షలు తెలిపారు.

## వ్యయ పరిశీలకులుగా మోతీలాల్

సంగారెడ్డి, ఏప్రిల్ 18 (విజయ క్రాంతి) : జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకులుగా మోతీలాల్ ఎస్. షీలే(ఐఆర్‌ఎస్)ను కేంద్ర ఎన్నికల సంఘం నియమించింది. గురువారం ఆయన సంగారెడ్డికి చేరుకోవడంతో జిల్లా అదనపు కలెక్టర్ మాధురి మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.

# నెస్లేలో అధిక చక్కెర

**ఎట్టకేలకు అంగీకరించిన కంపెనీ**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: చిన్నారుల ఆహార ఉత్పత్తుల్లో అధిక చెక్కెర కలుపుతున్నట్టు ప్రముఖ అంతర్జాతీయ కంపెనీ నెస్లే అంగీకరించింది. ముఖ్యంగా పేద, అల్పాదాయ దేశాల్లో ఆ కంపెనీ విక్రయించే 'సెరెలాక్', 'నిడో' వంటి ఉత్పత్తుల్లో సుక్రోజ్, తేనె రూపంలో అధిక చెక్కెర కలుపుతున్నట్టు నెస్లే ఇండియా ప్రతినిధి అంగీకరించారు. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లో విక్రయించే నెస్లే ఉత్పత్తుల్లో చట్టవిరుద్ధంగా అధిక చెక్కెర కలుపుతున్నటు స్విట్జర్లాండ్‌కు చెందిన పబ్లిక్ ఐ అనే సంస్థ బయటపెట్టింది. దీంతో నెస్లే ఇండియా విభాగం స్పందించింది. 'శిశువులకు అత్యంత నాణ్యమైన ఆహార ఉత్పత్తులను అందించాలని మేం బలంగా విశ్వసిస్తున్నాం. గత ఐదేండ్లుగా నెస్లే ఇండియా తన ఉత్పత్తుల్లో చెక్కెర శాతాన్ని 30 శాతం తగ్గించింది' అని వివరించారు. ఫుడ్ యాక్షన్ నెట్‌వర్క్‌తో కలిసి నెస్లే ఉత్పత్తులను పరిశీలించిన పబ్లిక్ ఐ సంస్థ సంచలన విషయాలు బయటపెట్టింది. 'గోధుమలతో నెస్లే తయారుచేసే సెరెలాక్ ఉత్పత్తిలో జర్మనీ, బ్రిటన్‌లో విక్రయించే ప్యాకుల్లో చెక్కెర లేనేలేదు. అదే ఉత్పత్తిని ఇథియోపియాలో ప్రతి రెండు చెంచాలకు 5 గ్రాములు, థాయ్‌లాండ్‌లో 6 గ్రాముల చెక్కెర కలుపుతున్నది. ఇండియాలో 2.2 గ్రాముల చెక్కెర ఉంటున్నది.




ఇండియాలో నెస్లే 2022లో 250 మిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను విక్రయించింది. ఆ సంస్థ విక్రయిస్తున్న అన్ని ఉత్పత్తుల్లోనూ సగటున 3 గ్రాముల అదనపు చెక్కెర కలుపుతున్నది' అని పబ్లిక్ ఐ తన రిపోర్టులో పేర్కొన్నది. దీంతో నెస్లే సంస్థ వివరణ ఇచ్చింది.



## బీజేపీలో చేరిన భేతి సుభాష్‌రెడ్డి

ఉప్పల్, ఏప్రిల్ 18 : ఉప్పల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీ పార్టీలో చేరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటెల రాజేందర్‌ల సమక్షంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఉప్పల్ నియోజకవర్గం టికెట్ ఆశించినప్పటికీ అధిష్టానం బండారి లక్ష్మారెడ్డికి కేటాయించడం, పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిరిగి ఎంపీ టికెట్ తనకు వస్తుందని ఆశించిన ఇతరులకు కేటాయించడంతో ఆయన బీజేపీలో చేరారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ గెలుపు కోసం కృషి చేస్తానని ఆయన తెలిపారు.

# ప్రతిదాన్నీ అనుమానించొద్దు

**వీవీప్యాట్ల వినియోగం కేసు విచారణలో సుప్రీంకోర్టు**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: ఎన్నికల్లో ఈవీఎంల వాడకంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రతి విషయాన్ని అనుమానించటం సరికాదని పేర్కొన్నది. ఈవీఎంలు ట్యాంపరింగ్ అయ్యే ప్రమాదం ఉన్నదని, ఓటు వేసిప్పుడు ప్రతి ఓటుకు వీవీప్యాట్‌లు ఓటర్‌కు ఇచ్చేలా ఈసీని ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా.. ప్రస్తుతం ప్రతి నియోజకవర్గంలో ర్యాండమ్‌గా 5 ఈవీఎంలను ఎంపికచేసి ఓటువేసినప్పుడు వీవీప్యాట్లు వచ్చేవిధంగా చర్యలు తీసుకొన్నామని కోర్టుకు ఎన్నికల సంఘం తెలిపింది. పిటిషనర్లు కోరుతున్నట్టు ప్రతి ఓటుకు వీవీప్యాట్లు ఇవ్వటం అత్యంత కష్టంతో కూడుకొన్నదని తెలిపింది. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ తరఫున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ 'ఓటు వేసినప్పుడు వీవీప్యాట్ చూసేందుకు ఇప్పుడు 7 సెకండ్లు మాత్రమే లైట్ వెలుగుతున్నది. కనీసం ఆ లైట్ మళ్లీ ఆర్పేసేంతవరకైనా వెలిగేలా చూడాలి. ఓటరు సంతృప్తే అన్నింటికన్నా ముఖ్యం'



అని వాదించారు. దీనిపై ధర్మాసనం ఘాటుగా స్పందించింది. 'మిస్టర్ భూషణ్.. మీరు చాలా దూరం వెళ్తున్నారు. ఇది చాలా అతి. వీవీప్యాట్ కనిపించేందుకు ఏర్పాటుచేసిన గ్లాస్ పారదర్శకంగా ఉన్నా మబ్బుగా ఉన్నా అంతిమంగా ఓటరు నమ్మకమే ముఖ్యమమైనది. బల్బు వెలగటం.. వీవీప్యాట్ కనిపించటం అనేది ఓటర్ విశ్వాసానికి సహాయపడే అంశాలు మాత్రమే. ప్రతి విషయాన్నీ అనుమానించకూడదు. మీరు ప్రతి అంశాన్ని విమర్శించటం సాధ్యం కాదు. ఈసీ ఏదైనా మంచిపని చేస్తే అభినందించాల్సిన బాధ్యత మీపై ఉన్నది' అని సూచించింది.

## 'ఆప్' ఢిల్లీ మేయర్ అభ్యర్థిగా మహేష్ ఖిచి

- డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా రవీంద్ర భరద్వాజ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: ఢిల్లీ మహానగరంలో ఈనెల 26న మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక జరుగనున్న నేపథ్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మేయర్ అభ్యర్థిగా గురువారం కరోల్‌భాగ్ కౌన్సిలర్ మహేష్ ఖిచి, డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా అమన్ భాగ్ కౌన్సిలర్ రవీంద్ర భరద్వాజ్‌ను ప్రకటించింది. ఈ సందర్భంగా ఢిల్లీ మంత్రి గోపాల్ రాయ్ మాట్లాడుతూ.. పట్టభద్రుడైన మహేష్ ఖిచికి ప్రజాదరణ ఉందన్నారు. రవీంద్ర భరద్వాజ్‌కు పార్టీతో, ప్రజలతో మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. బీజేపీ కుట్రల్లో భాగంగానే సీఎం అరవింద్ కేజ్రీవాల్, డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా అరెస్టయ్యారని ఆరోపించారు. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 15 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న బీజేపీ ప్రజలకు ఏమీ చేయలేదని ఆప్ ఎమ్మెల్యే దుర్గేష్ పాఠక్ ఆరోపించారు.

# బిట్‌కాయిన్ స్కాం

***శిల్పాశెట్టి దంపతుల ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ***

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 : బిట్‌కాయిన్లతో మోసాలకు సంబంధించిన రూ.6,600 కోట్ల మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఈ మేరకు బాలీవుడ్ నటి శిల్పాశెట్టి, వ్యాపారవేత్త రాజ్‌కుంద్రా దంపతుల ఆస్తులను అటాచ్ చేసినట్లు ఈడీ గురువారం ప్రకటించింది. మొత్తంగా రూ.97.79 కోట్ల విలువైన స్థిర, చరాస్తులను అటాచ్ చేయగా అందులో జుహు ప్రాంతంలో శిల్పాశెట్టి పేరు మీద ఉన్న నివాస స్థలం, పుణెలో రాజ్‌కుంద్రా పేరు మీద ఉన్న నివాస భవనం, ఈక్విటీ షేర్లను ఈడీ అటాచ్ చేసింది. ఈ వ్యవహారం అంతా సింగపూర్ కేంద్రంగా ఫర్మ్ వేరియబుల్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో జరిగినట్లు వెల్లడించింది. 2018లో జరిగిన ఈ స్కామ్‌కు సంబంధించి మహారాష్ట్ర, ఢిల్లీ పోలీసులు అనేక కేసులు నమోదు చేయగా ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఈ వ్యవహారంలో రాజ్‌కుంద్రా లబ్ధి పొందారని స్పష్టం చేసింది.

వేరియబుల్ టెక్నాలజీ సంస్థ దేశవ్యాప్తంగా అనేక మంది పెట్టుబడిదారుల నుంచి 80,000 బిట్‌కాయిన్లు సేకరించగా, వాటి విలువ ప్రస్తుత ధరల ప్రకారం రూ.6,600 కోట్లు ఉంటుందని తెలిపింది. బిట్‌కాయిన్లలో పెట్టుబడులు పెడితే ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని అమాయకులను నమ్మించారని, ఆ తర్వాత ఇన్వెస్టర్లను మోసం చేసి ఇతర దేశాల్లో ఆస్తుల కొనుగోలుకు ప్రయత్నించారని ఈడీ ప్రకటించింది.

ఈ వ్యవహారంలో ప్రధాన సూత్రధారిగా ఉన్న అమిత్ భరద్వాజ్ నుంచి రాజ్‌కుంద్రా 285 బిట్‌కాయిన్లు తీసుకున్నారని, వాటితో ఉక్రెయిన్‌లో బిట్‌కాయిన్ మైనింగ్ ఫర్మ్‌ను ఏర్పాటు చేయాలనుకున్నారని తెలిపింది. ఇప్పటికీ ఆ బిట్



కాయిన్లు రాజ్‌కుంద్రా వద్దనే ఉన్నాయని, వాటి విలువ రూ.150 కోట్ల కంటే ఎక్కువే ఉంటుందని, అందుకే వారి ఆస్తులను అటాచ్ చేసినట్లు ఈడీ వివరించింది. కాగా ఈ స్కామ్‌లో ప్రధాన నిందితులుగా ఉన్న అజయ్ భరద్వాజ్, మహేంద్ర భరద్వాజ్ ఇప్పటికీ పరారీలో తిరుగుతున్నారని వెల్లడించింది. ఈ స్కాంతో సంబంధం ఉన్న ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త నిఖిల్ మహజన్‌ను ఈడీ జనవరిలో అరెస్ట్ చేసింది. ఈయన దుబాయ్‌లో అనేక సెమినార్లు నిర్వహించి పెట్టుబడిదారులను ఆకర్షించే ప్రయత్నం చేశారు. ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం ఒక బిట్‌కాయిన్ విలువ రూ.51 లక్షల వరకు ఉంది. కాగా ఈ బిట్‌కాయిన్ వ్యాపారం చట్టబద్ధమైనది కాదు.

విజయక్రాంతి
VOICE OF TELANGANA
For Advertisements
Contact
8712001511
For Circulation
Contact
8712001544

Printed and Published By Chilappagari Laxmi Rajam, on behalf of Intercontinental Publications Private Limited, Printed at Intercontinental Publications Private Limited, Survey No .713/P,H-No. 15-15/3 Dundigal Municipality, Gandimaisamma Mandal,Medchal - Malkajgiri District-Telangana 500043, Published at Plot No. 1267/A, Road No. 63/A, Jubilee Hills, HYDERABAD--500033, Telangana State. Editor: K. Krishna Murthy, RNI NO: TELTEL /2018/75203, Ph: +91 40 2355 6566.